- నటేశ్వరుని బాల్యం - విద్యాభ్యాసం - సాహిత్య ప్రస్థానం
- అవధాన శిరోమణి డా॥అయాచితం వారు
- అయాచితం వారి సంస్కృత సాహిత్యం
- అయాచితం నటేశ్వర శర్మ లఘు - దీర్ఘ కావ్యాలు
- నటేశ్వర శర్మ విమర్శ రచనలు - అనుశీలన
- అయాచితం వారి చిత్రకవితా పరిచయం
- అయాచితం వారి తెలుగు శతకాలు
- సౌందర్యలహరీ సౌందర్య దర్శనం

# మూసీ

# MUSI


• Samputi : 27 • Sanchika : 12 • Pages : 64 • Rs. 20
• October 2024


UGC CARE List
Approved Journal





Scanned with OKEN Scanner





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి


# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 12
అక్టోబర్ - 2024
'క్రోధి' ఆశ్వీజ మాసం

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992


## ఈ సంచికలో ...

### వ్యాసాలు


నటేశ్వరుని బాల్యం - విద్యాభ్యాసం - సాహితీ ప్రస్థానం ... డా. ఆరుట్ల శ్రీదేవి 7
అవధాన శిరోమణి డా. అయాచితం వారు ... డా. బోచ్కర్ ఓమ్ప్రకాశ్ 9
అయాచితం వారి సంస్కృత సాహిత్యం ... ఆచార్య త్రివేణి వంగరి 15
అయాచితం నటేశ్వర శర్మ లఘు - దీర్ఘ కావ్యాలు ... డా. జె. భారతి 21
నటేశ్వర శర్మ విమర్శ రచనలు - అనుశీలన ... ప్రసాదం స్వాతి 25
ఆచార్య దేవోభవ ... అయాచితం అహల్యాదేవి 28
అయాచితం వారి చిత్రకవితా పరిచయం ... సుప్పని సత్యనారాయణ 29
అయాచితం వారి తెలుగు శతకాలు ... ఎం. వేణుగోపాల శర్మ 33
సౌందర్యలహరీ సౌందర్య దర్శనం ... డా. ఎన్. అనంత లక్ష్మి 35
ఉభయ భాషా సాహితీ నటేశ్వరం శ్రీ షోడశీ - సంస్కృత స్తుతి ... సరస్వతీ రామశర్మ 37
అక్షరునికి నిరతాక్షరార్చన చేసిన అద్వైతి ... డా. కాచాపురం దుర్గాదేవి 39
సౌందర్య లహరీ సౌందర్య దర్శనం ... డా. వీపూరి వేంకటేశ్వర్లు 45
పండితుడే కాదు - ప్రవక్త కూడా ... ఎర్రాప్రగడ రామకృష్ణ 47
నటేశ్వరుని పద్య కవిత్వ తాండవం - ఋతుగీత ... తిగుళ్ళ శ్రీనివాస మూర్తి 49
అయాచితం నటేశ్వరా ! శతక వైభవం !! ... సుప్పని సత్యనారాయణ 53
తం సూర్యం ప్రణమామ్యహమ్! ... సాగి కమలాకర శర్మ 57
మా నాన్న ... కౌముది, జాహ్నవి, యామిని 59


### కవితలు


అజరామర పాండిత్య శిల్పం - అవధాని అవుసుల భానుప్రకాశ్ - 5; పునరపి జననం - చంద్రశేఖర్ - 14; నటేశ్వర శర్మ సారు ... మీ సాటివారు లేరు.. డా. బందరబోయిన శ్రీనివాస్ - 24; నటేశ్వరునకు నమస్సుమం ... రాధశ్రీ - 44; మొగులురేని సౌరు ... కీ.శే. అయాచితం నటేశ్వర శర్మ - 48; నటేశ్వర కీర్తి ... సేనాపతి భాష్యకాచార్యులు - 52 ; అశ్రు పుష్పాంజలి ... డా. గణపతి అశోక శర్మ - 62.




ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 4 హైదరాబాద్ అక్టోబర్ : 2024

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# పరమ పదము

అత్యున్నతము, ఉత్కృష్టము, ప్రధానము అనే అర్థాలు పరమ శబ్దానికి ఉన్నాయి. పరమ శబ్దం అతి ముఖ్యమైన ప్రదేశాలలోనే ఉపయోగించడం సంప్రదాయం. పరమాత్మ, పరమాన్నం, పరమం మొదలైన శబ్దాలన్నీ అత్యున్నతమని చెప్పడానికి వినియోగపడుతాయి. జీవితంలో ఉన్నత స్థాయిని సాధించినప్పుడు పరమోత్తముడనీ, జీవనానంతరం అత్యున్నతమైన మోక్షాన్ని సాధించినవారినీ పరమపదాన్ని చేరుకున్నారనీ చెప్పుకోవడం పరిపాటి.

తమ లోపలి శక్తిని వినియోగించుకుని నిరంతరం తాము చేరదలచుకున్న గమ్యాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తూ ఉండేవారు నిజమైన పరమ పదాన్ని చేరుకుంటారు. వారే ఈ లోకంలో గొప్ప పనులు చేసి, అత్యున్నతమైన పేరు ప్రఖ్యాతులు సాధించినవారు అవుతారు. తమలోని అత్యున్నతమైన శక్తిని నిరంతరం పెంచుకోవడమే లక్ష్యంగా ఉన్నవారికి తమ శరీరం ద్వారా చేసే పనులు అన్నీ సులువుగా పూర్తి అవుతాయి. బాగా ధనం ఉన్నవారు ఏ వస్తువునైనా కొనుగోలు చేయడం అత్యంత సులభం కదా! అదేవిధంగా అంతఃశక్తిని పెంచుకునే ప్రయత్నం చేస్తూ ఉంటే అత్యుత్తములుగా మారడం ప్రకృతిలో సంభవం.

అసలు ప్రయత్నం అంటేనే నిరంతరం శక్తితో సమాగమం పొంది ఉండడం. శక్తితో కలిస్తే శక్తివంతులు, శక్తిని అనవసర ప్రదేశాల్లో అధికంగా వినియోగించేవారు శక్తి హీనులు అవుతారు. శక్తి హీనులైన వారిని సమాజం, ప్రకృతి పట్టించుకోదు. శక్తివంతులైనప్పుడు మాత్రమే ప్రకృతి చేత సెలెక్ట్ చేయబడుతారు. శక్తి హీనులైనప్పుడు లోకంతో అనుబంధం పెట్టుకొని ఆలోచనలు పెంచుకొంటారు. ఫలితంగా తాము చేయదలచుకున్న కార్యక్రమాలు ఏమీ చేయలేక ఇబ్బందులు, అనారోగ్యం పాలు అవుతుంటారు. అందుకే ప్రయత్న పూర్వకంగా శక్తిని సాధిస్తూనే ఉండాలి. శక్తిని ఉపాసిస్తూనే ఉండాలి. దాని గూర్చిన ఆలోచనలే అధికంగా ఉండాలి. అవే జీవిత పరమ గమ్యం కావాలి.

అనేక రంగాల్లో ప్రఖ్యాతుల కన్నా కవులు, ఆధ్యాత్మికవేత్తలు కొంత ఎక్కువగా ప్రకృతితోనూ, శక్తితోనూ కలిసి జీవితాన్ని కొనసాగిస్తుంటారు. తమ కవిత్వంలోనూ, ప్రవచనాల్లోనూ ఆ శక్తిని గూర్చి అది వ్యక్తమయ్యే ప్రకృతిని గూర్చి తెలియజేస్తూ ఉంటారు. ఈ మార్గమే వారికి ఈ లోకంలో కీర్తి ప్రతిష్ఠలకు కారణం అవుతుంది. అంతేకాకుండా, జీవనానంతరం ఎందరికో ఆదర్శ ప్రాయం అవుతుంది. సామాజిక, కుటుంబ, దేహ సంబంధ వ్యవహారాలు మాత్రమే పట్టించుకుంటూ వాటి సౌఖ్యాదుల కోసమే పరితపించేవారు త్వరగా శక్తిహీనులవుతారు. వారి మరణానంతరం వారికి ఏమాత్రం గుర్తింపు, గౌరవాదులు దక్కవు.

డా. అయాచితం నటేశ్వర శర్మగారు నిరంతర శక్తి ఉపాసకులు. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వారు శక్తిని గూర్చిన ఆలోచనలనే పెంచుకున్నారు. వారు రచించిన ఎన్నో కావ్యాలు, కావ్య వ్యాఖ్యానాలు, పరిశోధనలన్నీ ఈ విషయాన్నే తెలియజేస్తున్నాయి. అవధానిగా కూడా వారు ఎందరినో అలరింపజేశారు. ఇవన్నీ శక్తితో కలయిక వల్లనే జరుగుతుంటాయి. కోట్లాది శక్తిహీనుల మధ్యలో కొందరే శక్తి వంతులుంటారు. వారిలో ఒకరు అయాచితం వారు. వారికీశక్తి అయాచితంగానే వచ్చింది. దానిని వారు సద్వినియోగం చేసుకుని తాను జీవించిన సమాజ సంబంధమైన, ప్రకృతి సంబంధమైన ఋణాన్ని తీర్చుకున్నారు. ఇటీవల వారు మరణించి కూడా కైవల్యాన్ని, పరమపదాన్ని చేరుకున్నారు. వారి కీర్తి చిరకాలం వ్యాపనంలో ఉంటుంది. జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః.

# అజరామర పాండిత్య శిల్పం!





పాండిత్యమా యది పండితాళియె మెచ్చు
అద్భుత గరిమతో నలరుచుండు!
చేవ్రాలు కాదది చెన్నొందు ముత్యాల
వరుసలై ప్రతులపై వరలుచుండు!
వక్తృత్వమా యది వైశేషికాంశాలు
ప్రవహించి ప్రతిభయే పారుచుండు!
పల్కరింపా యది బంధమ్ములను బెంచ
కూర్మితో వికసించి కురియుచుండు!
దర్పమిసుమంత జూపని ధర్మమూర్తి
ప్రేమ పంచుటే తెలిసిన ప్రేమమూర్తి
అతడయాచిత వంశాబ్ధి కమర దీప్తి
బుధ నటేశ్వర శర్మయౌ పూర్ణుడతడు!!

సంస్కృత సాహిత్య సందేహమొక్కటి
ఘనులైన సురలకు కలిగెనేమొ?
శాస్త్రపాఠము జెప్పు చక్కని గురువుగా
తమ చెంత గూర్చుండ తలచిరేమొ?
అందాలు జిల్కెడు నక్షరముల కూర్పు
వేనోళ్ళ పొగడగా పిలిచిరేమొ?
ముత్యాలు జాల్వార్చు ముచ్చటయగు వ్రాత
వాసవు సభకు గావలయునేమొ?
దేవతాళియె మెచ్చు దివ్యోపదేశమ్ము
వేల్పులే చెవులార వినెదరేమొ?
ఇన్ని పనులను జేయగా నెన్న తరలె
ఘన నటేశ్వరు విబుధుడే మనల వీడి,
లీనమయె పరమేశునిలోన తాను!
పద్య పుష్పమ్ము లర్పింతు పాదములకు!!

'అవధాని' అవుసుల భానుప్రకాశ్
పద్యసారస్వత పీఠం, ఫోన్ : 9603 204 507

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

జాతిభేద భావము
విడువవలెనీ జాడ్యము
అంతరంగరంగనాథుని
ఆత్మజులమన్నది సత్యము

బీజమొకటి అంకురించి
సృష్టిరూపమొత్తెను
అనంత జీవకోటిరాశిగా
అవతారము నొందెను
బీజమొకటే రూపము వేరు
తెలుసుకున్న మౌఢ్యము వీడు

నాలో నీవు నీలోన నేను
ప్రతిజీవిని నీవని ఎరుగు
పరబ్రహ్మ ప్రేమను పంచి
హృదయగది విశాలము పెంచు

తుకా పరబ్రహ్మ రూపము
విశ్వభ్రాతృత్వ సత్యము
పరభావన వీడి నడువుము
పరంధామ పథము చేరుము




అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12

హైదరాబాద్ అక్టోబర్ : 2024

# నటేశ్వరుని బాల్యం – విద్యాభ్యాసం – సాహితీ ప్రస్థానం

**డా. ఆరుట్ల శ్రీదేవి,** ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ఫోన్ : 95505 54866









సంస్కృతాంధ్ర సాహిత్య సంప్రదయాలలోని పద్య, గేయ, రూపక వచనాలను కవిత్వ సాధనాలుగా మలచుకొని సాహితీ క్షేత్రంలో బంగారు కావ్యాల పంటలను పండిస్తూ సాహిత్య విమర్శకునిగా, వక్తగా, అష్టావధానిగా, విద్యార్థులను తీర్చిదిద్దే గురూత్తమునిగా సాహిత్య లోకాన్ని అలరింప జేస్తూ సాహిత్య రచనే ధ్యేయంగా సర్వస్వంగా భావించి ఎదిగిన సారస్వతమూర్తి డా. ఆయాచితం నటేశ్వర శర్మ గారు.

నటేశ్వర శర్మ గారు 1956 జులై 17న నిజామాబాద్ జిల్లా (ఇప్పటి కామారెడ్డి)లో సదాశివనగర్ మండలంలో రథాల రామారెడ్డి గ్రామంలో జయలక్ష్మీ దేవి – అనంతరాజ శర్మ దంపతులకు పుణ్యాల పంటగా మొదటి కుమారుడై జన్మించినాడు. వీరికి ముగ్గురు తమ్ముళ్లు, ఒకచెల్లెలు.

1961 నుండి 1966 వరకు రామారెడ్డి PHS లో ప్రాథమికోన్నత విద్యనభ్యసించినారు. తండ్రి గారి ప్రోత్సాహంతో 1967లో తిరుమల లోని శ్రీవేంకటేశ్వర సన్నిధానంలో వేద సంస్కృత పాఠశాలలో ప్రవేశించి 1973 వరకు సంస్కృత సాహిత్యాన్ని మరియు వ్యాకరణ శాస్త్రాన్ని అభ్యసించారు. 1973 లో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో చేరి 1977 లో "వ్యాకరణ" శిరోమణి పట్టాను పుచ్చుకున్నారు. 1977 అక్టోబర్ లో కామారెడ్డి లోని ప్రాచ్య విద్యా పరిషత్తు, సాయం ప్రాచ్య కళాశాలలో సంస్కృత విభాగంలో ఉపన్యాసకునిగా తమ ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి రీడర్‌గా పనిచేసి అదే కళాశాలలో ప్రిన్సిపల్‌గా కూడా కొనసాగినారు.

1989 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి అమరవాది వేంకట నరసింహాచార్యుల సంస్కృత కావ్యం అయినటువంటి "ఆముక్త మాల్యద–ఒక పరిశీలన" అన్న అంశం పై సంస్కృతంలో ఎం.ఫిల్ పట్టాను సాధించారు. 1994 లో జగద్గురు ఆది శంకరుల సౌందర్య లహరి పై చేసిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం విశిష్టమైనటువంటి "పండిత దామోదర్ సాల్వేకర్" స్వర్ణ పథకాన్ని ప్రదానం చేసింది. ఈ పరిశోధన పైనే పి.హెచ్.డి అవార్డు కూడా పొందినారు.

అయాచితం వంశాంకురమై మొలిచిన డా.శర్మ గారు కౌముది, జాహ్నవి, యామినుల వెన్నెల వలయంలో మనుమలు, మనుమరాళ్ల హరివిల్లుల అల్లర్లలో ఆధ్యాత్మిక జీవితంతో పాటు రచనా విలాస జీవితాన్ని చవి చూసినారు. వారి సతీమణి అరుణ కిరణాలు అనే వచన కవితా సంకలనం కవన ప్రియులకు సుపరిచితమే.

నిరాటంకంగా సాగిపోతున్న శర్మగారి కావ్య సేద్యహలము సారస్వత కలము 2024లో కొంచెం తడబడింది. అనుకోని కాలేయ వ్యాధిగ్రస్థులైన వీరి శరీరం కాస్త విశ్రాంతి కోరింది.

ఆ విశ్రాంతిలో కూడా వారి రచనలను వాగ్రూపంలో అందిస్తూ ప్రక్కనున్న వారితో రాయించారు. అంటే కుమార్తెలు, శిష్యులు, వారి సతీమణి మొదలైనవారు. అట్ల విన్పిస్తూ విన్పిస్తూనే వారు శాశ్వత విశ్రాంతి తీసుకొని సాహిత్య లోకాన్ని విషాదంలో ముంచేశారు. తీరని బెంగగా మిగిలి పోయినారు.

**డా. శర్మ గారితో వ్యక్తిగత అనుభవాలు.**

నేను పిహెచ్.డి. చెయ్యాలనుకుంటున్నాను సర్. మీ రచనల మీద అనగానే ఎంతో అభిమానంతో, సహృదయంతో నాకు సహకరించినారు. వారి తెలుగు రచనలు నాకందించడమే కాకుండా,

వారి వ్యక్తిగత వివరాలు, కుటుంబ నేపథ్యం చక్కగా వివరించి చెప్పినారు. నేను వారిని కలవడానికి నిజామాబాద్ నుండి కామారెడ్డి కి వచ్చినపుడు స్వయంగా వారే వచ్చి బస్‌స్టాండ్ నుండి ఇంటికి తీసుకొచ్చేవారు. నేను మీకు ఇబ్బంది కలిగిస్తున్నానని బాధ పడ్డప్పుడు. నీవు నా సోదరి సమానురాలవని, మరేం పరవాలేదని ఓదార్చేవారు. అటువంటి మహానుభావుని గురించి నాల్గుమాటల్లో చెప్పి నా రచనకు నేను చేసేది అన్యాయమే.

**డా. అయాచితం నటేశ్వర శర్మ – సంస్కృత సాహిత్య సేవ :**

అన్ని భాషలకూ జనని అయిన సంస్కృతాన్ని అభ్యసించి ఉపాసించి అమోఘమైన కావ్య రత్నాలను సాహితీ హృదయాలకు అందించినారు. వారి లేఖిని నుండి జాలువారిన సంస్కృత శతకాలలో శ్రీ లలితాంబికా శతకం, ప్రభాకర శతకం, ఈ రెండూ ముఖ్యమైనవి. స్తోత్రాల్లో శ్రీ గజానన స్తోత్రం, శ్రీ మాతృకా వర్ణమాలిక, పంచ శరీయం, కాలభైరవ సుప్రభాతం, కాపర్తి వేంకటపతి సుప్రభాతం మొదలైనవన్నీ భక్తి రసం కలిగినవి. నేను వారి తెలుగు సాహిత్యాన్ని మాత్రమే పరిశోధనకు ఎంచుకుని ఆ సిద్ధాంత వ్యాసాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించినాను కాబట్టి సంస్కృత వాఙ్మయం పట్ల కొంత తక్కువ నిడివితో ముగిస్తున్నాను.

**శర్మగారి తెలుగు సాహిత్య సేవ :** శర్మ గారి పద్య వాఙ్మయంలో చైత్రరథం, సమయ విలాసిని, నూట పదహారు, ఆటవెలది, ఋతుగీత, శకుంతల మొదలైన కావ్యాలు ఉన్నాయి. మళ్లీ ఈ పద్య వాఙ్మయం లోనే భక్తి వాఙ్మయం, శతక వాఙ్మయం వేరు వేరుగా ఉన్నాయి. ఈ పద్యాలన్నీ కూడా కవి మనోభావాలకు దర్పణం.

ఈపద్యాల్లో పద సౌందర్యాలు, అలంకారాలు, భావజాలాలు, వర్ణనలు తెలుగు భాషగొప్పదనానికి పట్టు గొమ్మలైన దీర్ఘ సమాసాలు, అచ్చ తెలుగు పదాలు, అప్పుడప్పుడూ వచ్చి పోయే బంధువుల్లాంటి ఆంగ్ల పదాలు కలగలిపి సాహితీ ప్రియులను అలరిస్తాయి. భక్తి వాఙ్మయంలో శ్రీవేంకటేశ్వర విలాసము, సిరినోము, శ్రీరామ గుణమణిమాల, బాలరామాయణము, శ్రీరామలింగేశ్వర హృదయము ఉన్నవి.

శ్రీరామగుణ మణిమాల, బాల రామాయణము, శ్రీరామలింగేశ్వర హృదయము, సౌదామిని విలాసము, లక్ష్మీ విలాసము, అనునవి ఉన్నవి. కరుణ అద్భుత విప్రలంభ శృంగార రస మేళవింపులతో కూడిన శ్రీవేంకటేశ్వర విలాసము చదివిన కొద్దీ చదవాలనే విధంగా పాఠకులను ఉత్సాహ పరుస్తుంది. తెలుగుదనపు చేష్టలతో కూడిన శ్రీ పద్మావతి వేంకటేశ్వరుల కళ్యాణం కనుల ముందు జరిగినట్టే ఉండడం కవి రచనా శైలికి ఒక మెచ్చుకోలు. సౌదామిని విలాసములో నైతిక విలువలు, పదవైచిత్రి, వర్ణనలు, రచనా శిల్పములు ప్రశంసనీయమైనవి. శ్రీ రామలింగేశ్వర హృదయంలో శివతత్వము, శివపూజా విధానములో మానవీకరణ, సర్పపూజ ఆంతర్యము, పంచామృతాభిషేకములు ఉన్నాయి. బాల రామాయణం శ్రీరామగుణ మణిమాలలలో వాల్మీకి ప్రశ్న, శ్రీరాముని గుణ విశేషములు, హనుమంతుని పాత్ర మొదలైనవన్నీ పాఠకులకు ఒక్కసారిగా ఇతిహాసం చదవాలన్న ఉత్సుకతను కలుగజేస్తాయి. సిరినోము అనే కావ్యంలో గోదాదేవి కవితా పటిమ తత్వ వివేచనములు చదివితే ధనుర్మాసంలో జరిగే గోదా కళ్యాణానికి మనం అర్థవంతంగా హాజరు కావచ్చు. ఇక లక్ష్మీ విలాసములో లక్ష్మీ అంటే కేవలం ధనమే కాదు పంచభూతాలను మనం సక్రమంగా అనుభవించుట మంచి గుణాలు, మంచి మనస్సు, ఆత్మ శాంతి అనునవి కూడా లక్ష్మియే అని తెలియజేశారు.

**డాక్టర్ శర్మ గారి వచన కవితా వాఙ్మయం :**

మానసిక అంశాలు, ఆధ్యాత్మికాంశాలు నైతిక విలువలు, కలగలిపి నటువంటిది “చుక్కలు” అనే వచన కవితా సంపుటి. సాహితీహితం అనే కవితతో మొదలైనటువంటి “తాండవం” అనే కవితా సంపుటి చదువరులకు మంచి చైతన్య స్ఫూర్తిని కలిగిస్తుంది “లాస్యం” లో మానవతా మరియు శతపత్రంలో భావ కవిత్వరేకులు విప్పారినవి.

**డాక్టర్ శర్మ గారి గేయ సాహిత్యం :**

ఆంధ్ర తేజం అనే గేయ సంపుటిలో వారు తెలుగు వీరులకు వందనమిడుతూ జీవనదుల తీరాలలో ప్రగతిరథం నడిపిస్తూ సమతా – మమతను చాటి చెప్పారు. ఆరు రుచుల ఆమని పుస్తకంలో ఆరు రుచులను సంయమనం ఎట్లా చేయాలో సూచిస్తూ ఉగాది పండుగను అమృతమయం గావించారు. భారతీ ప్రసక్తి గేయసంపుటిలో వాఙ్మయ దీపం వెలిగించి దేశభక్తిని పెంపొందిస్తూ భారతజాతికి శుభోదయం పలికారు. అట్లా పలుకుతూ పలుకుతూ వారు వసంతంలోనికి వెళ్లిపోయి వసంతశోభను ఆహ్వానిస్తూ అందరినీ ఆహ్లాద పరుస్తూ చక్కనైన గేయాలు మనకు అందించారు. అట్లాగే శతక వాఙ్మయంలో శ్రీగణేశ శతకము, శ్రీరాజేశ్వర శతకము, కవితా శతకము, భారతీయ శతకము, భారతీశతకం, నవ్య నీతి శతకము మొదలైన ఆరు శతకాలు శ్రీ శర్మగారు చక్కగా రచించి సాహితీ ప్రియులకు వరమైనారు. ఈ శతకాలలో ఏమున్నదో ఎవరికి వారే చదివి తెలుసుకుంటేనే మరింత మాధుర్యము చేకూరుతుందననే భావనతో నేను వాటిలో ఏమున్నదో చెప్పకుండా మీ ఆసక్తికి వదిలిపెడుతూ ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.




ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 9 హైదరాబాద్ అక్టోబర్ : 2024

# అవధాన శిరోమణి డా. అయాచితం వారు

**డా. బోచ్కర్ ఓమ్ప్రకాశ్,** అవధాని, ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఫోన్ : 81859 55960









డా. అయాచితం నటేశ్వర శర్మ విద్వత్కవి వరేణ్యులు నిరంతర సాహితీ కృషీవలురు సదాశివనగరం మండలానికి చెందిన రథాల రామారెడ్డి వీరి స్వస్థలం. 1956 జూలై 17వ తేదీన శ్రీమతి జయలక్ష్మి దేవి, శ్రీ అనంత రాజశర్మ పుణ్య దంపతులకు ప్రథమ పుత్రునిగా జన్మించారు. అయాచితం వారు ఆరవ తరగతి వరకు స్వగ్రామం రథాల రామారెడ్డిపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. 1967లో తండ్రి అనంతరాజశర్మ ప్రేరణతో సంస్కృత విద్యాభ్యాసాన్ని చేయడానికి తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలలో ప్రవేశించారు. 1973 వరకు ఆరు సంవత్సరాల పాటు సంస్కృతంలో ఎంట్రన్స్ పూర్తి చేసి 1973లో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో వ్యాకరణ శిరోమణిలో చేరి 1977లో ఆ కోర్సులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తిరుమల పాఠశాలలోని కృష్ణస్వామి అయ్యంగార్ వరదరామానుజం, పార్థసారథి అయ్యంగార్ వంటి శాస్త్ర విద్వాంసుల అంతేవాసిత్వము, ప్రాచ్య కళాశాలలో టీకేవీఎన్ సుదర్శనాచార్యులు చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ, మహామహోపాధ్యాయ ఎన్ సి పి నరసింహాచార్యుల వంటి లబ్ధ ప్రతిష్ఠులైన విద్వన్మహాకవుల శిష్యరికంలో అయాచితం వారు వ్యాకరణ శాస్త్రంలోనూ సంస్కృతాంధ్ర కవితా రచనలలోను ప్రసిద్ధులైనారు.

సంస్కృతభాషలో తిరుపతిలో శిరోమణి పట్టా సంపాదించిన తరువాత సంస్కృతంలో ఎం.ఏ.పూర్తిచేసి మాతృభాష మీది మమకారంతో ఎం.ఏ. తెలుగుకూడా పూర్తిచేశారు. 1977సం.లో కామారెడ్డిలో ప్రాచ్య విద్యా పరిషత్తు సాయం ప్రాచ్యకళాశాలలో సంస్కృతోపన్యాసకునిగా పనిచేస్తూనే పరిశోధన విభాగంలో ప్రవేశించి 1989లో అమరవాది వేంకట నరసింహాచార్యుల **"ఆముక్తమాల్యదమ్ ఒక పరిశీలన"** అన్న అంశంపై ఎం.ఫిల్ పూర్తిచేశారు. 1994 లో జగద్గురు ఆదిశంకరాచార్య విరచిత **'సౌందర్యలహరి–ఒక అధ్యయనం'** అనే అంశంపై ఆచార్య కప్పగంతుల కమల గారి పర్యవేక్షణలో పిహెచ్.డి. డిగ్రీని మరియు పండిత సాత్వలేకర్ స్వర్ణ పతకాన్ని బహుమతిగా పొందారు. సంస్కృత, వ్యాకరణ, తర్క, మీమాంస, సాహిత్యాలను అధ్యయనం చేసిన అయాచితం నటేశ్వర శర్మ తెలుగు సంస్కృత భాషా సంప్రదాయ పరిరక్షణకై విశేషకృషిని చేసి కవిగా 60కి పైగా రచనలు వెలువరించారు. వేలకొలది సాహిత్య విమర్శనా పరిశోధనా వ్యాసాలను రచించారు. ఈనాడులో అంతర్యామి ఆధ్యాత్మిక వ్యాసాలు రచించారు. అవధానిగా శతాధిక (120) అవధానాలను దిగ్విజయంగా పూర్తిచేశారు. ప్రాచ్య విద్యాపరిషత్ సాయంప్రాచ్య కళాశాలకు ప్రాచార్యులుగా సేవలందించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాచ్య విభాగానికి పీఠాధిపతిగా (డీన్) పనిచేశారు. అయాచితం వారు నిత్య రచనా చైతన్య శీలి వారి రచనలు ప్రముఖ సాహిత్య దిన వార మాస పత్రికల పాఠకులను ఆకాశవాణి శ్రోతలను వివిధ టీవీ ప్రేక్షకులను అలరించాయి. 2017 భాగ్యనగరంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు డా. అయాచితం నటేశ్వరశర్మ పద్య పఠనం తోనే ప్రారంభమైనాయి. వారి రచనలలో సంస్కృతాంధ్ర కావ్యాలు శతకాలు సంగీత రూపకాలు కవితా సంపుటులు లఘుకావ్యాలు వచన కవితా పద్య కవితా సంకలనాలు విమర్శలు మొదలైనవి ఉన్నాయి. డా. నటేశ్వర శర్మ రచించిన రచనల్లో వసంతకుమారి తొలి ముద్రిత రూపకం. శ్రీగజానన స్తోత్రం, శ్రీషోడశి, పంచశరీయం, శ్రీ కాలభైరవ సుప్రభాతం, శ్రీలలితాంబిక శతకం, ప్రభాకర శతకం, కావర్తి వేంకటేశ్వర సుప్రభాతం మొదలైనవి సంస్కృత రచనలు.

భారతీ ప్రశస్తి కవితాసంకలనం, శ్రీశివ మహిమ్న స్తోత్ర వ్యాఖ్య, శ్రీ రేణుకా సుప్రభాత వ్యాఖ్య, శ్రీగణపురాంజనేయ స్తుతి వ్యాఖ్య-వ్యాఖ్యానాలు, ఋతుగీత సమయ విలాసిని, శ్రీమాతృకా వర్ణమాలికా, శ్రీరామగుణమణిమాల, లక్ష్మీ విలాసం, సౌదామిని విలాసం, చైత్రరథం, జీవనయానం, నూటపదహారు, శ్రీరామలింగేశ్వర హృదయం, ఆటవెలది మొదలైనవి ఖండకావ్యాలు, లఘుకావ్యాలు, ఆంధ్రతేజం, ఆరు రుచుల రూపకాలు, బాల రామాయణం, సిరినోము అనువాద గ్రంథాలు, కవితా శతకం, నవ్యనీతి శతకం, శ్రీ రాజేశ్వర శతకం, భారతీయ శతకం, శ్రీ భీమేశ్వర శతకం మొదలైనవి శతకాలు కాగా నవ్యగీత, లాస్యం, తాండవం, చుక్కలు, శతపత్రం మొదలైనవి వచన రచనలు. శ్రీవేంకటేశ్వర విలాసం, శకుంతల ఈ రెండు బృహత్కావ్యాలు. ఇలా అమూల్యమైన సాహిత్య సంపదతో నిజామాబాదు జిల్లాలో కవికులానికి ఆభరణం వంటివారు డా. అయాచితం నటేశ్వరశర్మ. అమూల్యమైన సాహిత్య సంపదను ముత్యాల సరాల వంటి వారి వ్రాతను, అక్షరాలను సాహితీ లోకానికి అందించి వారు 10 సెప్టెంబర్ 2024 నాడు సౌందర్య లహరీ ఆస్థాన కవిగా వెళ్లడం ఉభయ రాష్ట్రాల సాహితీ రసజ్ఞ లోకానికి తీరని లోటు.

**వ్యక్తిగత అవధానాలు - డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ**

అయాచితం వారు కీ.శే. గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ, డా. అవధానం రంగనాథ వాచస్పతుల వద్ద అవధానంలోని మెలకువలను గ్రహించారు. 1993లో అష్టావధాన విద్యా ప్రదర్శనకు శ్రీకారం చుట్టి శతాధిక (120) అవధానాలు ఉభయ రాష్ట్రాలలోనూ అనేక ప్రాంతాలలోనూ, వ్యక్తిగతంగానూ, డా. అవధానం రంగనాథ వాచస్పతితో జంట అవధానాలు సైతం నిర్వహించారు నిరాఘాటంగా తమ అవధాన ప్రస్థానాన్ని కొనసాగించి అవధాన దివికేగిన వాచస్పతితో కలిసి మళ్ళీ జంటగా అక్కడ కూడా అవధానాలు చేయడానికి పయనమైనారు.

డా.అయాచితం నటేశ్వర శర్మ అవధానంలో 1.నిషిద్ధాక్షరి 2.సమస్య 3.వర్ణన 4.దత్తపది 5.న్యస్తాక్షరి 6.ఛందో భాషణం / పురాణ పఠనం 7.స్వీయ కవితా గానం 8. అప్రస్తుత ప్రసంగం అనేవి అంశాలుగా స్వీకరించేవారు కొన్నిచోట్ల వీటికి అదనంగా సంస్కృత సమస్యను సైతం స్వీకరించి పూరించిన రమణీయ సందర్భాలు ఉన్నాయి.

అయాచితం వారు అవధానాలలో వారి పూరణలన్నీ సంస్కృతాంధ్ర పాండిత్య ప్రకర్షలకు నెలవులై అవధాన కవితా ప్రియులను అలరించే విధంగా ఉండేవి. అట్లే లలిత లలిత పదాలతో, భావగాంభీర్యతతో ధారాప్రవాహమై పరుగులు తీసేది.

1993 మార్చి 4 వ తేదీన కామారెడ్డి ప్రాచ్య కళాశాలలో జరిగిన డా.నటేశ్వరశర్మగారి తొలి అవధానంలో ఒక పృచ్ఛకుడు ఇచ్చిన

**మదనాంఘ్రిద్వయ సేవనంతు సుధియా మోక్షప్రదం కథ్యతే**

(మన్మథుని కాళ్లు పట్టుకోవడం పండితులకు మోక్షాన్ని ప్రసాదిస్తుందని చెబుతారు) అని ఈ సంస్కృత సమస్య అయాచితం వారు పూరించిన తీరు వారి తంత్రశాస్త్రాభినివేశాన్ని ప్రకటిస్తుం దనడంలో సందేహం లేదు.

**సకలోపాసక సిద్ధిదాయక మహో తన్మాదనం శ్లోక్యతే**
**సకలారాధక మాతృ పాదయుగళం హ్యాంఘ్రి ద్వయేనోచ్యతే।**
**ఉభయారాధన మేవ లోక హితదం తత్సాధకై స్సేవ్యతే**
**మదనాంగరిద్వయ సేవ నందు సుధియాం మోక్షప్రదం కథ్యతే॥**

స, క, ల అనే మంత్ర బీజాక్షరాలు శ్రీవిద్య తంత్రంలో మిక్కిలి ప్రసిద్ధిని కలిగినవి. వాటిని ఆరాధించినవాడు మన్మథుడు. అందుకే శ్రీవిద్యను మన్మథోపాసిత విద్యగా సంప్రదాయజ్ఞులు చెబుతారు. ఆ మన్మథుడు ఉపాసించిన విద్యలో ప్రధానమైనవి అమ్మవారి పాదాలు కాబట్టి అవి మన్మథుడు పూజించిన కాళ్లు. వాటిని పట్టుకోవడం వల్ల **'శ్రీసుందరీ తత్పర సేవాకానాం భోగస్థ మోక్షస్థ కరస్థ ఏవ'** అనే ప్రమాణాన్ని అనుసరించి పండితులకు మదనాంఘ్రిద్వయ సేవ మోక్షాన్ని కలిగిస్తుందని పూరించడం శ్రీవిద్యా సంప్రదాయం పై ఉన్న పటిమను వ్యక్తం చేస్తుంది.

**నిషిద్ధాక్షరి :** కామారెడ్డిలో జరిగిన అవధానంతో పృచ్ఛకుడు గణపతిని వర్ణించమని కోరగా

కం॥ శ్రీ(వి) గ(జ) ణ(ప) ముల్(ది) రా(జ) గన్(-) ధీ(శా)

యాగ(త) క్ర(త) మ(ం) పూ(ర) జ్య(ం) తా(ం) ప్తి(ం) నా(గ) త్మ(ం) న్ని(జ) ల్పన్

**శ్రీగణముల్ రాగన్ ధీ**
**యాగక్రమపూజ్యతాప్తి నాత్మన్నిల్పన్**
**శ్రీగణనాథుని గొల్చెద**
**వాగమృతపు సిద్ధికొరకు పద్యసుమముతో** (ఇది ద్విపాద నిషేధ పద్యం)

పై పద్యంలో 'ధీయాగక్రమ పూజ్యతాప్తి' అని దీర్ఘ సమాసాన్ని వేసుకోగలిగినారంటే దానికి ఎంతో ధైర్యం కావాలి నిషేధాక్షరిలో ఏకాక్షరపదాలు, ద్వ్యక్షర పదాలు తప్ప దీర్ఘ సమాసాల జోలికి వెళ్ళకూడదు. అయాచితం నటేశ్వర శర్మ ధీశాలి కాబట్టి దీర్ఘ సమాసాలను సైతం అవలీలగా తమ నిషిద్ధాక్షరిలో నిబంధించారు.

**దత్తపది :** 1995లో దోమకొండలో జరిగిన అష్టావధాన సభలో ఒక పృచ్ఛకుడు బాల -హేల- గోల- మాల అనే పదాలను









దత్తపదులుగా ఇచ్చి వసంత ఋతువును వర్ణించమని కోరగా అయాచితం వారు పూరించిన ఈ పద్యం మిక్కిలి రమణీయమైనది.

**బాలగ నామనింగనుచు భావన జేయుదు నెల్లవేళలన్**
**హేల వసంత లీలయన నిచ్చల మాటల నాడి పాడుచున్**
**గోలలు నూత్న కావ్యములు గూర్చెడి పల్కుల పోల్కి నిల్వగా**
**మాలలు కావ్యమాలలగు మత్తుగ కోకిల లాలపించగన్**

**మరోదత్తపది :** పద్యము, మద్యము, గద్యము, హృద్యము అను పదాలు ఇచ్చి సరస్వతీ దేవిని స్తుతించమని కోరగా అయాచితం నటేశ్వర శర్మ ఇలా పూరించారు.

**పద్యములల్లగా భువిని పండుగజేసి కొనన్ మనంబులే**
**మద్యమికేల? కావ్యముల మాధురితో సరిపోల్చవచ్చునే**
**గద్యము నందునైన కలగానములన్ పలికింపవచ్చు, నా**
**హృద్యములైన, భావముల హృత్పదనన్ భజియించి శారదన్.**

పై పద్యంలో చివరి వరకు ఎక్కడ సరస్వతి దేవిని స్తుతించినట్లు కనబడదు కాని చతుర్థపాదం చివర 'శారదన్' అనుట ద్వారా మొత్తం పద్యమంతా అమ్మవారిని ఆవిష్కరించినట్లైనది. పద్యకవిత్వమంత గొప్పమత్తును, మాధుర్యాన్ని ఏ మద్యము ఇవ్వజాలదని గద్యంలో కూడా కలహంసరాగాలు పలికించవచ్చని ఇదంతా విద్యాధిదేవత అయిన శారదాంబ కృషి చేతనేనని నటేశ్వరశర్మ చక్కని భక్తిభావ రసబంధురంగా అమ్మవారిని ఆవిష్కరించారు.

2000 ఫిబ్రవరి 27 తేదీన బిక్కునూరులో శ్రీ సరస్వతీ యాగం ప్రముఖ సరస్వతీ ఉపాసకులు అష్టకాల నరసింహరామ శర్మ అష్టావధానిగారి ఆధ్వర్యవంలో నిర్వహించారు. అక్కడ డా.నటేశ్వర శర్మ గారి అవధానంలో ఆ యజ్ఞాన్ని చేయించిన వ్యాపారి వీరయ్యను ఈశ్వర-బహు-ధాన్య- విక్రమ ఈ పదాలతో ప్రశంసించమనగా ఈ పదాలన్ని తెలుగు సంవత్సరాల పేర్లు పై పదాలతో రమణీయంగా ఈ విధంగా వర్ణించారు.

**తే.గీ. ఈశ్వరార్చన సేవలో శాశ్వతముగ**
**బహుసుకృతులను జేయుచు వరలునట్టి**
**ధాన్య వణిజుండు వీరయ్య తత్త్వమరసి**
**విక్రమము ధర్మమార్గాన వేడ్కనిలచు**

నిరంతరం ఈశ్వరార్చనలో నిమగ్నమై అనేకంగా మంచి కార్యక్రమాలు చేస్తూ పేరుపొందిన వీరయ్య ధర్మమార్గంలో నిలుస్తాడు. అని పూరించి ఈశ్వర, అర్చన బహు-సుకృతులు అని విడగొట్టి ధాన్య వణిజుడు (బియ్యం వ్యాపారి) విక్రమము అని ఇచ్చిన పదాలను చక్కగా వినియోగించుకొని పద్యాన్ని పూర్తిచేశారు.

**న్యస్తాక్షరి :** ఈ అంశంలో ఒక పృచ్ఛకుడు

ప్రథమ పాదంలో 4 అక్షరం 'య' 13వ అక్షరం 'ల'
ద్వితీయ పాదంలో 2వ అక్షరం 'క్ష' 5వ అక్షరం 'స'
తృతీయ పాదంలో 1అక్షరం' 'జ'5వ అక్షరం 'ప'
చతుర్థపాదంలో 3వ అక్షరం 'ద' 5 వ అక్షరం 'త' అను అక్షరాలను నిర్దేశిస్తూ పారశాలను వర్ణించమనగా

**తే.గీ. అక్షర 'య'శస్సులను రాల్తురఖి'ల'గురువు**
**ల'క్ష'రాభ్య'స'నమున విద్యార్థులలర**
**'జ'గతికే 'పా'ఠముల చెప్పు చదువులబడి**
**జ్ఞాన'దే'వ'త'లకు గాదె కట్టినగుడి**

పృచ్ఛకుడు నిర్దేశించిన అక్షరాలను తప్పకుండా పూరించడం అవధాని నటేశ్వర శర్మగారి ప్రతిభకు తార్కాణం.

**ఆశువు :** డా॥ అయాచితం నటేశ్వర శర్మ భావనాపటిమ చెప్పుకోదగినది. వేగంగా తడబడకుండా ఆశువును నిర్వహించడంలో వీరు సిద్ధహస్తులు. నిజామాబాదు జిల్లాలో జరిగిన ఒక అవధానంలో ఇందూరు (నిజామాబాదు) జిల్లా వైభవాన్ని గూర్చి పృచ్ఛకుడు కోరగా ఆశువులో సీసపద్యాన్ని ఈ విధంగా అందించారు.

**సీ.ఇందూరు కాదు దేవేంద్రుని సభగెల్చు**
**కవిపండితాళిని గన్ననేల**
**'ఖిల్లా' ను దేవతాగేహంబుగా జేయు**
**మహనీయులను గన్న మహితభూమి**
**శిలలకే శిల్పాల చిందులు నేర్పిన –**
**సత్కళానిలయుల జన్మధాత్రి**
**సంగీత, సాహిత్య సరసజ్ఞతకు రంగ**
**భూముల నిల్పిన పుణ్య వసుధ**

**సిద్ధ రామేశు కృపకిది సిద్ధవనము**
**పుణ్యగోదావరీ తీర పూతధరణి**
**సకల దేవతల్ విహరించు చైత్రరథము**
**భిన్నసంస్కృతులన్ కలిసిన విశ్వపథము**

దేవేంద్రుని సభను సైతం గెలిచే కవిపండితులను కన్ననేలగా, ఖిల్లాను సైతం రామాలయంగా తీర్చిదిద్దిన మహనీయులను కన్న భూమిగా, శిలలకు సైతం శిల్ప సౌందర్యాన్ని అందించిన, కళాకారుల జన్మధాత్రిగా, సంగీతసాహిత్య సాధనలకు రంగభూమిగా సిద్ధరామేశ్వర స్వయంభూలింగం వెలసిన పవిత్ర స్థలంగా పవిత్ర గోదావరినది ప్రవహిస్తూ ఈ నేలను సస్యశ్యామలం చేస్తున్నదని, సకల దేవతలు విహరించే చైత్రరథంగా భిన్న భిన్న సంస్కృతులు కలిసిన విశ్వపథంగా అవధాని భావించడం సముచితంగా ఉంది.

డా. అయాచితం నటేశ్వరశర్మ ఒక అవధానంలో తెలుగు పద్యానికి ఇచ్చిన నిర్వచనం అమూల్యమైంది పరమ రమణీయమైంది!

**శా.మంజీరమ్మల మంజునాదములు రామప్రఖ్యగోదావరీ**
**గుంజత్ స్వచ్ఛ సువర్ణమాలికలు మేల్ గూర్పంగకృష్ణాఝరీ**
**శింజానమ్ములు పెన్నలోని రుచులున్ చేతమ్ములన్ నిండగా**
**రంజత్ పాద చతుష్క పుష్పములతో రంజిల్లు పద్యం బిలన్**

మరొక సందర్భంలో అవధానం పై ఆశువుగా చెప్పిన ఈ పద్యం సుప్రసిద్ధమైంది!

**సీ. ఒకరు నిషేధింప నొకరు వర్ణన నీయ**
**నొకరు సమస్యతో నూరజేయ**
**నొకరు దత్తపదమ్ము లొప్పు పృచ్ఛలు సేయ**
**నొకరు ఛందోభాష నుల్లసిల్ల**
**నొకరు నప్రస్తుతవికటభాషణ సేయ**
**నొకరు పురాణోక్తి నురుత చదువ**
**నొకరు న్యస్తాక్షరి నొప్పు వర్ణములీయ**
**నొకరు దృశ్యమ్ముల నొసగుచుండ**

**సాగురా యవధానంపు సరసకేళి**
**పండితాళికి విందుగ పరిఢవిల్లి**
**శ్రోతృజనులకు సాసితీసురభిళముల**
**పంచు నవధానమెల్లరి పండుగయగు !**

**జంట అవధానాలు**

(నిజామాబాద్ జిల్లా అవధాన రంగంలో తొలి జంట అవధానం డా.అవధానం రంగనాథవాచస్పతి, వేదాటి రఘుపతి జంటను చెప్పవచ్చు. వేదాటి రఘుపతి ఈ జిల్లావారు కాకపోయినా 1984 ప్రాంతంలో కామారెడ్డి ఆర్ట్స్ కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసిన సందర్భంలో రఘుపతితో డా. అవధానం రంగవాథవాచస్పతి జంటగా రెండు అవధానాలను చేశారు.)

డా. అయాచితం నటేశ్వరశర్మగారు 1994 మార్చినుండి అవధాన సాహితీ సహవ్రతులు సహోపన్యాసకులైన డా. అవధానం రంగనాథ వాచస్పతి గారితోజంటగా అష్టావధానాలు చేయడం ప్రారంభించారు. ఈ అవధాని ద్వయం మొదటి రెండు మూడు అవధానాలలో ఎనిమిది అంశాలను జంటగా చెరొక పాదంతో అవధానాలు చేశారు. తరువాత నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, వర్ణన, వ్యస్తాక్షరి మొదలైన అంశాలే కాక ప్రతి అంశం ద్విగుణీకృతంగా చేశారు. అవధాన పద్యాలలో ఇష్టదేవతా ప్రార్థన, ఒకరి తరువాత మరొకరు చెరొక పద్యంగా చెప్పడం వీరి అలవాటు అయితే ఇది అవధాన చరిత్రలోనే పేర్కొనదగిన వింత విషయం. ఇలా ప్రతి అంశాన్ని ద్విగుణీకృతం చేయడం వల్ల ప్రేక్షకులలో కలిగే నిరాసక్తతను గమనించి తరువాతి అవధానాలలో నిషేధాక్షరి సమస్య మొదలైన అంశాలలో ప్రతిపద్యంలో చెరొక పాదంగా చెప్పడం అలవాటుగా పెట్టుకున్నారు.

**"ఒక చరణంబతండు మఱియొక్కటి నేను మఱొక్కటాతడున్"** అన్న విధంగా అప్రస్తుత ప్రసంగం, ఛందోభాషణం, పురాణపఠనం యథావకాశంగా సమాధానాలు చెప్పడం వీరి రివాజు. ధారణ విషయంలో ఇద్దరు కూడా చివరికి అప్పజెప్పడం విశేషముగా చెప్పవచ్చు! వీరి జంట అవధానాలలోని కొన్ని పద్యరత్నాలను గమనిద్దాం.

దార లేదా జార పదాలనుపయోగించి ఉత్పలమాలలో పద్యం చెప్పుమని పృచ్ఛకుడు కోరగా –

**ఉ. రా రమణీసమేత రఘురామ సలక్ష్మణ భక్త వత్సలా**
**లేరవనిన్ ద్వదీయ సమలీల పరాక్రమ దీక్షనిల్వ, మం**
**దార సుధాపయోధి సితతామర చారు మనోజ్ఞ కీర్తి, భూ**
**జారమ మాణ దివ్య పద సక్త! శ్రుతీఢ్య కథాపయోనిధీ!**

భక్తవత్సలా శ్రీరామ! సీతాదేవితో పాటు సలక్ష్మణుడవై రమ్ము, పరాక్రమంలో నీతో పాటి వచ్చేవారు ఈ భూమండలంపై లేరు! భక్తుల పాలిటి మందారవృక్షమా! తెల్లని తామర పుష్ప వంటి స్వచ్ఛమైన కీర్తి కలి సీతామాతనే పూజించబడే పాదాలుకలవాడా! వేదాలచే ప్రస్తుతింపబడేవాడా! అంటూ ఇచ్చిన పదాలతో – రమణీయోత్పల మాలను శ్రీరాముని పాదారవిందాలకు సమర్పించారు.

**సమస్య :** అట్లే –

**"కుక్కలు పచ్చిగడ్డితనె గోవులు మ్రింగెను పిల్లిమాపసమున్"** అనే సమస్యను పూరింపుమనగా –

**ఎక్కడ జూచిసన్ జగతినెల్లను అన్నమయంబులే కదా**
**డొక్కల నింపగా నెపుదు దుల్పగనౌనిల భూత సంతతిన్**
**తక్కిన జీవులంబడుగు దానిని మెక్కుట జూడు పిల్లులన్**
**కుక్కలు, పచ్చిగడ్డితినె గోవులు, మ్రింగెను పిల్లి మాంసమున్**

కుక్కలు వచ్చిగడ్డి తినడం, గోవులు పిల్లిమాంసాన్ని తినడం అసంబద్ధమైన సమస్య! దీనిని జంట అవధానులు పై విధంగా అర్థవంతంగా మార్చి పూరించారు. ఉదర పోషణకై భగవంతుడు ఒక్కొక్క ప్రాణికి ఒక్కొక్క ఆహారం కల్పించాడని, పరిశీలించి చూడగా పెద్ద జీవి చిన్న జీవిని తినడం సహజం, పిల్లులను కుక్కలు, పచ్చగడ్డిని ఆవులు, పిల్లిమాంసాన్ని తినడం సహజమేనని రమణీయంగా సమస్యను పూరించారు.

**అప్రస్తుత ప్రసంగం :** జంటకవులు నిర్వహించిన అష్టావధానం ఒకటి శిష్యుడు – అష్టావధాని అయిన జోచ్కర్ ఓమ్ప్రకాశ్ ముప్కాల్లో నిర్వహించారు. జిల్లా స్థాయి ప్రముఖ పృచ్ఛకులు ఈ అవధానంలో పాల్గొన్నారు. ఈ అవధానంలో అప్రస్తుత ప్రసంగం అనే అంశాన్ని నిర్వహించిన ఓంప్రకాశ్ అవధానులను ఇలా ప్రశ్నించారు. **"ప్రపంచ సుందరి ఐశ్వర్యారాయ్ వచ్చి మీ ఇద్దరిలో ఒకరిని పెళ్ళిచేసుకుంటా నంటే మీలో ఎవరు ముందుకు వస్తారు"** అని అడుగగా డా.వాచస్పతి వెంటనే **"అయ్యా! నటేశ్వరశర్మ నాకంటే చిన్నవాడు కనుక ఆయనకింకా పెళ్ళిచేసుకోవడానికి ముందుముందు అవకాశం వస్తుంది. కాని వయస్సు పైబడిన నాకు అవకాశం రాదుకదా! అందుకే నేనే ముందుంటాను"** అని అనగా నటేశ్వరశర్మ కల్పించుకుని **"అయ్యా! ఆ రాయి (రాయ్) ని మీరే కట్టుకోండి"** అనగా సభలో నవ్వుల పువ్వులు విరిసాయి.



జక్రాన్ పల్లిలో చేసిన జంట అష్టావధానంలో ఈ అవధానులకు దత్తపది అంశంలో **'వాలిబాల్, ఫుట్ బాల్, బేసుబాల్, హ్యాండ్ బాల్'** నాలుగు పదాలు ఇచ్చారు పృచ్ఛకుడు. ఇవి ఒక్కొక్కటి ఒక్కొక్క క్రీడకు సంబంధించిన బంతులు వీటిని ఉపయోగించి పార్వతి తపస్సును వర్ణింపమనగా జంట అవధానులు. చెరొక పాదాన్ని ఇలా అలవోకగా చెప్పారు.

**శా. ఏ పుణ్యంబులు వాలి బాల చరితంబీరీతి వర్ధిల్లెనో**
**శ్రీపుద్బాలునివోలె నమ్రుడగుచున్ సేవింప నద్దేవునిన్**
**కోపాలన్ సబబే! సుబాల యని తాగుర్తించి శ్రీ కంఠుడే**
**ప్రాపించెన్ దగ పార్వతిన్ వటువుగా బాహ్యాండ బాలార్కతన్**

పై పద్యం జి.ప.ఉ.పా. జక్రాన్ పల్లి లో పూరించిన పద్యం స్వయంగా నేను ఈ అవధానంలో పాల్గొని పై పద్యాన్ని రాసుకొన్నాను (ఈ అవధానం 1995 సం.లో జరిగింది.)

**'నిశిరాతిరి సూర్యుడకట నింగిని మొలిచెన్'** అనేది సమస్య! అర్ధరాత్రి సమయంలో సూర్యుడు ఆకాశంలో (వెలగడం) ఉదయించడం అసంభవం! అయితే అసంభావాలను సైతం సంభవాలుగా చేయడంలో అవధానులు సిద్ధహస్తులు. ఈ సమస్యకూడా జక్రాన్ పల్లి అవధానంలోనే ఈ విధంగా పూరించారు!

**కం. భృశమౌ నలుకను గాంచితి,**
**ప్రశమితమగు ప్రణయకోపభారములోనన్**
**విశదముగాకుండ గడిచె;**
**నిశిరాతిరి సూర్యుడకట నింగిని మొలిచెన్**

ప్రణయకోపంలో ఉన్న ప్రియురాలిని అనునయిస్తూ ప్రియుడు రాత్రి గడిచి సూర్యోదయమౌతున్నదని ఇకనైనా ప్రణయకోపాన్ని మానుకోమని ప్రార్థించినట్లు ఈ సమస్యను రసవంతంగా పూరించారు అవధానులు. 'నిశిరాతిరి' అనే పదంతో వాక్యాన్ని ముగించి, "సూర్యుడకటనింగిని మొలిచెన్" అవడం అయ్యో! రాత్రి

వృథాగా గడిచిందని, సూర్యుడు ఆకాశంలో ఉదయించాడనడంతో ఈ సమస్య రమణీయమైన విరుపుతో ఈ సమస్యను పరిష్కరించారు! ఇలా జంట అవధానాలలో సరళ సుందరమైన పద్యపూరణలు, చమత్కార జనకమైన పద్యాలు గోచరిస్తాయి.

మద్గురువర్యులైన ఈ అవధాని ద్వయానికి నా ఎం.ఫిల్. సిద్ధాంత గ్రంథం **"తిరుపతి వేంకటకవుల నానారాజ సందర్శనం - సాహిత్యానుశీలనం"** అంకితం చేయడం నా పూర్వజన్మ సుకృతం. వీరి (గురువులిరువురు అవధాన దివికి ఏగడం శిష్యులకు అవధాన ప్రియులందరికీ బాధాకరమైన విషయం)

**చం. తిరుపతి వేంకటేశ్వర సుధీ కవిరాజుల ధారవోలె కొ**
**ప్పరపు కవీశ సోదరుల భవ్యతరాశు రుచి స్మితమ్మునై**
**సురుచిరమౌ వధానముల శోభల నందుచు తెల్గు నేలలో**
**స్థిరమగు కీర్తి గాంచితిరి చేకొనుడీ కృతి కన్యకామణిన్.**

డా. అయాచితం వారు తెలుగు సంస్కృతాలలో 60 పై చిలుకు రచనలు చేసి సాహితీ లోకాన్ని సుసంపన్నం చేసినారు వారి రచనలపై వివిధ విశ్వవిద్యాలయాలు పూనుకొని పరిశోధనలు జరిపించాలి. వారికి నా అక్షర నివాళి.

**కం. అరవై గ్రంథము లెలమిని**
**ఇరవై వాగ్దేవి నిలువ హేలా గతితోన్**
**గురువౌ నటేశ్వరుడిలను**
**సురుచిరమౌ విధము వ్రాసె సూరుల్మెచ్చన్**

**చం. పలికిన పలుకు లెల్ల రసభావము జిందెడు సంప్రదాయమై**
**తలచిన భావమెల్ల వరదాయిని శారద కర్చనమ్మునై**
**చిలికిన పద్యమెల్లను వశీకృతమౌ జనమాన సమ్ముగా**
**మెలిగెడు మద్గురుందలతు మేటి నటేశ్వరు దేశికోత్తమున్.**

**సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్**

## పునరపి జననం

**చంద్రశేఖర్,** సిద్ధిపేట, ఫోన్ : 6300474467

ఉభయకవి మిత్రుడా! అవధాని అయాచితం నటేశ్వర శర్మ ఎక్కడికి వెళ్ళితివి నీవు ! నీ అచూకి ఎక్కడ?

నీలి మేఘ మాలనో, నీలాల మేఘ మాలనో అంటూ మధురమైన నీ గళంతో పాడుతూ తారల సరసన చేరి మమ్మలను వీక్షిస్తుంటావా! ఎక్కడికి వెళ్ళితివి కానరావేమి !

అజంతా చిత్రాలకు, బేలూరు రామప్ప శిల్పాలకు కన్నుకుట్టేట్టు తెలుగు అక్షరాలకు సొబగులద్దిన నీ కలం స్పర్శ లేక చినబోతుంటే వాటిని ఏమని ఓదార్చాలి! మేము ఎక్కడున్నావని చూపాలి మిత్రమా! మరో లోకంలో కవితా వస్తువు కొరకు తండ్లాడుతుంటివేమో!

పందు ముసలి రథాల రామారెడ్డి
గవీను నీ చిరు మందహాసం
కానక రోదిస్తుంటే ఏమని
ఓదార్చాలి ! ఎక్కడని నిన్ను వెదకాలి !

ఎంతని గొంతెత్తి పిలవాలి
ఇంద్రాది దేవతలను కూడా
నీ అష్టావధాన ప్రతిభతో
అలరించడానికి వెళ్ళినావు కదా !

ఓ అవధాని మిత్రమా !
ఈ తెలంగాణా గడ్డను వీడి
ఎక్కడికి వెళ్ళినావు అది
నీకు అప్రస్తుత ప్రసంగమే కావచ్చు
పునరపి జననం పునరపి మరణంగా
సమాధాన మిస్తావేమో !

పునరపి జన్మే ఉంటే మళ్ళీ
ఈ గడ్డపైనే పుట్టు
మేమంతా నీ సౌందర్యలహరి
నుండి 'కందిలి' గేయ కవిత
వరకు వినడానికి ఎదురు
చూస్తూనే ఉంటాము !

మళ్ళీ జన్మించి నీ చిరు
దరహాసంతో పలకరిస్తావు కదూ !
బాధా తప్త హృదయంతో
నీ మిత్రుడు....

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 15 హైదరాబాద్ అక్టోబర్ : 2024

# అయాచితం వారి సంస్కృత సాహిత్యం

**ఆచార్య త్రివేణి వంగరి,** ప్రొఫెసర్, తెలుగు శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9951 444 803

ఆధునిక సంప్రదాయ సంస్కృత కవులలో డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ పాండితీ స్వరూపులు. ఆధ్యాత్మిక భక్తి జ్ఞాన ప్రధానంగా కవి వాఙ్మయం విశ్వశ్రేయమైంది. వీరు దేవీ శక్త్యుపాసకులు. అనర్గళమైన మేధోసంపత్తి గల వీరు విలక్షణ కావ్య నిర్మాణంలో ఏకసంథాగ్రాహులు. వీరి భావగ్రాహకంలో వెలువడిన కావ్యాలు పూర్తిగా దైవగతమైనవి. దివ్యత్వం, దైవత్వం, గురుత్వం, మాతృత్వం, జాతీయత, నవ్యత వంటివి సంస్కృత కావ్యాల్లో ప్రతిఫలిస్తాయి.

సంస్కృత వాఙ్మయం సర్వోత్కృష్టమైంది. వైదికానంతమైన శబ్దార్థభావన కలిగింది. నిగూఢమైన ఆధ్యాత్మిక భక్తిపూర్వక పదాడంబరతకు నిలయమైంది. విశిష్ట లక్షణాలను కలిగి ప్రత్యేక కీర్తి యశస్సులు పొందింది. నిరంతరం సంస్కృత పండితుల వల్ల నూతన తేజస్సును సంతరించుకొంటుంది. వేద భాషగా, పురాణ భాషగా, కావ్యభాషగా సంస్కృతం విరాజిల్లుతుంది. దివ్యమైన జ్ఞానాన్ని సంప్రాప్తింపజేసే సంస్కృతవాఙ్మయం ఆది మధ్యాంతర కవుల హృదయాలను సున్నితంగా స్పృశించింది. ఆధునిక కావ్యకర్తలకు అభీష్టంగా నిలిచింది.

నటేశ్వరశర్మ **శ్రీషోడశీ, శ్రీ మాతృకా వర్ణమాలికా, పంచశరీయమ్, శ్రీ లలితాంబికా శతకమ్, శ్రీ ప్రభాకర శతకమ్, శ్రీ కాలభైరవ సుప్రభాతమ్, శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్** వంటి సంస్కృత కావ్యమాలికతో వాఙ్మయాన్ని సుసంపన్నం చేశారు. శ్రీవిద్య (శాక్తతంత్రం) మౌక్తిక శతకం, స్తుతి స్తోత్ర సుప్రభాతం కవి సంస్కృత శబ్దసంపదలో జగద్విఖ్యాతి గాంచాయి. భక్తి భావ విభిన్నతలో కవికి ప్రత్యేకతను సాధించాయి.


**శ్రీ షోడశీ :**


నిడివిలో చాలా చిన్నదైన ఈ సంస్కృత కావ్యం అయాచితం నటేశ్వరశర్మ ప్రతిభావంతమైన పాండిత్యానికి నిదర్శనం. ఇది శ్రీ లలితాపరమేశ్వరి 'షోడశీ'. శాక్తతంత్రంలో ఉపనిషద్ధర్మక ప్రబోధాన్ని కవి అందించారు. వేద ప్రతిపాదితంగా నిర్వచించిన శ్రీవిద్య పరమేశ్వరి సంబంధమైంది. ఈ ఉపాసనలో మంత్రానికి, దైవానికి ఐక్యాన్ని సంప్రదాయ సిద్ధంగా ప్రతిష్ఠింపజేయడం 'షోడశీ' ముఖ్యోద్దేశం.


**శ్లో. శ్రీ లలిత్య వచో విరాజిత గత్కల్యాణ కృద్వైదిక**
**స్మార్తార్షేయత పోవనోదిత వచోమందార సూనార్చితామ్।**
**శ్రీవిద్యా సువిచార నిర్మల పయఃపాథోధి నిర్మంథనా**
**జ్ఞాత శేష సుతత్త్వ రత్న విలసచ్చాంద్రీం కళాంభావయే ॥**

(శ్రీ షోడశి పుట. 1)

శ్రీ విద్యకు అంగప్రధానమైంది **'చంద్రకళ'.** అందుకే పై శ్లోకంలో కవి చంద్రకళా భావన చేస్తున్నారు. శ్రీవిద్య అత్యంత పూజ్యనీయమని తెలుస్తుంది. శ్రుతి, స్మృతి, ఆర్షవాఙ్మయాల్లో శాక్తతంత్రం ఉపదేశింప బడింది. జగత్కల్యాణ హేతువైన శ్రీవిద్య మృదుమధుర భావాలతో విరాజిల్లుతుంది. అందుకే లోకరక్షైక బాంధవి పరమేశ్వరిని విద్య, సంపద, సుఖములను ప్రసాదించే దయగల చూపులతో నిండిన కన్నులు కలదిగా కవి అభివర్ణించారు. సత్కళలతో విలసిల్లుతున్న చంద్రకళా ప్రభారాశిగా శ్రీవిద్య ఘనకీర్తిని పొందింది. అమృత మయమగు మాటలతో లోక సంరక్షణా బాధ్యతను దేవి స్వీకరించింది.



**1. దేవీ ప్రాధాన్యం :**

కవి నటేశ్వరశర్మ వర్ణన సంస్కృత సమున్నతమైంది. దేవీశక్తిని వాగ్రూపేన కీర్తించడం కేవలం వీరికే సాధ్యమైంది. ముల్లోకాలకు ప్రాణములిచ్చి, సంసారసాగరం నుంచి సకలజనులను ఉద్ధరించే దీక్షను పూని ఉన్నట్లుగా వర్ణించబడింది. అజ్ఞానం ఆవహించి శూన్యమైన మనస్సుగల వారికి దేవి దర్శనభాగ్యం కలుగదు. ఎప్పుడైతే శ్రీవిద్య నామస్మరణ ప్రభాకాంతి శూన్య మనసును చీల్చివేస్తుందో 'షోడశీ' అభీష్టం విజయం కాగలదు కదా!

'షోడశీ' ఆద్యంతం రూపకమే. కవి అర్థాలంకారాల మాలికతో దేవీ కంఠహారాన్ని అలంకరింపజేశారు. కవి అమ్మవారి కృపకు ఈ విధంగా ప్రాప్తుడైనారు. 'తత్వ'మనెడి ధర్మ సంస్థ ఉద్యానవనంలోని వసంత మాసంలో వికసించిన 'భక్తి' యనెడి మావి కొమ్మలలో కలిగిన ఏ పండిన 'శ్రీలాలిత్యము' అనెడి ఫలములలోని రసామృతా లచే తడిసిన మనస్సు 'శ్రీరాగము' ను అలాపిస్తుంది.

**శ్లో. దైవీ వాగనిశం పునాతి భువనం పాపౌఘ సందూషితం**
**దైవీ దృష్టిరసంశయం వితనుతే లోకత్రయాలోకనమ్ ।**
**దైవీ సూక్తిరుచిస్సదా హారతి ధీజాడ్యాంధకారావళిం**
**దైవీ భావ పరంపరైవ జగతో ని:శ్రేయసాయ ధ్రువమ్ ॥**

(శ్రీషోడశి పుట-3)

కవి పండితులు నటేశ్వరశర్మ దేవి మంగళకరమైన ముఖబింబాన్ని వర్ణిస్తూ చేసిన స్తుతి పైశ్లోకంలో అద్భుతంగా కీర్తింపబడింది. పవిత్రమైన దేవీ వాక్కులు పాపప్రవాహం చేత దూషితమైన లోకాన్ని కడిగివేస్తాయని, తీక్షణమైన దేవీచూపులు ముల్లోకాలను చూడగలిగే శక్తిని ప్రసాదిస్తాయని, స్వచ్ఛమైన దేవీ పలుకులు బుద్ధి మాంద్యాన్ని తొలగింపజేస్తాయని, దేవీభావన సకల జగములకు శ్రేయస్సును ఇస్తుందని అభివర్ణింపబడింది.

**2. శాక్తతంత్రం :**

ధారా ప్రవాహమైన పదబంధాలతో సలలిత సుమనోహరమైన పదార్థభావనతో కవి ప్రవేశపెట్టిన శ్రీవిద్యప్రాశస్త్యం అత్యున్నతమైంది. శబ్దార్థ అలంకార శోభితంగా 'షోడశీ' అమ్మవారి శక్తియుక్తులను కొనియాడటం విశేషం. కవి సంస్కృత వాక్సంపదతో శాక్తతంత్ర వినిర్మాణం చేయబడింది.

**శ్లో.యేన శ్రీలలితా కథా శ్రవణజ శ్రుత్యుక్త సద్ధర్మయు**
**గ్భావోద్దీప్త సుకర్మచారణ విధౌ సంయోజితం మానసమ్ ।**
**తేనావశ్యమనంత సౌఖ్యద పద శ్రీతత్త్వవేద్యప్రభా -**
**రాశ్యం తర్విల సద్విరిష్ట జగత: స్థానం హి సంప్రాప్యతే ॥**

(శ్రీషోడశి పుట-10)

శ్రీలలితాదేవి శక్తి ప్రపత్తిని కొనియాడుతూ చేసిన ఈ శ్లోక స్తుతిని అత్యంత ప్రతిభావంతంగా చిత్రీకరించారు. శ్రీలలితాంబిక కథను వినడమే ఒక మహద్భాగ్యంగా ప్రస్తావించి, ప్రముఖ శక్తి లక్షణాలను కవి వర్ణించారు. వేదవాఙ్మయం నుంచి సనాతన శక్తి ధీరగుణ ప్రాధాన్యత ఆవశ్యకమైంది. సదా పరసౌఖ్య సౌందర్యాన్ని కలిగిన ఏకైక వ్యక్తిత్వ గాథతను శ్రీదేవి సుసంపన్నం చేస్తుంది. శ్రీవిద్య ఒకానొక సమూహాన్ని ప్రతిబింబించే శక్తిప్రదాయిక సంపదగా అభివర్ణింపబడింది. మనస్సు 'శ్రీ షోడశి' లో శ్రీలలితాదేవికి విశేష నామార్థాలను అనువర్తింపజేస్తూ 'కారుణ్యమ' నే సరస్సులో జన్మించిన 'మనస్సు'అనే పద్మమును ప్రకాశించేదిగా కవి అత్యంత సమర్థవంతం గా శ్రీమాతను సుస్థిరం చేశారు.

**శ్రీమాతృకా వర్ణమాలికా :**

కవి అయాచితం విద్యాదేవతకు అక్షర సమూహంతో నీరాజనం పలికారు. పంచదశీ మాలికను శ్రీవిద్యకు ఆభరణంగా అలంకరింప జేశారు. శ్రీలలితా సహస్ర నామాదులతో భావింపబడే పరమేశ్వరి కృపవల్ల అక్షర శ్రీకార సంస్కారాన్ని అలవరచుకొన్న కవి, తన హృదయఫలకం మీద 'శ్రీమాతృకా వర్ణమాలికా' రూపంలో పునర్ముద్రింపజేశారు.

'శ్రుతి' అనెడిది చతుర్విధ వాక్కులతో పూరింపబడింది. 'పరాపశ్యంతీ మధ్యమా వైఖరీ' రూపంలో వర్ణం నిర్మితమై ఉంటుంది. ఇందులో పరా పశ్యంతీ మధ్యమా వాక్కులు గుహాంతర్గత సీమలోనే ఉండగా, వాక్కు యొక్క చతుర్థరూపం వైఖరీ బహిర్గతమౌతుంది. అందుకే ఆ వైఖరి ప్రథమావతారం వర్ణమాల, వర్ణం మాతృక. వేదాది సమస్త వాఙ్మయం వర్ణముల నుండియే ఉద్భవించింది. సమస్త జగత్తు వర్ణముల మూలరూపంలో పరిభ్రమించింది.

**శ్లో ॥ అక్షర మాలా వర్ణ్యాం వీక్షణ విన్యస్త సౌధ విద్యాత్మామ్।**
**ఐక్ష వచాసాం వందే సాక్షాత్కామేశ మానసాం హంసీమ్ ॥**

(శ్రీ మాతృకా వర్ణమాల పుట-1)

కవి నటేశ్వరశర్మ మొట్టమొదట 'అ'కారంతో స్తోత్ర పారాయణం చేశారు. ఆ లలితాదేవి అక్షర మాలతో వర్ణింపదగిందని చెప్పవచ్చు. వర్ణం అంటే రంగు. అక్షరాలే వర్ణాలు అన్ని రంగుల మాల ఈ వర్ణమాల. దేవీ విద్యను గూర్చి కవి వర్ణన మహోన్నతమైంది. దేవీచూపుల్లో సుధ తళ తళలాడుతుంది. అది గుణాత్మక విద్యకు మూలం. దేవీ చేతుల్లో చెరుకు గడలుంటాయి. చెరుకు గడలు తెల్లని వర్ణాన్ని కలిగి ఉంటాయనే భావాలతో కూడుకున్న శ్లోకప్రతిభతో కవి అతిశయింప జేశారు.

శాక్తవిద్య ప్రతి మానవుడు ఆజన్మాంతం అర్జించాలన్నదే కవి ధ్యేయం. శక్తిపూజితం సృష్ట్యాద్యంతాల్లో విశేషమైంది. భూమండలంలో కోపతాపాలను జనులయందు బలోపేతం కాకుండా సంరక్షిస్తుంది. అత్యధిక ఐశ్వర్యంతో మణులను పొదిగిన కిరీటాన్ని ధరిస్తుంది. రాక్షస సంహారాన్ని కావించే దేవీ విజయధ్వజాన్ని కవి 'ఆ' కారంతో కీర్తించారు.

'ఇ'కారంలో కవి, తన ఇష్టానుసారం మనిషి స్వార్థబుద్ధితో ఎన్నో అప్రయోజనమైన పనులు చేస్తుంటాడని, కాని శక్తిమాత సృష్టి స్థితి లయాలను నిస్వార్థంగా చేస్తుందని, ఆమెను కామధేనువుగా ప్రతిబింబించారు. అదేవిధంగా 'ఈం'కారం బీజాక్షరంలో జన్మిస్తుందని, 'శ్రీ'కారంలో శివతత్త్వంతో కూడి ఉంటుందని, 'ఓం' కారంలో ప్రకాశిస్తుంటుందని దేవి మంగళరూపాన్ని కవి కొనియాడినారు.

అయాచితం నటేశ్వరశర్మ దేవిపాలనను 'ఉ'కారంలో ప్రతిష్ఠించారు. సృష్టిలో ఆ పరమేశ్వరి ధర్మకార్యాలు చేయడానికి పూనుకొంటుంది. సద్యోగములనెడి మంచి గుణాలను ప్రేరేపిస్తుంది. 'చిత్' శాశ్వతమైన తత్త్వం కల్గి ఉంటుంది. నిరంతరం సౌఖ్యాన్ని కలిగిస్తుంది. 'ఊ' కారంలో కవి అద్భుతమైన భావనను కలిగించారు. పార్వతీ పరమేశ్వరుల సఖ్యతకు అనుగుణమైన విషయ ప్రస్తావన ఈ వర్ణంలో గమనించవచ్చు. ఊహాలోకంలో విహరించే అనంత శక్తి స్వరూపిణి అదృష్ట రేఖను కవి స్పృశించారు. దేవి ఆహో పురుషికత. 'ఆహో' అంటే ఆశ్చర్యార్థకం, హా! హా! అద్భుతమైన పురుషుని (శంకరుని) కలదానివి. అంటే గొప్పభర్తను గలదానవని కవి భావన. అంతేకాక సాక్షాత్ చంద్రుని ఆభరణంగా కలిగినదానవని కీర్తిస్తూ, సృష్టికర్తయైన బ్రహ్మయే వర్ణించడానికి శక్యము కానిదానవని పేర్కొన్నారు. 'ఆహార్యీకృత చంద్రాం' అనే శ్లోక పాదంలోనే శాక్త విద్యకు అవసరమైన 'చంద్రకళ' ప్రభవించింది. ఇది కవి పాటవానికి ప్రతీక.

'ఋ' కారంతో కవి వర్ణన అత్యంత శ్రేష్ఠమైందిగా స్తుతింప బడింది. శాక్తవిద్యకు సంరించిన ప్రగాఢ భావన శ్రీలలితాంబికకు కంఠహారంగా కవి అలంకరింపజేశారు. ఆ శక్తి ఋగ్వేద కళాకాంతి కలిగిందని, సకల సాహిత్యాలను ప్రతిష్ఠించిందని, శివ మంగళమే ధ్యేయంగా గలదానవని, కాలమంత్రానికి నిలయమైన దానవని పేర్కొన్నారు. 'ౠ' కారంతో కవి దేవికి ఒక వ్యాహాత్మక ప్రతీకను నిలిపారు. 'ౠ' అనే ఆకారం అమ్మవారి రథంగా, 'మా' అనే శబ్దం అమ్మవారి విజయమంత్రంగా అధిష్ఠింప జేశారు. సదా కామేశ్వరిని దయాకాశంలో విహరింపజేయాలని కవి ప్రయాస.

భక్తవరేణ్యులు 'లూ' మంత్రంలో తమ కోరికలను నెరవేర్చు కొంటున్నారని, 'లూ' కారంతో ప్రారంభమయ్యే పదాలే లేవని, కేవలం ఆ స్వరం నీ పేరు స్మరించడానికే నిశ్చితమైందిగా కవి ఉపాసించారు. ఏకైక శరణ్యురాలివైన 'ఓ పరమేశ్వరి' సకల భాగ్యాలు కలిగించవలసిందిగా కవి ప్రార్థిస్తున్నారు.

**పంచశరీయమ్ :**

కవి అయాచితం నటేశ్వరశర్మ విద్వత్తుకు నిదర్శనం పంచశరీయం. ఇది కవి అద్వితీయమైన ఊహాత్మకత. కవిగారి ఇతర వాఙ్మయ రచనలతో పరిశీలిస్తే ఈ కావ్యం ఒక ప్రత్యేక ప్రతిభాసన కలిగింది. పంచశరీయం అంటే పంచ శరములకు సబంధించిన



విద్య. ఇది పూర్తిగా శాక్త తంత్రాగతమైంది. పంచశరుడు శ్రీ మన్మథుడు. అతని వద్దగల పంచశరములకు అరవిందం, శోకం, చూతం, నవమల్లికం, నీలోత్పలం అనే నామాలున్నాయి. పంచశర విద్యయే శ్రీవిద్య (శాక్తవిద్య)గా భాసించింది. అంతేగాక శ్రీవిద్యకు కాది విద్య, కామ విద్య, కందర్ప విద్య అనే సామాంతరాలున్నాయి. ఈ శరములు మన్మథునికి సంబంధించినవైనా, ఇది లలితాంబిక, మంగళ స్వరూపిణి యొక్క శ్రీవిద్య శ్రేష్ఠమైన హస్తములలో ఒక హస్తములో పంచశరములు విరాజిల్లుతుంటాయి. ఇది జగన్మాదన, తాపన, శోషణ, స్తంభన, సమ్మోహన ఫలకాలని సంప్రదాయం కలవి. ఈ పంచశరీయ విద్యతో జగన్మాత సృష్టిస్థితి లయములను శాసించే సౌజన్యం కలది. అందుకే శక్తిమాతకు అభిన్నమైన పంచశరీయాన్ని కవి నిర్ద్వందంగా నిర్వచించారు.

**పంచబాణ స్తుతి :**

**అరవింద మశోకంచ చూతం చ నవ మల్లికాం ।**
**నీలోత్పలంచ పంచైతాన్ కామ బాణానుపాస్మహే ॥**

**పంచబాణ లక్షణమ్ :**

**ఉన్మాదనస్తాపనశ్చ శోషణః స్తంభనస్తథా ।**
**సమ్మోహనశ్చ కామస్య పంచబాణాః ప్రకీర్తితాః ॥**

కవి శ్రీవిద్యకు అనుగుణమైన పంచశరీయాన్ని తనశక్తి యుక్తులకు అనుగుణంగా అతిశయించి వర్ణించారు. అత్యున్నత ప్రతిభా వైలక్షణ్యాన్ని కలిగి ఉన్న పంచశరీయం కవి కాంచన హృదయభక్తి ఫలకానికి దృష్టాంతం. కవి సంస్పందనలో శక్త్యుపాసన ఉన్నతోన్నత మైంది.

**1. అరవిన్దమ్ :**

**సన్మార్గచారి మార్తాండ దీధితి ప్రబోధితమ్**
**హృత్సరోవర సంపుల్ల మరవిన్ద ముపాస్మహే ॥**

(పంచశరీయమ్ పుట 4)

పంచశరీయంలో ప్రథమ శరం యొక్క దీప్తిని కవి అతిశయింప జేశారు. అది సన్మార్గంలో నడిచే సూర్య మార్గాన్ని అనుసరిస్తుంది. అంటే కర్మసాక్షిగా మానవులందరూ సన్మార్గంలో పయనించే విధంగా అరవిందం ప్రేరేపిస్తుందని అర్థం. ఈ అరవిందం హృదయ సరోవరంలో పుష్పించినదని, లోక నిర్ధారణమైందని కవి సంస్థాపించారు.

అరవింద శరం వర్ణన శర పరంపరగా సాగింది. కవి భావనలో ఈ శరం ఆకాశసాగరంలో పుష్పించిన అరవిందం. జగత్తనే పత్రాలను కలిగింది. దీనికి స్కంధమూలం శ్రీ పరమేశ్వరుడు. మరొక భావనలో ఈ శరం హృదయమనే కొలనులో పుష్పించిన అరవిందం. భావన యనే దళముల చేత దీపిస్తుంది. శివుని మోదంతో పరివ్యాపిస్తుంది. వేరొక భావనలో ఈ శరం సుహృత్కమలం. స్నేహగంధ పరిమళాలను వెదజల్లి, తాదాత్మ్యమనే అనురాగంలో పూరిస్తుంది. ఇటువంటి చిత్ర విచిత్రభావనతో కవి అరవింద శరమును అభివర్ణించారు.

2. అశోకమ్ :

**నితాంత దుఃఖ సంసార సరిత్తరణ కారణమ్ ।**
**బ్రహ్మానంద ప్లవోల్లేఖ్యం తమ శోకము పాస్మహే ॥**

(పంచశరీయమ్ పుట 7)

అత్యంత క్లిష్టతరమైన సంసార దుఃఖాలను భేదించేదిగా, తద్వారా బ్రహ్మానందాన్ని కంచేదిగా కవి పైశ్లోకంలో ప్రస్తావించారు. శుక మహర్షి విషయజ్ఞానాన్ని, వ్యాస మాహర్షి బుద్ధి జ్ఞానాన్ని కవి అశోకంలో పేర్కొంటూ అజ్ఞాన శోక విషయాలను దూరం చేస్తుందని తెలిపారు. తాపత్రయాగ్నులు (కోరికలు) ఈ శరంతో దహించుకు పోతాయి. కామత్వం పటాపంచలవుతుంది. అవ్యక్తమయ్యే అమృతాన్ని అందిస్తుంది.

అదే విధంగా కవి మహోన్నతమైన అశోక శరమును ఉపాసిస్తూ ఆధ్యాత్మిక సహీనమైన లోకానికి మేధస్సును కలిగించి, ఆత్మజ్ఞానోపదేశం చేస్తుందని తెలిపారు.

**తంత్ర విద్యా సమారూఢం యంత్ర విద్యా ప్రకాశకమ్ ।**
**మంత్ర విద్యా పరివ్యాప్తం తమశోకముపాస్మహే ॥**

(పంచశరీయమ్ పుట. 8)

అశోకం తంత్ర విద్యకు సమానార్థకమైంది. యంత్ర విద్యకు ప్రకాశార్థకమైంది. మంత్రవిద్యకు పరివ్యాప్యార్థకమైంది. అంటే పూర్తిగా శాక్త తంత్రానికి అది సముజ్జ్వలమైందని భావించవచ్చు. అందుకే నిరంతరం తపస్సు చేసే యోగీశ్వరుల వీర విజ్ఞాన దీప్తిని అశోకం అందిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

**3. చూతమ్ :**

**వసంతకాలే రమణం ప్రతిశాఖం విరాజితమ్ ।**
**పత్రకోటి సమావిష్టం చూతపుష్పముపాస్మహే ॥**

(పంచశరీయమ్ పుట. 9)

చూతమనే పుష్పం వసంతకాలంలో రమణీయంగా, ప్రతి శాఖకు అలంకారంగా, పత్ర సమూహంలో మేటిగా విరాజిల్లుతుందని, చూతమనే శరం అద్వితీయమైందని కవి కల్పన.

"చూతము" యొక్క ప్రతిభను కవి పేర్కొంటూ కోకిలలు ఎల్లప్పుడు చూత లేత చిగుళ్ళను భుజించి, నవ రాగాలను అలాపిస్తున్నాయని, తద్వారా సర్వశ్రేయస్సు సాప్తిస్తుందని నిర్వచించారు. అదే విధంగా శ్రీవిద్యలోని మధ్యస్థ శరమైన చూతం వేట కవుల సృజనలో కమనీయ సౌరభాలు పరిమళింపబడుతాయని, వారి భావనలో అనేకార్థకాల గుణస్వామ్యాలు ప్రతిఫలింపబడుతాయని తెలిపారు. ఇటువంటి వర్ణనలోనే నటేశ్వర శర్మ పాండిత్యంలో విశ్వశ్రేయం కావ్యం ఉద్భవించిందని చెప్పవచ్చు.

వసంత సుందరి యొక్క గాత్రాన్ని సుమనోహరంగా స్పృశిస్తూ, దిక్కుల వరకు కూడా వ్యాపింపజేసే చూతమును కవి ఉపాసిస్తున్నారు. పాతాళలోకంలో దుస్సాధ్యమైంది, స్వర్గలోకంలో దుర్లభమైంది, కాని మర్త్యలోక వాసులకు మాత్రమే ఏకైక సాధ్యమైంది చూతమనే శరశక్తి. ఇది జగద్రక్షక శక్తి అని పంచశరీయం ఉపదేశిస్తుంది.

**4. నవమల్లికా :**

**హృల్లసంతీం సుమంత్రాత్మాం చిల్లసంతీం సుతత్త్వగాం**
**సల్లసంతీం సదానవ్యాం మల్లికాం సముపాస్మహే?**

(పంచశరీయమ్ పుట 11)

'నవమల్లికా' శక్తి విద్యలో చతుర్థస్థానాన్ని అలంకరిస్తుంది. నవమల్లికా కర్తవ్యం, ధ్యేయం కవి అత్యంత అర్థవంతంగా ప్రబోధించారు. నవమల్లిక-హృదయము నందు నిండిన సుమంత్రం. చిత్తము నందు నిండిన సుతత్త్వం. సత్యము నందు నిండిన పరిపూర్ణం. అందుకే ఇది శ్రీశైల శిఖరాన కొలువైన శివునికి అభీష్టదాయకమైంది. సకలాత్ములకు ప్రభాకాంతులను అందిస్తుంది. వికలాత్ముల యందు దయాకాంతులను కలిగి ఉంటుంది. నిఖిలాత్ముల యందు ఎల్లప్పుడూ సంచరిస్తుంది. ఈ నవమల్లికా శరం.

**5. నీలోత్పలమ్ :**

**కామేక్షు చాపసం లగ్నం కామేశ్వర పదాంకితమ్ ।**
**కామేశ్వరీ హృదుల్లేఖ్యం నీలోత్పలముపాస్మహే ॥**

(పంచశరీయమ్ పుట 13)

కామం(కోరిక) అనే ఇక్షురసాన్ని ఆస్వాదింప జేసేదిగా, కామేశ్వరీ పదానికి అంకితమైందిగా కామేశ్వరీ హృదయంలో నిలయమైందిగా నీలోత్పలాన్ని కవి కీర్తించారు. ఇది రమణీయమైన దర్శనభాగ్యాన్ని కలిగింపజేస్తుంది. ఆశ్రిత స్పర్శను విరాజింపజేస్తుంది. ప్రేమామృత ధారను సంసేవింపజేస్తుంది. నీలోత్పలంలోని వర్ణం(రంగు) యొక్క విలక్షణమైన కాంతిలో సేవింపబడేది. భావమనే విలక్షణత్వంలో హితాన్ని కురిపించేది. తత్త్వమనే విలక్షణత్వంతో సంపూర్ణ సుజ్ఞానాన్ని

అందించేది. అందుకే పంచశరీయం శక్తి విద్యకు తార్కాణంగా నిలిచింది.

**శ్రీ లలితామ్బికా శతకం :**

అయాచితం నటేశ్వరశర్మ శాక్త తంత్ర సాహిత్యంలో శ్రీలలితాంబికా శతకాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. శక్తి ఉపాసనే ముఖ్యధ్యేయంగా భావించిన వీరు శక్తి స్వరూపిణిగా, లోక కళ్యాణ ప్రదాయినిగా కీర్తించడం ఆపర్యాంతం జరిగింది. సుసంస్కృతులైన వీరు శ్రీలలితాంబికా శక్త్యనుగ్రహం కలిగినవారు. అందువల్ల శ్రీలలితా శరత్ త్రిరాత్ర్యుత్సవములను పురస్కరించుకొని వాఙ్మయ సేవలో శతక మా ప్రతిపాదనకు అవకాశం కలిగింది. ఈ దివ్య వాఙ్మయ కావ్యాన్ని శ్రీవిద్యాతత్వవేత్త దోర్బల విశ్వనాథ శర్మకు అంకిత ప్రదానం చేసి తేజోమయ కీర్తి యశస్సులను నింపారు. 'లలితామ్బికామ్' అనే మకుటం శతకానికి మణిభూషణ శోభను కలిగిస్తుంది.


**1. శతక శ్రీకారం :**

శ్రీ చక్రరాజ సంవాసాం ధీ చక్రపరివర్తినీమ్ భా
చక్రమౌలికాం దేవీమ్ భావయే లలితామ్బికామ్ ॥
(శ్రీ లలితామ్బికా శతకం పుట 1)

శతకాదికి శ్రీకారం శుభప్రదాయకమైంది. సంస్కృతాంధ్ర కవిపండితులు శ్రీకర్యాపరాయణమైన లలితాంబికను బుద్ధికి, కాంతికి దృష్టాంతంగా నిలిపారు. త్రిచక్ర సంపాదకురాలిగా లలితాంబికను 'శ్రీచక్ర రాజసం, ధీ చక్ర పరివర్తినీమ్, భా చక్ర 'బౌలికాం' వంటి విశిష్ట నామాలతో లోక రక్షైకహేతు ప్రదాయనిగా అభివర్ణించారు. పరమ పూజితుడైన శివుని హృదయాంతర్గత కమలము యందు ఆసీనురాలైన శ్రీలలితాంబిక సకల దేవతల పూజలను అనుగ్రహింపగలది. అందులో ఆ శక్తి స్వరూపిణి నేత్రాలను కవి చంద్ర సూర్యాగ్నులుగా అభివర్ణించారు. ఒక నేత్రం దుష్టశిక్షణ, మరో నేత్రం శిష్టరక్షణ వంటి కార్యదీక్షలో నిమగ్నమైనవని భావింపజేశారు.

**2. దేవీ స్వరూపం :**

శ్రీలలితాంబిక స్వరూపాన్ని శతక గతంగా కవి అభివర్ణించిన తీరును పరిశీలిస్తే ప్రగాఢ భావన హృదయాంతరాల్లో భాసించక తప్పదు. దేవి స్వరూపం అణు రూపమంటారు కవిశేఖరులు. అందుకే సూక్ష్మదృష్టితో శక్త్యభిగుణాన్ని విరచించవలసిన బాధ్యత ఉంటుంది. చిత్తం ఘన రూపమంటారు కవిశ్రేష్ఠులు. అందుకే అనంతార్థక విశ్లేషణాలతో బేధించవలసిన బాధ్యత ఉంటుంది. శాక్తతంత్రానికి అయోగ్యమైన శక్తిస్వరూపం నిత్యమైంది, సత్యమైంది, శాశ్వతమైంది, నిర్గుణ సుగుణమైంది, స్వయం ప్రకాశమైంది, వేదగతమైంది, మన్వాది స్మృతుల మార్గమైంది.



**గాయత్రీ ముద్యదర్కాభాం సావిత్రీముగ్రరశ్మికామ్ ।**
**సరస్వతీం సాయమర్చ్యామ్ భావయే లలితామ్బికామ్ ॥**
(శ్రీలలితామ్బికా శతకం పుట 2)

నటేశ్వరశర్మ లలితాంబికను త్రిసంధ్యా కాలాలకు ప్రతినిధిగా నిలిపారు. ప్రాతః సంధ్య గాయత్రి, మధ్యాహ్న సంధ్య సావిత్రి, సాయం సంధ్య సరస్వతి ప్రతిరూప భావనగా శక్తిమాత త్రిసంధ్యల్లో కాల ప్రవాహానికి సమర్థ సంసిద్ధతను వ్యక్తపరుస్తుంది. సృష్ట్యాద్యంతాల్లో ప్రముఖ పరమేష్టి శ్రీలలితాంబిక లోక రక్షైక బాంధవి.

శ్రీలలితాంబిక శక్తియుక్త ప్రస్థానంలో కవి అభివర్ణన ఉన్నతాగ్రంలో నిలుస్తుంది. బాలగా, షోడశిగా, పంచదశిగా దేవీ జ్ఞాన సంశోషణం సకలాత్ములకు సాక్షాత్కారమైంది. సంపూర్ణ మూర్తి మత్వాన్ని శ్లోకభూషణంగా కవి అందించారు.

స్వీయ ప్రకాశ సరణి గల లలితాంబిక ముఖకాంతి చంద్రుని జయించేదిగా, త్రిసంధ్యా సమయాలను శాసించే నేత్రద్వయం తన భృకుటితో పాపభస్మం చేసేదిగా, శిరః కుంభం సుందరమైన కేశసంపదతో అలరారేదిగా, తన కోకిల స్వరంతో వికారాలను అంతమొందించేదిగా, తన నఖదీప్తులచేత నక్షత్రకాంతులను కూడా అతిశయింప జేసేదిగా కవి అభివర్ణించారు. సంస్కృత శ్లోక మాలికతో శక్తి రూపిణిని అభిషేకించారు. వ్యాఖ్యానానికి అందని పాండితీ ప్రభావం కవి కలం నుంచి ధారాపాతంగా ప్రసరించి అచంచల సౌరభాన్ని వెదజల్లుతుంది.

**3. సృష్టిపాలనం :**

ఒకే ఒక శక్తి. అది శ్రీ శక్తి. శాక్త తంత్ర ఉపాసనలో కవిసృష్టికి మూలమైన లలితాంబిక పూర్వపు వైభవాన్ని కొనియాడటం విశేషం. విద్యాగంధ పరీమళాలను కవి శ్రీమాతాపరంగా లోకపర్యంతం చేయడం కూడా విశేషం. కవి అభివ్యక్తిలో బ్రహ్మసృష్టికి మూలమైంది శ్రీశక్తి. ఏకైక సంపూజిత, సంతుష్టి సౌభాగ్య. సృష్టిపాలన కేవలం ద్విభుజస్కంధంపై మోస్తున్న లలితాంబిక సమపాలనలో ప్రావీణ్యాన్ని పొందింది. లోకరక్షణా బాధ్యతలో జలములనిచ్చే మేఘ స్వరూపిణియై,

నదీ పరివారంలో కుజలాన్ని పారద్రోలి ఉప్పెనలో ముంచెత్తి కారుణ్యామృతాన్ని కురిపిస్తుంది. అరణ్యవృక్షములకు అధిదేవతగా, ఘటనా ఘటనల చేత ప్రౌఢత్వాన్ని సంప్రాప్తింప చేసేదిగా, దుష్కర్మలను ఖండించేదిగా, నెమళ్ళనృత్యాన్ని నయనానందంగా ఆస్వాదించేదిగా, అఖండమైన సచ్చిదానందాన్ని పరిపూర్ణంగా అనుభవించేదిగా కవి నటేశ్వరశర్మ లలితాంబికా పాలనాదక్షతను కొనియాడారు. శ్రేష్ఠార్థాన్ని అత్యున్నతంగా నామ సంకీర్తనంలో గల దేవిని శక్తి లేని వారిని ఉద్ధరించేదిగా , అజ్ఞానాన్ని దూరం చేసేదిగా, ఎల్లవేళలా ఎల్లరికి ఆధారమై నిలిచేదిగా కవి ప్రతిష్ఠించారు.

**4. శాక్త తంత్రం:**

ప్రత్యేకంగా కవి ఈ శతకంలో శాక్త విద్యకు అనుగుణమైన చన తన శ్లోకంలో నిబద్ధత చేశారు. సరియైన అర్థవివరణలో శక్తి యుక్తిని ప్రదర్శించారు.

**అడిత్థాది పదారూఢాం సదామర్యాది శక్తికామ్ ।**
**మృదార్థాంగ విరాజన్తీమ్ భావయే లలితామ్బికామ్ ॥**

(శ్రీ లలితామ్బికా శతకం పుట 5)

శ్రీ శక్తిమాత శివుని అర్ధాంగియై విరాజిల్లుతుందని, 'డామరీ' వంటి శాక్తవిద్యలలో అద్భుతంగా ప్రకాశిస్తుందని, 'డిత్థ:' వంటి పదాల సంజ్ఞా వాచకాలే గానీ, విశేష – వ్యర్థం ఎక్కడా కనిపించదు. ఇటువంటి వ్యర్థ పదాలయందు నిలువక, సార్థక నామాలతో శాక్తవిద్యకు ఉపయుక్తమైన ప్రవాళం గలది.

అఠాణాది అనురాగ భేదము చేత కీర్తింపబడునదిగా, హఠాది యోగసాధనము చేత సాధింపబడేదిగా కవి వర్ణన అమోఘం. విఘ్నేశ్వరుని ప్రసన్నధ్యానం చేసే భక్తులకు మంచి సౌఖ్యాన్ని అందిస్తుంది శ్రీ స్వరూపిణి. ఓంకార ధ్వని చేత భావింపదగినదై, ఢక్కాది వాద్యములను సంగీతస్వరానికి మేళవింపు చేసుకొని, అణుమాత్రమైన భూమండలానికి రక్షిణియై, సదా 'అథ' అనెడి మంగళార్థకంలో సంచరించేదిగా కవి చిత్రించారు. అన్ని తంత్రాల్లో కెల్ల శాక్తవిద్యలో శ్రేష్ఠాసనం వరించేది శ్రీముఖినినే గదా?

**ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తిం స్వచ్ఛాత్మముని సేవితామ్ ।**
**విచ్ఛేద భావ హరిణీమ్ భావయే లలితామ్బికామ్ ॥**

(శ్రీలలితామ్బికా శతకం పుట 12)

పరమేశ్వరి శక్తి సంస్మరణలో కవి శ్లోకార్థం ఉన్నతమైంది. త్రివిధ శక్తితత్వాన్ని కవి తన మేధో వైవిధ్యంలో కొనియాడారు. శ్రీ మంగళరూపిణి ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి సంపదలతో తులతూగుతుంది. అందుకే కవివరేణ్యులు శక్తి సంభోజ్యానికి సంసిద్ధులైనారు. శివ శబ్దమందు 'ఇ' కార రూపంతో అభివ్యక్తమయ్యే శక్తి తత్వాన్ని దేవీపరంగా స్తుతించారు. యజ్ఞాలతో, ఆజ్యాలతో, యాగాలతో ఒక దేవతా స్వరూపిణిగా, ఒక యాజ్య స్వరూపిణిగా, ఒక క్రియా స్వరూపిణిగా శక్తిని ప్రసరింపజేస్తుంది.

**ఈంకార బీజ మధ్యస్థాం శ్రీంకారాంత విభాసురామ్ ।**
**క్లీం కార వేద్య సర్వేశీమ్ భావయే లలితామ్బికామ్ ॥**

(శ్రీ లలితామ్బికా శతకం పుట 13)

శ్రీలలితాంబిక సర్వాంతర్యామి అనే అర్థం పైశ్లోకంలో చాలా స్పష్టంగా తెలుస్తుంది. 'ఈం'కార బీజానికి 'మధ్యమ', 'శ్రీం' కార బీజానికి 'చివర', 'క్లీం' కార బీజానికి దేవీ తత్త్వవేదమైన సర్వస్వంలో కొలువై ఉంటుందని కవి ప్రబోధించారు.

ప్రాచీన ధర్మసంరక్షణకు, భారతీయపరిరక్షణకు నటేశ్వరశర్మ సంస్కృత సాహిత్యం ఒక నిదర్శనం. ఆధునిక వైషమ్యాలు సంతరించుకొంటున్న యాంత్రికయుగంలో కవి తన సహజ పాండిత్యంతో సంస్కృతభాషలోని సౌందర్యాన్ని, సంస్కృత భావనలోని స్వచ్ఛతను ప్రదర్శించి పాఠకుల రస హృదయాలను పులకరింప జేశారు. నూతన భావజాలానికి అనుగుణంగా సనాతన విలువలను పునఃస్థాపింపజేశారు.

అయాచితం నటేశ్వరశర్మ సంస్కృత కావ్యశైలి అత్యంత సుందరమైనది. పండిత పామర రంజకమైంది. విలక్షణత, గుణాత్మకత గల కవి కావ్యాత్మ సర్వాంశ సంభూతమైంది. 'శ్రీ షోడశీ, శ్రీ మాతృకా వర్ణమాలికా, పంచశరీయమ్' వంటి కావ్యాల్లో శాక్తతంత్రానికి చెందిన పారమ్యత ప్రదర్శితమౌతుంది. శ్రీ పరమేశ్వరి యొక్క ఓంకార స్వరూపం, దేవీ ప్రాధాన్యం, దేవీ సృష్టిపాలనం, దేవీశక్తి ప్రాబల్యం కొనియాడబడింది. శ్రీ లలితామ్బికా శతకమ్, ప్రభాకర శతకమ్ వంటి కావ్యాల్లో శ్రీవిద్యకు, ప్రభాకరుని ఉజ్జ్వల రూపానికి అనుగుణమైన ప్రస్తావన కొనసాగింది. వివిధ నామరూప భేదాలతో కీర్తింపబడింది. శ్రీకాలభైరవ సుప్రభాతమ్, శ్రీవెంకటేశ్వర సుప్రభాతమ్ వంటి కావ్యాల్లో దైవగతమైన ప్రసక్తి స్తుతించబడింది. మహిమాన్వితమైన తత్వం ప్రబోధింపబడింది.

**ఆధార గ్రంథాలు :**

1. నటేశ్వరశర్మ అయాచితం, 1990, శ్రీ షోడశీ, జాతీయ సాహిత్య పరిషత్, కామారెడ్డి,

2. నటేశ్వరశర్మ అయాచితం, 1997, శ్రీ మాతృకావర్ణ మాలికా, చైతన్య ప్రింటింగ్ ప్రెస్, కామారెడ్డి.

3. నటేశ్వరశర్మ అయాచితం, 1998, పంచశరీయమ్, అనిల్ అఫ్సెట్ ప్రింటర్స్, కామారెడ్డి.

4. నటేశ్వరశర్మ అయాచితం, 1998, శ్రీ లలితాంబికాశతకమ్, అనిల్ అఫ్సెట్ ప్రింటర్స్, కామారెడ్డి.

5. నటేశ్వరశర్మ అయాచితం, 1999, ప్రభాకర శతకమ్, కౌముదీ పబ్లికేషన్స్, కామారెడ్డి.

6. నటేశ్వరశర్మ అయాచితం, 2001, శ్రీ కాలభైరవ సుప్రభాతమ్, కౌముదీ పబ్లికేషన్స్, కామారెడ్డి.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2024

# డా. అయాచితం నటేశ్వర శర్మ లఘు – దీర్ఘ కావ్యాలు


**డా. జె. భారతి,** అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేరు. ఫోన్ : 89199 96936



గురు తుల్యులు అయాచితం నటేశ్వర శర్మ గారితో నా ప్రత్యక్ష పరిచయానికి ఇరవై రెండేళ్ళు. మొదటిసారి ఆయన్ని కలిసినపుడు ఎంత మృదుభాషి, ఎంత సౌమ్యులు అనిపించింది. నెలరోజుల క్రితం కలిసినప్పుడూ అంతే మృదువుగా ప్రశాంతంగా ఆత్మీయంగా మాట్లాడారు. కామారెడ్డి లో ఉద్యోగరీత్యా ఉన్నప్పుడు ఆయన నాపట్ల, మా కుటుంబం పట్ల చూపించిన ఆత్మీయత, అభిమానం సాటిలేనివి. సంస్కృతాంధ్రాలలో ప్రతిభావంతుడైన సాహితీవేత్త అయిన శర్మ గారు సాధారణ తెలుగు అధ్యాపకురాలినైన నన్నెంతో ఆదరించి నా పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని ముద్రించమని ప్రోత్సహిస్తూ ముందుమాట రాసి ఇచ్చారు. అది నేను చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను. అవ్యాజమైన అభిమానాన్ని అందించిన అయాచితం నటేశ్వరశర్మ గారికి వినమ్ర నివాళులు అర్పిస్తున్నాను.

**పద్యవిద్య చూడ బహు కష్ట సాధ్యము**
**నడక తెలియనట్టి నరునకెపుడు**
**పద్యవిద్యగాదె పరమసులభమౌను**
**శైలినెరిగినట్టి సాధకునకు** – 'ఆటవెలది' పద్యకావ్యం

అంటూ పద్యవిద్యను సులభసాధ్యం చేసుకున్న సాధకుడిగా సాహితీలోకంలో సుప్రతిష్ఠితులు డా. అయాచితం నటేశ్వర శర్మ గారు. కామారెడ్డి ప్రాచ్యవిద్యా పరిషత్తు కళాశాలలో ప్రధానాచార్యులుగా, సంస్కృతాంధ్ర అధ్యాపకులుగా, అందుకున్న పురస్కారాలకు వన్నె తెచ్చిన పద్యకవిగా, సంస్కృతాంధ్రాలలో 50 కి పైగా కృతులను వెలువరించిన సృజనశీలిగా, అవధానిగా సాహితీ లోకానికి సుపరిచితు లైన శర్మగారి తెలుగు లఘు, దీర్ఘ కావ్యాలను స్థాలీపులాకంగా పరిచయం చేయటం ఈ వ్యాస ఉద్దేశ్యం.




అష్టావధాని, వ్యాకరణ శిరోమణి అయిన శర్మగారి రచనలన్నింటిలో జాతీయభావన ప్రతిఫలిస్తుంటుంది. ఆధ్యాత్మికత తాత్త్వికత అంతర్వాహినిగా ప్రవహిస్తుంటాయి. దేశం పట్ల, దేవునిపట్ల భక్తిని ప్రకటిస్తూ, సామాజిక నైతిక విలువలు బోధిస్తూ పాఠకుని చైతన్యవంతుడిగా చేసి ఋజుమార్గంలో నడిపిస్తాయి, ఈయన రచనలు. వీటిలో సంఖ్యాపరంగా సింహభాగం పద్యరచనలదే. భక్తి, నీతి ప్రబోధాత్మక శతకాలు సమయవిలాసిని ఋతుగీత, ఆటవెలది, నూటపదహారు వంటి లఘు కృతులు, శ్రీవేంకటేశ్వర విలాసం, శకుంతల వంటి దీర్ఘ పద్య కావ్యాలు, శ్రీషోడశి, శ్రీమాతృకా వర్ణమాలిక వంటి సంస్కృత రచనలు; భారతీ ప్రశస్తి, ఆంధ్ర తేజం, లాస్యం, తాండవం వంటి ఆధునిక గేయ వచనా సంపుటాలు, ఆముక్తమాల్యదా పరిశీలనము, భాగవత కథామృతం వంటి పరిశోధనాత్మక గ్రంథాలూ ఇలా భిన్న వస్తు ప్రక్రియా సమన్వితాలైన రచనలెన్నింటినో అక్షరంగా సాక్షాత్కరింప చేసారు శర్మగారు.




శర్మగారి కావ్యాలు, వస్తు వైవిధ్యంతో పాటు, అలంకార వైచిత్రితో, సరళ పదసంయోజనతో, విభిన్న ఛందోగతులతో, లలితమైన భావాభివ్యక్తితో పాఠకులని ఆకట్టుకుంటాయి. ద్విత్వ, సంయుక్తాక్షర ప్రాసలను అలవోకగా ప్రయోగించే నైపుణ్యం, అల్పాక్షరాలతో విపులార్థ స్ఫురణ కలిగించడం వీరి రచనా ప్రత్యేకత.

శర్మగారి పద్యాలలో జలపాతంలో తడిసిన అనుభూతిని అందించేవి కొన్నైతే, ఒక్కసారిగా కుమ్మరించిన వర్షంలా తడిపేవి కొన్ని, ఉవ్వెత్తున యెగిసే అలయై మనలని లాగుకొనిపోయేవి మరికొన్ని, మళ్ళీ మళ్ళీ మునకలేయాలన్పించే నిర్మలమైన నదిలా పలకరించేవి ఇంకొన్ని. వెరసి రసస్ఫూర్తితో సహృదయులలో వ్యాప్తమయ్యే పద్య స్రవంతి వీరి సొంతం.

కావ్యానికి కథే ముఖ్యం. శయ్య, రీతి వంటివి ఆనుషంగికాలు అని అభిప్రాయపడిన శర్మగారు కథను వివిధ రూపాలలో అందించే కవి లక్షణం ఎలా ఉండాలో వివరించారు.

**అక్షరమ్ములోన యవినాశతత్త్వమ్ము**
**పదములోన దివ్య పరిమళమ్ము**
**వాక్యమందు శుద్ధపరతత్త్వ సారమ్ము**
**గనెడివాడు గాదె కవియనంగ.**

ఈ పద్యగత భావానికి నిలువెత్తు నిదర్శనమై నిలిచిన పద్యకవి శర్మగారనటం అతిశయోక్తి కాదు.

నటేశ్వరశర్మగారు రచించిన పద్యకావ్యాలు : 1. సమయ విలాసిని 2 ఋతుగీత 3.సౌదామినీ విలాసము 4. నూటపదహారు 5. ఆటవెలది 6. చైత్రరథం 7. శ్రీ వేంకటేశ్వర విలాసం 8. శకుంతల మొదలైనవి. ఇందులో మొదటి ఆరు లఘు కావ్యాలు కాగా, చివరి రెండు దీర్ఘ కావ్యాలు.

**1. సమయ విలాసిని :** కాలస్వరూపిణి అయిన పరమేశ్వరి "సమయ"గా శ్రీ0విద్యా సాంప్రదాయంలో వ్యవహరించబడుతోంది. శ్రీచక్రానికి జరిపే చతుష్షష్టి ఉపచారాలకు సంకేతంగా 64 పద్యాలలో కాలమహిమను, కాలం పరమేశ్వర్యధీనమనే పరమార్థాన్ని వివరించారు.

**జరిగినది సర్వమారయ సమయహేల**
**జరుగుచున్నది పరికింప సమయలీల**
**జరుగబోవునదెల్లయు సమయ డోల**
**జగతి బంధించుచున్నది సమయమాల.**

ఆద్యంత్య ప్రాసలతో కాల ప్రాధాన్యతను, కాలస్వరూపిణి తత్త్వాన్ని అతి సులభంగా అవగతం చేయించారు. సకలమానవ కర్మలకు హృదయమే నియంత అనీ, దాని పగ్గాలు పట్టుకుని నియంత్రించిన వాడే సమయానుగుణంగా ధర్మమార్గాన చరించ గలుగుతాడనీ ఈ లఘు కావ్యం వివరిస్తుంది. సమయ విలాసము-కిరణ విలాసము-చరణ విలాసము అనే మూడు సంపుటాల **"సమయ విలాసము"** అనే కావ్య ప్రణాళికలో భాగంగా ఈ మొదటి సంపుటాన్ని వెలువరించారు.

**2. ఋతుగీత :** ఋతుగీతకు ధ్యేయం పరబ్రహ్మం అని కవి ఉవాచ. యజుర్వేద అంతర్భాగమైన తైత్తిరీయ బ్రాహ్మణం ఏయే ఋతువులలో ఏయే దేవతలు ఏయే మంత్రాలతో పూజింపబడతారో వివరిస్తుంది. వేదసంస్కృతిని అభిమానించే ఈ కవి షడ్రుచుల రూపంగా పరబ్రహ్మాన్ని ఉపాసించారు. ప్రకృతిలో దైవాన్ని చూసే విధానాన్ని పఠితకు అందిస్తూ వసంత హాసినిగా, గ్రీష్మ తాపినిగా, వర్ష హర్షిణిగా, శరత్ కౌముదిగా, హేమంత సీమంతినిగా, శిశిరపత్రికగా ప్రకృతిని సంభావించి సరస హృదయులకు ఆహ్లాదాన్ని కలిగించారు. షడ్రుతువులలో షట్కాల ఆరాధనా శీలమైన ఉపాసనామార్గం తనదిగా నిరూపించుకున్నారు.

**"ఋతువుల తత్త్వముంగనుచు నెప్పుడు చక్కని బాట సాగు**
**జీవతతికి లోకమందెపుడు బాధలు కల్గవు"** అంటూ ఋతుగీతోపదేశం చేశారు. ఋతుగతులకనుగుణంగా ఋతువులకనుసంధానమైన పద్యాలతో మానవ స్వభావాన్ని సామాజికప్రవృత్తులను ఈ కావ్యంలో వరించారు.

**"చల్లని చూపు నీది ఎద జల్లెడ చేసెడి చూపు నీది పూజల్లుల చూపు నీది"** అని హేమంత సీమంతినిని ఆహ్లాదంగా వర్ణిస్తూనే,

**"నేలను పాన్పుగా నిలిపి నింగిని కప్పుగ చేసి నిద్రకున్**
**సోలెడి దీన మానవుల సుంత కనుగొని నీ ప్రభావమున్**
**లీలగ తగ్గు..."** చేయమనీ, వెతలనే వంట చేసుకుని వేడుకతో భుజించే దీనులు ఆశలు చితికినా, పెదవులపై నవ్వులు అతికించుకుని బ్రతుకుతారనీ, జీర్ణ కుటీరాలలో నివసించేవారిపట్ల దయచూపమని హేమంత భామినిని అభ్యర్థించటంలో కవియొక్క సామాజికస్పృహ వ్యక్తమౌతోంది.

**3. సౌదామిని విలాసం :** సౌదామిని (మెరుపు) గురించి సంస్కృతాంధ్ర కవులెందరో వర్ణించి ఉన్నారు. అయితే, శర్మగారు వారందరి కంటే విలక్షణంగా మెరుపుకన్యపై లఘుకావ్యమే రచించారు. తళుక్కున మెరిసే తటిల్లతను వంద విధాలుగా ఊహించి తన్మయుడై వంద తేటగీతి పద్యాలుగా పాఠకుని మనస్సు మిరుమిట్లు గొలిపేటట్లుగా అభివ్యక్తం చేశారు. సౌదామిని ఒకసారి హృద్యంగా అనిపిస్తే, ఒకసారి నిప్పులా మండుతుంది. భూమి మీద జరుగుతున్న అమానవీయ అవినీతి సంఘటనలు చూసి భరించలేక ఉండి ఉండి మెరుపులు మండుతుంటాయని భావించటంలో కవి ఆవేదనను గమనించవచ్చు.

**"ఎందరో తిండి దొరుకక ఏడ్చుచుండ**
**గుప్తధనముల నార్జించి కోటికోట్లు**
**పరుల బాధలు జూచియు మురియువారి**
**చూచి మండుచున్నావేమొ సుదతి నీవు."**

మెరుపు కన్య స్థితికి సమాజ ధోరణి కారణమని ప్రబోధించారు నటేశ్వరశర్మగారు. తళుక్కున మెరిసిన క్షణంలోనే అసమానతలను గుర్తించిన మెరుపుతీగ మనకు ఆదర్శం కావాలనే ఆలోచనను పాఠకునిలో తళుక్కుమనిపించారు. భారతీయ సంస్కృతిని కాలరాస్తున్న వారిపై నీ ప్రబల శక్తిని కురిపించమని మెరుపు కన్యను ఉద్బోధిస్తూ పాఠకుని జాగృత పరిచిన చక్కటి లఘు కావ్యం ఇది. క్షణానికొక తీరుగా సాగే మనసులతో చంచలులైన మానవులు మెరుపుతల్లిని చంచల అనటంలోని వైపరీత్యాన్ని ప్రశ్నించారు రచయిత. మానవుల జాడ్యాలన్నిటిని తళుక్కున మెరిసే మెరుపు తల్లి పారద్రోలాలని ఈ కావ్యంలో కవి ఆకాంక్షించారు.

**4. ఆటవెలది :** తాత్వికతను జోడించిన నైతిక విలువలను వంద ఆటవెలది పద్యాలుగా అందించిన లఘుకావ్యం ఇది. ఛందం పేరునే గ్రంథ నామంగా ఉంచడం ఇందులో మరొక సొగసు.


**"తెలుగు పాఠకులకు తేనెల సోనల,**

**నందజేసినట్టి యాటవెలది**
**'వెలది' యగునె? కాదు వెలలేని వెలకది,**
**నిలయమైన పలుకు చెలియగాని"**


అంటూ ఈ ఛందం పేరుకి సముచిత గౌరవం ఇచ్చారు. సరళ వ్యావహారిక పద సంయోజనతో కూడిన ఈ ఆటవెలదులు మంచి, మానవత్వం, పరోపకారం వంటి విలువలని ప్రకటిస్తున్నాయి.

**"అన్నపానములకు నారాటపడుటయే,**
**బ్రతుకు తెరువు గాదు వాసిజూడ**
**పరుల కడుపుబాధ పట్టించుకొనుటయే**
**మానవత్వమగుచు మహిని వెలుగు"**

ఈ కావ్యంలోని ప్రతి పద్యం తోటి మానవులపట్ల సహానుభూతి ప్రకటించాలనే ప్రేరణను పాఠకునికి కలిగిస్తుంది.




**5. నూట పదహారు :** లఘుకావ్యం గా మలచిన పద్యాల సంఖ్యను కావ్యనామంగా ఉంచటం ఇందులో చమత్కారం. తేటగీతి ఛందం లో రాయబడిన ఈ లఘు కావ్యంలో నీతులు, సూక్తులు వ్యంగ్య ధోరణిలో అధిక్షేపాత్మకంగా ప్రకటించబడ్డాయి. సుకవులను 'కవికళానిధి', 'కవి హంస', 'కవి కిశోర', అని పిలుస్తున్నట్లు, కుకవులను 'కవి శునక', 'కవి గార్దభ', 'కవి వరాహ' అని పిలవవచ్చని ఎద్దేవా చేశారు కవి. తేటగీతి పదాలలో ఇమిడిపోయే ఇంగ్లిష్ పదాలు డాక్టరు, కలకటేరు, కండక్టరు, ఆస్పత్రి వంటి పదాలను తెలుగు పదాలతో కలిపి ప్రయోగించటం ఇందులో కనబడుతుంది. అడవిలోని మృగాలు గ్రామాలలోకి రావటానికి కారణం అడవులు గ్రామాలు కావటం కాదని, ప్రజలు ఆటవికులవటం అనీ సమాజ తీరును విమర్శిస్తూ వ్యంగ్యంగా మొట్టికాయలు వేశారు.




**6. చైత్ర రథం :** భారతదేశం సర్వప్రపంచానికీ జ్ఞానప్రదాత అని గర్వపడుతూ **'వాని సంతతి వాడే ఈ భరత సుతుడు'** అనే మకుటంతో 'భారతీసూతి' అనే శీర్షికతో కొన్ని పద్యాలు, కులమతాలు అభివృద్ధి నిరోధకాలు కాకూడదని ప్రబోధిస్తూ 'భవ్య సుగుణగేయ భారతీయ' అనే మకుటంతో 'ప్రబోధిని ' అనే శీర్షికతో కొన్ని పద్యాలు రచించారు. ఈ విధంగా 57 శీర్షికలతో రచించిన పద్య కవితా సంపుటి ఇది. ఇందులో కొన్ని శీర్షికలు సామాజికమైనవి, కొన్ని జాతీయ భావనా ప్రచోదితాలు, కొన్ని దైవ సంబంధమైనవి, కొన్ని తాత్వికాలు, కొన్ని సాంస్కృతికాలు, కొన్ని సాహితీ సంబంధాలు. ఇలా భిన్న వస్తువులను ఎక్కించిన పద్య వాహనం చైత్రరథం.

బాల్య మాధుర్యాన్ని రుచి చూడటానికి మరోజన్మను కోరుకుంటూ, కపటం లేని బాలహాసం కనపడక యౌవనంలోనే వృద్ధాప్యం వచ్చేసిందంటారు కవి. జీవుడు చిత్పదార్థంగా మారకపోతే విలువ లేదనే విషయాన్ని **'విత్తు విత్తుగ నున్నచో విలువ లేదు, పరిణతము గాని దొకటైన ధరణి లేదు'** అంటూ అర్థాంతరన్యాసాలంకార ప్రయోగంతో సులభగ్రాహ్యం చేసి చైత్ర రథాన్ని అక్షరంగా నడిపిన సుకవి శర్మ గారు.




**7. శ్రీ వేంకటేశ్వర విలాసం :** వరాహ పురాణాంతర్గతమైన వేంకటేశ్వరుడి వివాహ పర్యంత కథ ఏడు ఆశ్వాసాల పద్యకావ్యంగా మలచబడింది. ఏడుకొండల పేర్లను ఒక్కో ఆశ్వాసానికి ఒక్కోపేరుగా ఉంచటం విశేషం. పూర్వ సంప్రదాయానుగుణంగా రచించబడిన అవతారికలో ఇష్టదేవతా స్తుతి, పూర్వ సంస్కృత, తెలుగు కవుల స్తుతి, జననీ జనకులతో పాటు ధర్మపత్ని ప్రశంస, గురు, మిత్ర స్తుతి, సుకవి స్తుతి , కుకవి నింద, షష్ఠ్యంత , ఆశ్వాసాంత పద్యాలకు ప్రత్యేక ఛందస్సులను ఉపయోగించి వాటిని ప్రార్థనా యోగ్యమైనవిగా తీర్చిదిద్దారు. ప్రథమాశ్వాసాంతంలో 'ధ్రువ కోకిల', సప్తమాశ్వాసం చివర 'మత్తకోకిల' ద్వితీయ, పంచమాస్వాశాంతాలుగా 'మాలిని', మిగిలిన ఆశ్వాసాల చివర 'తోటక' వృత్తాలను రచించడం జరిగింది. అష్టాదశ వర్ణనలను ఔచితీవంతంగా చిత్రించారు.

తిరుమలలో ఉన్న అనేక తీర్థమాహాత్మ్యాల వర్ణన , వేంకటాచల విశిష్టత , కొండపై వేంకటేశ్వరుని లీలా విశేషాలు మొదలైనవి ఐదాశ్వాసాలలో వర్ణించబడ్డాయి. షష్ఠ ఆశ్వాసంలో కలియుగంలో శ్రీనివాసుని దర్శించిన వారి కథలు చెప్పి చివరకు పద్మావతి వృత్తాంతం ఆరంభించారు. చివరి ఆశ్వాసంలో పద్మావతీ శ్రీనివాసుల వివాహ మహోత్సవాన్ని వర్ణించారు. ఇందులో వేంకటేశ్వరుడి లీలా విలాసం ప్రధానం. అందులో వివాహం ఒక భాగం కావటం వలన కావ్యం శృంగార ప్రధానంగా ఉండదు. పద్మావతీ శ్రీనివాసుల పరిచయాదులన్నీ తీర్థమాహాత్మ్య ఘట్టాలతో పాటు అద్భుత ప్రధానంగా తీర్చిదిద్దటం కనబడుతుంది. ఈ కావ్యంలో కవి రచనా శైలి,వర్ణనల సందర్భంలో కొన్ని చోట్ల కదళీ పాకమనిపించినా ప్రధానంగా ద్రాక్షాపాకంలోనే కథ ప్రవహించింది. నిర్వచనంగా తీర్చిదిద్దబడిన ఈ కావ్యం సరళ సుందరమైన శైలిలో కూర్చబడింది. శబ్దాలంకార ప్రయోగంలో కవి పోతనకు వారసుడనిపిస్తారు. సంయుక్తాక్షర ప్రాస ప్రయోగాలు, అంత్యానుప్రాస నిర్వహణ ఈ కావ్యంలో ప్రత్యేక ఆకర్షణలు.

**8. శకుంతల :** కాళిదాసు విరచిత అభిజ్ఞాన శాకుంతలం నాటకాన్ని విద్యార్థులకు బోధించే క్రమంలో కలిగిన కావ్యానందాన్ని పాఠకులకు అందించే ప్రయత్నంలో భాగంగా ఏడు ఆశ్వాసాల పద్య కావ్యంగా మలచారు శర్మగారు. నాటకాంతర్గత కథ మార్పులు చేర్పులు లేకుండా పద్య కావ్యరూపంగా తీర్చబడింది. కాళిదాసు కథా సంవిధానమే అనుసరించబడటంవలన శృంగార రస ప్రధానంగా కావ్య నిర్మాణం జరిగింది. ఆశ్వాసాద్యాంత పద్యాలు, అవతారిక వంటి సాంప్రదాయిక నిర్మాణ పద్ధతి ఇందులో పాటించబడలేదు.

కావ్య రూపం లఘువైనా, దీర్ఘమైనా శర్మగారి రచనలలో సౌందర్య భావన అతి సహజంగా ప్రతిఫలిస్తుంది. లాలిత్యం, సరళ పద సంయోజనం, స్పష్టమైన అభివ్యక్తి ఈకావ్యాలన్నిటిలోనూ ప్రతిబింబించాయి. రాకాచంద్ర సుధారసామృతాన్నిఅక్షరమైన కావ్యాల రూపంగా అందించిన చిరస్మరణీయుడు ఆచార్య అయాచితం నటేశ్వర శర్మ గారికి సవినయంగా ప్రణమిల్లుతున్నాను.

**నీ కావ్యమ్ము సమస్త మానవ మనో నీరేజమై భావమ్ము**
**ద్వీకా మాధురులన్ వెలార్చ హృది భావేందిందిరమ్మాయెరా**
**రాకాచంద్ర సుధా రసామృతములన్ త్రావించినావో కవీ !**
**నీ కావ్యమ్మున మాకు లభ్యమగురా నిత్యామృతమ్ముల్ సదా.**

– చైత్ర రథం

# నటేశ్వర శర్మ సారు... మీ సాటివారు లేరు...

**డా. బందరబోయిన శ్రీనివాస్, ఫోన్ : 94926 28554**

చిరు మందహాస ముఖారవిందం
ముద్ద మందార సుందర వదనం
కనగానే కలుగు నయనానందం
కవి శిరోమణి మా గురువర్యులు
నటేశ్వర శర్మ సారు మీ సాటివారు లేరు ॥ చిరు ॥

కటువైన మనసు కాదు మీదని
హితమైన మంచి మనిషి మీరని
కమ్మని కవితలే చాటుచున్నవి
సాహితీ వనములో విరబూసిన
కవి శ్రేష్ఠులయ్య మా గురువుగారు
నటేశ్వర శర్మ సారు మీ సాటివారు లేరు ॥ చిరు ॥

కోపం ఎప్పుడు మీ దరిచేరదు
ఓపిక ఎప్పుడు మిము విడిపోదు
అలుపన్నది లేనే లేదు
గెలుపు బాటలో నడుచుటకు
అవుతారు మీరు మాకాదర్శం



నటేశ్వర శర్మ సారు మీ సాటివారు లేరు ॥ చిరు ॥

ఊహలకే ఊపిరి పోసి
భావ ఝరులుగా మార్చేసి
మా హృదయాలను తడిపేసి
శిష్యులుగా మము తరింపజేస్తిరి
నటేశ్వర శర్మ సారు మీ సాటివారు లేరు ॥ చిరు ॥

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2024

# నటేశ్వర శర్మ విమర్శ రచనలు – అనుశీలన

**ప్రసాదం స్వాతి,** యంజేపీ గురుకుల అధ్యాపకురాలు, వర్గల్. ఫోన్ : 93926 06237

**పరిచయం :** నాన్నృషిః కురుతే కావ్యమ్ అని ఆర్యోక్తి. ఋషి కానివాడు కావ్యాన్ని రచించలేడు అని పై వాక్యానికి అర్థం. కవి అన్నవాడు తన రచనలచే సమాజంపై ప్రభావాన్ని చూపి సమాజంలో మార్పుని తీసుకొని రాగలడు అలా తెలుగు సంస్కృత ఉభయ భాషలలో 60 పైచిలుకు రచనల ద్వారా ఉభయ రాష్ట్రాలలోనూ విశేష సుప్రసిద్ధిని పొందిన మహాకవి డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ.

నటేశ్వర శర్మ 17 జూలై 1956, నేటి కామారెడ్డి జిల్లా రథాల రామారెడ్డి గ్రామంలో జయ లక్ష్మి అనంత రాజశర్మ దంపతుల గర్భశక్తి ముక్తాఫలంగా జన్మించారు తిరుపతి సంస్కృత వేద పాఠశాలలో, ప్రాచ్య కళాశాలలో చదువుకొని వ్యాకరణ శిరోమణి పట్టాను సాధించి నారు. తిరుపతిలో పార్థసారథి అయ్యంగార్, ఇంద్రగంటి కృష్ణమూర్తి శాస్త్రి వంటి మహా వైయాకరణులు ఆచార్య ఎస్.బి.రఘునాథా చార్యులు వంటి వారి వద్ద అంతేవాసిగా తర్కాన్ని, తిరుమల తాతాచార్యుల వద్ద పూర్వ మీమాంసను, నరసింహాచార్యుల మార్గదర్శనంలో సాహిత్య శాస్త్రాన్ని అధ్యయనం చేసినారు. చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ వంటి విద్వత్కవుల వద్ద కవితా రచనను అలవర్చు కున్నారు ఇటువంటి ఉద్దండులైన పండితులు గురువుగా లభించడం వారి పూర్వజన్మ సుకృతంగా భావించేవారు అయాచితం నటేశ్వరశర్మ.

1977 సంవత్సరంలో కామారెడ్డి లోని సాయం ప్రాచ్య కళాశాలలో సంస్కృత విభాగంలో ఉపన్యాసకునిగా తమ ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి లీడర్ గాను అసోసియేట్ ప్రొఫెసర్ గాను కళాశాల ప్రాచార్యులుగాను ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచ్య విభాగ పీఠాధిపతి గాను పనిచేసి ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దారు

అయాచితం వారి శిష్యులు ఎందరో తెలుగు పండితులుగా కవులుగా రచయితలుగా అవధానులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారున్నారు. ఈ విషయంలో డా. అయాచితం వారు **'శిష్య చిత్తాపహారకులు'.**

అయాచితం నటేశ్వర శర్మ గారి దస్తూరి ముత్యాలసరాలు. ఎందరో విద్యార్థులు ఆ దస్తూరిని అనుసరించిన వారే, ఆశ్చర్య చకితులైన వారే. వివిధ వాట్సాప్ బృందాలలో వారి ముత్యాల వంటి అక్షరాలను చూసి ఆనందించిన వారే. అనారోగ్యంతో శర్మగారు ఇహలోకాన్ని వీడి పరలోకాన్ని చేరడం ఉభయ భాషలకు సాహితీ లోకానికి తీరని లోటు అయినా వారు పరదేవతాపాద సన్నిధిలో కవిగా చేరారు అనడం సమంజసం.

ఉభయ భాషారచనా శోభితులైన డాక్టర్ అయాచితం వారి కలం నుండి 60కి పైచిలుకు ముద్రిత గ్రంథాలు వెలువడి సహృదయులను అలరించినాయి డాక్టర్ అయాచితం రచనలలో సంస్కృత గ్రంథాలు కావ్యాలు పరిశోధన గ్రంథాలు శతకాలు చరిత్రలు పద్యగేయ వచన కవితా సంకలనాలు సంగీత రూపకాలు విమర్శలు ఇలా అనేక ప్రక్రియలకు సంబంధించిన రచనలు ఉండడం విశేషం ఈ నా వ్యాసం డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ విమర్శా గ్రంథాల అనుశీలనానికి మాత్రమే పరిమితం.

శర్మగారు **లక్ష్మీ ధర వ్యాఖ్యాన వైభవం, పురుషార్థ వివేచనం** అనే గ్రంథాలు రచించారు వీటిని పరిశోధనా వ్యాసాలు అన్నారు కానీ ఇవి లఘు విమర్శాగ్రంథాలుగా వారే కొన్ని చోట్ల తెలిపారు. ఇవి రాశిలో లఘు విమర్శ గ్రంథాలే అయినా వాసిలో అలఘు గ్రంథాలు గానే అభివర్ణించవచ్చు!



**లక్ష్మీ ధరవ్యాఖ్యాన వైభవం**

సంస్కృత సాహిత్యం అనంతమైంది దానికి మూలం వేదం ఈ వేదాలను అనుసరించి స్మృతులు ఇతిహాసాలు పురాణాలు దర్శనాలు కావ్యాలు వెలువడ్డాయి.

ఆదికవి వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణము నుండి సంస్కృత కావ్య శాఖ విస్తృతమై శ్రవ్య దృశ్య భేదాలతో గద్య పద్య చంపువులు అనే శాఖలతో వర్ధిల్లింది కావ్య సాహిత్యంలో భక్తి ప్రధానములైన స్తోత్రాలు ప్రముఖ స్థానాన్ని అలంకరించాయి అవి దేవతా భేదాలు వస్తు భేదాలతో అనేకంగా వెలువడ్డాయి అటువంటి స్తోత్రాలలో జగద్గురు ఆది శంకర భగవత్పాదులు రచించిన సౌందర్యలహరి అనర్ఘమైన స్తోత్రము శ్రీవిద్యా సంప్రదాయానికి లక్ష్య రూపమై అలంకార శాస్త్ర యోగ శాస్త్ర రహస్యాలకు పెన్నిధిలా విరాజిల్లుతూ ఉన్న అమూల్య స్తోత్ర రత్నమిది.

ఈ సౌందర్యలహరి స్తోత్రంలో శంకరాచార్యుల వారు లలితా త్రిపుర సుందరి సౌందర్యాన్ని స్థూలంగానూ సూక్ష్మంగాను, సూక్ష్మతరం, సూక్ష్మతమం గాను అనేక తంత్ర యోగ రహస్యాలతో నిక్షిప్తం చేసి చెప్పిన విధానాన్ని అంత

లోతుగా సామాన్య పాఠకులు అర్థం చేసుకోలేరు కాబట్టి ఈ స్తోత్రానికి దాదాపు 41 వ్యాఖ్యాన గ్రంథాలు వెలువడినాయి. అందులో కేవలం 10 వ్యాఖ్యానాలు మాత్రమే ముద్రితమయ్యాయి లక్ష్మీధరా, సౌభాగ్యవర్ధినీ, అరుణామోదినీ, ఆనంద గిరీయా, డిండిమ భాష్యం, తాత్పర్య దీపినీ, సుధావిద్యోతినీ, పదార్థ చంద్రికా, గోపాల సుందరీ, కైవల్యవర్ధినీ ఇవి ఆ పది వ్యాఖ్యానాలు. ఇందులో కూడా శంకరాచార్యుల హృదయాన్ని చక్కగా తెలుసుకొని ఆవిష్కరించిన వ్యాఖ్యానం లోల్ల లక్ష్మీధర పండితుని లక్ష్మీ ధరా వ్యాఖ్యానం. ఈ మహోపాసకుడు క్రీ.శ.1465–1530కాలానికి చెందిన వాడని శ్రీకృష్ణదేవరాయల ఆస్థానాన్ని అలంకరించిన పండితుడని చారిత్రకుల అభిప్రాయం.

ఈ పది వ్యాఖ్యానాలలో శ్రీవిద్యా సంప్రదాయంలోని సమయాచార సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఉపాసకులు అందరికీ ఆమోదయోగ్యమైనది లక్ష్మీధర వ్యాఖ్యానమే. డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారి పీహెచ్డీ పరిశోధన అంశం సౌందర్యలహరి కాబట్టి సౌందర్యలహరి పై వచ్చిన అనేక వ్యాఖ్యానాలను వారు పరిశీలించినారు. అందులో లోల్ల లక్ష్మీధరుని వ్యాఖ్యానాన్ని అమితంగా ఇష్టపడి ఆ గ్రంథం విశిష్టతను తెలియజేయడానికై లక్ష్మీ ధర వ్యాఖ్యాన వైభవం అనే ఈ విమర్శ గ్రంథాన్ని 1999 సంవత్సరంలో రచించి ప్రచురించారు. ఈ అమూల్య గ్రంథాన్ని జాతీయ సాహిత్య పరిషత్ కామారెడ్డి శాఖ ప్రచురించింది. సౌందర్య లహరి కేవలం స్తుతి మాత్రం కాదు, తంత్ర యోగ శాక్తాద్వైత అనేక విశిష్టాంశములను తనలో నిక్షిప్తం చేసుకున్న విశిష్ట రచన. లక్ష్మీధరుడు ఈ విషయాలన్నింటినీ రమణీయ శైలిలో వ్యాఖ్యానించిన తీరు శ్రీవిద్యా సంప్రదాయజ్ఞులకు హృదయగతం. లక్ష్మీధర వ్యాఖ్యానంలోని సమయాచార విషయాలను ప్రామాణికమైన అనేక విషయాలను **పరిచ్ఛేదః పదార్థోక్తిః, విగ్రహో వాక్యయోజనా** మొదలైన వ్యాఖ్యాన లక్షణాలననుసరించి లక్ష్మీ ధరుడు ఎలా ప్రకటించారో అట్లే శ్రీ విద్యా , యోగ శాస్త్రాంశాలే కాక వ్యాఖ్యాత సాహిత్యాంశాలను కూడా ఎలా వివరించారు అనే విషయాలను ఈ గ్రంథంలో డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ ప్రకటించారు.

**సుధా సింధోర్మధ్యే... మహీం మూలాధారే... క్షితౌ షట్పంచాశత్... శరజ్జ్యోత్స్నా శుద్ధాం... సవిత్రీభిర్వాచాం... ముఖం బిందుంకృత్వా.. చతుష్షష్ట్యా తంత్రైః.... తవాజ్ఞా చక్రస్థం... తవాధారే మూలే...** వంటి అనేక అమూల్యమైన శ్రీ విద్యా సంబంధ శ్లోకాలకు లక్ష్మీ ధరుని పరమరమణీయ వ్యాఖ్యానం కొన సాగిన తీరును ప్రశంసించారు.

లక్ష్మీ ధరుడు ఆయా చోట్ల పూర్వకథలను, దేశీయాచారాలను వివిధ శాస్త్రాంశాలను వివరించిన తీరును వ్యక్తపరిచారు.

**కదా కాలే మాతః కథయ...** అనే శ్లోక వ్యాఖ్యలో లక్ష్మీ ధరుడు ఒక ప్రాచీన గాథను తెలిపిన తీరు ఔచితీమంతమని తెలిపారు.

లక్ష్మీ ధరుడు అవతారిక లో "ఈ స్తోత్రమున శంకర భగవత్పూజ్య పాదులు సమయమత తత్వవేత్తలై సమయాఖ్య యగు **చంద్రకళ** ను శ్లోక శతముచే ప్రస్తుతించిరి" అన్నారని అందుకే కేవలం 100 శ్లోకాలకి వ్యాఖ్యానాన్ని అందించినారని మరో మూడు ప్రక్షిప్తాలని డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ తెలిపారు.

గ్రంథం చివర **శివః శక్తిఃకామః...** అనే శ్లోక వ్యాఖ్యానాన్ని అందిస్తూ శ్రీవిద్యా తత్వాన్ని తెలుసుకొన గోరేవారు తన గ్రంథాన్ని, తనను గురువుగా భావిస్తే చాలుననే విషయాన్ని ప్రకటించారు. ఆ విషయాన్ని సర్వోత్తమ గుణ విశిష్టుడైన దేశిక ప్రవరునిగా లక్ష్మీధరుని కీర్తించారు, వ్యాఖ్యానాన్ని ప్రశంసించారు అయాచితం నటేశ్వరశర్మ.

**పురుషార్థ వివేచనము** :

పురుషార్థ వివేచనము అనే ఈ విమర్శా గ్రంథాన్ని అయాచితం నటేశ్వర శర్మ 2001 వ సంవత్సరంలో ప్రచురించారు. ఈ గ్రంథాన్ని జాతీయ సాహిత్య పరిషత్ కామారెడ్డి శాఖ ముద్రించింది.

ఈ లఘు విమర్శా గ్రంథంలో అయాచితం వారు ధర్మ అర్థ కామ మోక్షములు అనే చతుర్విధ పురుషార్థాలు మానవుడు ఏ విధంగా సాధించాలో స్పష్టంగా వ్యక్తపరిచారు. **వేదోఽఖిలో ధర్మమూలం** వేదాలు ధర్మానికి మూలమని మనస్మృతి ప్రవచించింది. ధర్మానికి అర్థ కామాలు అనుసంధాన మై ఉంటాయి. ఈ త్రివర్గం మోక్ష సాధనమని వేదాంతాలు ప్రకటించాయి కాబట్టి ఈ చతుర్విధ పురుషార్థాలు వేద మూలములు. ఈ గ్రంథంలో నటేశ్వర శర్మ ధర్మ అర్థ కామ మోక్షాలను వేదం మొదలుకొని వివిధ స్మృతులు పురాణ గ్రంథాల నుండి నిర్వచనాలు ఉదాహరిస్తూనే వాటికి సులభమైన వివరణను అందించారు.

విశ్వమును ధరించినది, పవిత్రము చేయునది, అత్యంత శ్రేష్ఠమైనది, చక్కగా చేసినది, ఫలములను వర్షించునది ధర్మము. (అమరకోశం)

ఇలా అర్థమునకు అందరిచే అర్థింపబడునదైన ధనమే అర్థమని చెప్పవలెను అన్నారు.

కామమునకు వేదాంతులు సాంఖ్యులు మొదలైన వారి దృష్టిలో ఉన్న భేదాన్ని శంకర భగవత్పాదులు తెలిపిన పురుషార్థములను కోరు వారిచే కోరబడినది కామము అని వ్యక్తపరిచారు

మోక్ష పద వ్యుత్పత్తిని తెలియజేస్తూ అవిద్యనివృత్తిచే ఉపలక్షితమైన స్వాత్మానందమే మోక్షమని సౌర సంహిత పేర్కొంటున్నదని ప్రకటించారు ఇలా ఈ చతుర్విధ పురుషార్థాలను వివరించి పురుషార్థ ప్రయోజనాలను ఈ గ్రంథంలో తెలిపారు అట్లే యోగ త్రయం గూర్చి వివరిస్తూ మోక్షాన్ని సాధించడంలో అనేక ప్రయత్నాలలో కర్మ, భక్తి, జ్ఞానాలు అనే యోగ త్రయానికి విశిష్టస్థానం ఉందని తెలిపారు. మానవులకు మేలు కలిగించడానికి కర్మ, భక్తి, జ్ఞానాలనే యోగ

త్రయం తెలిపింది శ్రీకృష్ణ భగవానుడని వ్యక్తపరిచారు. అట్లే ఈ గ్రంథంలో కర్మ జ్ఞానం భక్తి మొదలైన వాటిని గూర్చి విశ్లేషణ చేశారు మోక్ష సాధన సామగ్రిలో భక్తియే గొప్పదని శ్రీ శంకర భగవత్పాదులు వివేక చూడామణిలో తెలిపిన విషయాన్ని ఉటంకిస్తూ భక్తి తత్వాన్ని దాని విశిష్టతను అందులోని భేదాలను విస్తృతంగా చర్చించారు

పద్మపురాణోత్తరఖండంలో శివపార్వతీసంవాద రూపంలో చెప్పబడిన భక్తి భేదాలను అష్టాదశ భక్తి భేదముల పట్టికను ఈ గ్రంథంలో చేర్చారు డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ. వివిధ గ్రంథాలు తెలిపిన భక్తి సాధన మార్గాలను ఉటంకించారు.

జై మినీ సూత్రములు, తైత్తిరీయోపనిషత్తు, దేవీ భాగవతం, నారద భక్తి సూత్రములు, నారద పంచరాత్రము, పద్మ పురాణము –ఉత్తర ఖండము, బృహన్నారదీయము, భక్తి రసాయనం, భక్తి రసామృతసింధువు, భగవద్గీత, వివేక చూడామణి, శారదా తిలకం, శివానందలహరి, శ్రీమద్ భాగవతం వంటి ఉత్తమ భక్తి తత్వాన్ని తెలిపిన గ్రంథాలను, అందులో భక్తివిషయాలు సులభశైలిలో వివరించారు. భక్తి ద్వారా కలిగే ప్రయోజనాలను గ్రంథం చివర వివరించారు. సాధారణంగా ఎల్లరూ మోక్షమే భక్తికి పార్యంతిక ఫలమని అంగీకరించారు. అయినను కొందరు జ్ఞానాది రూప



ఫలములను కూడా చెప్పిరి అని ప్రకటించారు. ఈ విధంగా పురుషార్థ వివేచనము అనే గ్రంథం చతుర్విధ పురుషార్థాలను ఏ విధంగా సాధించాలో తెలుపుతూనే చక్కని భక్తి మార్గానికి బాటలు వేస్తుంది.

**ఉపయుక్త గ్రంథ సూచిక**

1. లక్ష్మీ ధర వ్యాఖ్యాన వైభవం – డా. అయాచితం నటేశ్వరశర్మ.
2. పురుషార్థ వివేచనము – డా. అయాచితం నటేశ్వరశర్మ.

## సత్సంగం

### స్వప్నము – సుషుప్తి – సమాధి




**శిష్యుడు :** స్వప్నాలను ఏ విధంగా నిగ్రహించాలి?

**భగవాన్ :** జాగ్రదవస్థలో వాటిని నిగ్రహించగలిగితే, నిద్రలో కూడా వాటిని నిగ్రహించుకోవచ్చును. జాగ్రదవస్థలో పొందిన స్పందనల ముద్రలే, నిద్రావస్థలో స్వప్నంగా పరిణమిస్తాయి. ఇది నిద్రావస్థలోనే గాని సుషుప్తిలో కాదు. స్వప్నంలో దర్శించినవాటి గురించి శిష్యుడు అడిగాడు : "అవి ఏమిటో నాకర్థం కాలేదు. కోతుల ముఖాలతో పెద్ద పెద్ద ఆకారాలు స్వప్నంలో కనిపించాయి."

భగవాన్ : ఆత్మకు పరిధులు లేవు. మనస్సే పరిమితమైన రూపాలను సృష్టిస్తుంది. మనస్సుకే పరిమితు లున్నాయి. అది ఇతరులకు కూడా పరిమితులు కల్పిస్తుంది. పరిమితులు అనేవి మనస్సుకే. పరమాత్మకంటే మనస్సు భిన్నం కాదు. ఒక బంగారు ఆభరణం కేవలం బంగారం కాకపోయినా, బంగారం కంటే భిన్నం కూడా కాదు.

మనస్సు ఒక అద్భుతమైన శక్తి. అది పరమాత్మయొక్క విచిత్రమైన శక్తి. మనస్సు ఉద్భవించిన తరువాతనే ఈశ్వరుడు, జగత్తు, జీవుడు ఉద్భవిస్తారు. గాఢనిద్రలో మనం వీటిని విడివిడిగా దర్శించలేము. అది భగవంతుని యొక్క మాయాశక్తి. గాఢనిద్రలో మనకు వీటి సంగతి తెలియకపోయినా, నిద్రలో మనం ఉన్నామని మనం ఎరుగుదుము. మనస్సు లేవగానే మనము మేలుకొంటాము.



ఎరుగుట, ఎరుగక పోవుట మనస్సుకు సంబంధించినవి మాత్రమే. జాగ్రదవస్థలో మనం మనసుతో తాదాత్మ్యం చెంది ఉంటాము. ఇప్పుడు మనస్సు వెనుకనున్న నిజతత్త్వం తెలుసుకొంటే, మనకు ఇంక ఎటువంటి పరిమితులు ఉండవు. సుషుప్తి అవస్థలో ఏమి పరిమితులు ఉన్నవి?

**శిష్యుడు :** నాకు తెలిసినంత వరకు ఏమీ లేవు.

**భగవాన్ :** 'నాకు తెలియదు' అని అంటున్నదేదో, అది కూడా మనస్సే. గాఢమైన నిద్రలో, నీవు నీ నిజమైన స్వరూపంగానే ఉంటావు. మధ్యలో కనిపించేదంతా, మధ్యలోనే మాయం అవుతుంది. 'ఆత్మ' జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో కూడా నిలిచే ఉంటుంది. అది జాగ్రదవస్థకు, సుషుప్తి అవస్థకు కూడా మూలస్థానం (ఆధారపీఠం). ఈ మూడు విభిన్న అవస్థలు మనస్సుకే. సమాధి స్థితి, సుప్త చైతన్యస్థితి కూడా మనస్సుకే. ఆత్మకు అవి అంటవు.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 (28) హైదరాబాద్ అక్టోబర్ : 2024

# ఆచార్య దేవోభవ

## అయాచితం అహల్యాదేవి



**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా।**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవేనమః ॥**

మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత పూజించాల్సినది విద్యాబుద్ధులు నేర్పిన మన గురువులనే వారి మార్గ నిర్దేశనమే మనను ఉన్నత స్థాయికి ఎదగడానికి తోడ్పడుతుంది అలాంటి నా గురువు బంధువు ఆత్మీయులు డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారు. వారు అందించిన విద్యయే నా ఎదుగుదలకు కారణమైంది అయాచితం వారు సాయం ప్రాచ్య కళాశాల కామారెడ్డిలో ఆచార్యులుగా పని చేసేవారు ఆ కళాశాలలోనే నేను కళాశాల విద్యనభ్యసించాను. నా గురువు శర్మ గారు నాకు సంస్కృతం బోధించేవారు సహనం మృదుస్వభావం ప్రశాంతత నిరంతర కవితా రచన ఆయన లక్షణాలు నిజం చెప్పాలంటే శర్మగారు ఒక విజ్ఞాన సర్వస్వం.

డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారు రామారెడ్డి వాస్తవ్యులు అయాచితం అనంతరాజ శర్మ జయలక్ష్మి గారలు వీరి తల్లిదండ్రులు 1956 జూలై 17 వ తేదీన రామారెడ్డి లో సంప్రదాయ సద్బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. స్థిర నివాసం కామారెడ్డి 1977లో కామారెడ్డి ప్రాచీ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా చేరి 2014లో ప్రధాన ఆచార్యులుగా ఉద్యోగ విరమణ పొందారు శర్మగారు శ్రీవేంకటేశ్వర వేద కళాశాల తిరుపతిలో వ్యాకరణ శిరోమణి విద్యను అభ్యసించారు ఆయన సహచరుడు డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ గారు.

నటేశ్వర శర్మ గారికి ఉన్న మరో ప్రత్యేకత ముత్యాలాంటి దస్తూరి అయాచితం వారు మంచి గురువు కూడా వందలాదిమంది శిష్యులు తెలుగు పండితులుగా అధ్యాపకులుగా పనిచేస్తున్నారు సాహిత్య రంగంలో అవధాన రంగంలో రాణిస్తున్నారు.

సంస్కృతాంధ్ర విద్వత్ కవి దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారు అవధానిగా గొప్ప గుర్తింపు పొందారు. డాక్టర్ రంగనాథ వాచస్పతి గారితో కలిసి అనేక జంట అవధానాలు చేశారు. శర్మ గారి సాహిత్య వ్యాసాలు కవితలు విమర్శలు అంతర్యామి శీర్షికతో చేసిన రచనలు అందరి హృదయాలను అలరించాయి. విద్యార్థి దశలో వ్రాసిన విక్రాంతగీతి వచన కవితా సంపుటి దాశరథి ప్రశంసలు అందుకుంది. సంస్కృతాంధ్ర భాషల్లో 50 కి పైగా రచనలు చేశారు. అయాచితం వారి దస్తూరి దేవుడిచ్చిన వరం. స్వదస్తూరితో 35 పేజీల పుస్తకాన్ని ముద్రించడం జరిగింది. ఈయన రచించిన అభిజ్ఞాన శాకుంతలానికి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కావ్య పురస్కారం లభించింది ఈయన అవధాన ప్రతిభకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం లభించింది. ఆది శంకరులు రచించిన సౌందర్యలహరి పై పరిశోధనకు గాను 1994లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను స్వర్ణ పతకాన్ని అందుకున్నారు. వారి మార్గదర్శకులు ఆచార్య కప్పగంతుల కమల గారు డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారి అమూల్యమైన సాహిత్య సేవకు గాను భక్తి సాధనం అనే ఆధ్యాత్మిక సంస్థ గజారోహణంతో సత్కరించడం తెలుగు సాహితీ లోకానికి గర్వకారణం గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం దాశరథి పురస్కారంతో గౌరవించింది. ఆయన రూపొందించిన సంస్కృత సంగీత రూపకం నాగిని పేరుతో ఇటీవల హైదరాబాదు ఆకాశవాణిలో ప్రసారమై రామప్ప దేవాలయ శిల్పకళా వైభవాన్ని చాటింది వ్యావహారిక భాషలో వ్రాసిన కవితా శతకం శ్రీశ్రీ సిరిసిరి మువ్వను తలపిస్తుంది

తెలుగు సంస్కృత సాహిత్య రంగాలకు అవధాన రంగానికి అయాచితం వారు చేసిన కృషి అమోఘం అనిర్వచనీయం. సాహిత్య లోకం ఆయన సేవలకు ఋణపడి ఉంది. అయాచితం నటేశ్వర శర్మ గారు 10- 09 -2024న మనందరినీ వదిలి కీర్తిశేషులు అయినారు. మరల తిరిగిరాని లోకాలకు వెళ్లారు. శర్మగారు మన మధ్య లేకపోయినా వారు చేసిన అపారమైన సాహిత్య సేవ చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. వారి ఆత్మకు శాంతి కలిగి ఆ లలితా పరమేశ్వరి వారికి మోక్షమును అనుగ్రహించు గాక అని హృదయపూర్వకముగా ప్రార్థిస్తున్నాను.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796　　　　　　　　　　　　　　　　　　　　　　UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక　సంపుటి -27 : సంచిక - 12　(29)　హైదరాబాద్　అక్టోబర్ : 2024

# అయాచితం వారి చిత్ర కవితా పరిచయం

**సుప్పని సత్యనారాయణ,** తెలుగు అధ్యాపకులు, కామారెడ్డి. ఫోన్ : 9492626910



డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ, ఈ పేరు వినని, తెలియని సాహితీవేత్తలు ఇరు తెలుగు రాష్ట్రాలలో ఉండరు అంటే అతిశయోక్తి కానేరదు. ఒక రచయితగా, పండితునిగా, అష్టావధానిగా, ప్రాచ్య విద్యా పరిషత్తు ప్రధాన ఆచార్యులుగా, బహు గ్రంథకర్తగా, విద్వత్ కవి పండితునిగా, ఉభయ భాషా ప్రవీణునిగా, శిరోమణిగా, దాశరథి పురస్కృతులుగా, గజారోహణ పురస్కృతులుగా, ఒక ఉత్తమ ఆచార్యునిగా, అన్నింటినీ మించి అందమైన చేవ్రాలు కలవారిగా, వారి బహుముఖీన ప్రతిభాపాటవాలను ఎంత పొగిడినా తక్కువే. సకల విద్యాపారంగతులు అన్నా, సకల కళా వల్లభులు అన్నా అది వారికి మాత్రమే చెల్లుతుంది.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా (ప్రస్తుతం కామారెడ్డి జిల్లా) కామారెడ్డికి ప్రక్కనేగల రథాల రామారెడ్డి గ్రామంలో తేదీ : 17–జూలై – 1956 న బ్రహ్మశ్రీ అయాచితం అనంత రాజశర్మ, శ్రీమతి జయలక్ష్మి దేవి దంపతులకు కలిగిన ఆరుగురు సంతానంలో మొదటి సంతానమే అయాచితం నటేశ్వర శర్మ గారు.



తండ్రి అయిన అనంతరాజశర్మ గారి ప్రోద్బలం, ప్రోత్సాహం వలన చిన్నప్పటినుండి భాషా సాహిత్యాల పట్ల అధ్యయనం, మక్కువ పెరిగాయి. ఇంట్లో అయినా, అటు పాఠశాలలోనైనా తొలి గురువులు శర్మ గారికి నాన్నగారే కావడం విశేషం. వారి సూచనల వలన భాష పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా, దస్తూరిని అందంగా మరియు నిర్దుష్టంగా వ్రాయడం నేర్చుకున్నారు శర్మగారు. చిన్న నాడు విద్యాబుద్ధులన్నీ తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంస్కృత వేద పాఠశాల యందు కొనసాగినాయి. విద్యార్థి దశలోనే 1970లో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీజయేంద్ర సరస్వతి వేద పాఠశాలను సందర్శించినప్పుడు విద్యార్థిగా ఉన్న శర్మగారు వారికి సంస్కృత శ్లోకాలతో స్వాగతం పలకడం విశేషం. అటు తరువాత శర్మగారు తన పాండితీ ప్రతిభలతో అంచెలంచెలుగా ఎదిగారు.

శర్మ గారు తెలుగు, సంస్కృత భాషల్లో 100కు పైగా కావ్యాలను వెలువరించారు. ముఖ్యంగా వీరి తొలి గేయ సంపుటి **'వసంతకుమారి 1981'.** ఖండకావ్యాలలో **"సమయ విలాసిని, పంచ శరీరం, సౌదామిని విలాసం, చుక్కలు, చైత్ర రథం, ఆటవెలది, జీవనయానం,"** విశిష్ట రచనలుగా పేరొందినాయి. వ్యవహారిక భాషలో రాసిన కవితాశతకం మహాకవి శ్రీశ్రీ రచించిన సిరిసిరిమువ్వ శతకమును తలపిస్తుంది. తిరుమల తిరుపతి వారిచే 'శ్రీవెంకటేశ్వర విలాసము' ను ముద్రింప చేశారు. వీరు రచించిన 'శకుంతల' పద్య కావ్యానికి తెలుగు విశ్వవిద్యాలయం వారి "కీర్తి పురస్కారం" లభించింది.




1977 సంవత్సరంలో నుంచి సంస్కృత విభాగ ఆచార్యులుగా, అనంతరం ప్రధానాచార్యులుగా సేవలందించిన శర్మగారు, 2011 నుంచి 13 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య భాషా విభాగానికి పీఠాధిపతి (డీన్) గా సేవలందించి 2014లో పదవీ విరమణ చేశారు. వీరు రచించిన వివిధ ప్రక్రియలలో వ్యాసాలు, సాహితీ విమర్శలు, కవితలు, పద్యాలు, పలు పత్రికల యందు ముద్రితమయ్యాయి. ఈనాడు దినపత్రిక వేదికగా, 'అంతర్యామి' శీర్షికన శర్మగారు రచించిన ఆధ్యాత్మిక వ్యాసాలు పాఠకులని విశేషంగా ఆకట్టుకున్నాయి. రామప్ప దేవాలయ శిల్పకళా వైభవమును చాటి చెబుతూ, ఆయన రచించిన సంస్కృత సంగీత రూపకం "నాగిని" ఇటీవల హైదరాబాద్ ఆకాశవాణి యందు ప్రసారమైంది. విద్యార్థి దశలోనే శర్మగారు రచించిన "విశ్రాంతి గీతి" మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల వారి మన్ననలను అందుకున్నది.

శర్మగారి అష్టావధాన ప్రక్రియ గురించి మాట్లాడవలసి వస్తే, అవధాని శశాంక, శతావధాని బ్ర.శ్రీ. గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మ గారి అవధానములను చూసి, స్ఫూర్తి పొంది అవధాన విద్యారంగంలో ప్రవేశించి, డా. అవధానం రంగనాథ వాచస్పతి వారి ప్రోత్సాహం మేరకు, వారితో కలిసి అనేకమైన జంట అవధానాలు కూడా చేశారు.

అయాచితం వారి సాహితీ సేవలకు గుర్తుగా, తెలంగాణ కెసిఆర్ ప్రభుత్వం **"2023 కు గాను దాశరథి పురస్కారము"** ను అందజేసింది. అంతేకాకుండా వీరి ఆధ్యాత్మిక సేవలకు తార్కాణంగా "భక్తి సాధనమ్" ఆధ్యాత్మిక సంస్థ **"గజారోహణ పురస్కారము"** ను అందజేసింది. తెలంగాణ రాష్ట్ర వైభవమును చాటి చెబుతూ వీరు రచించిన **"తెలంగాణ సుప్రభాతం"** (సంస్కృతం) తెలంగాణ మాస పత్రిక యందు, ధారావాహిక ముద్రితమై, పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నది.

అంతేకాకుండా తెలంగాణ 33 జిల్లాలను కొనియాడుతూ వారు రచించిన 33 పద్యాలు, తెలంగాణకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇది ఇంతవరకు ఏ సాహితీవేత్త చేయనటువంటి ఓ గొప్ప సాహసం. శర్మగారు 100కు పైగా అష్టావధానాలను చేశారు. జగద్గురు ఆదిశంకరాచార్య విరచిత "సౌందర్య లహరి" పైన వీరు చేసిన పరిశోధనకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1994లో స్వర్ణ పథకమును అందుకున్నారు. ఆముక్తమాల్యద పైన శర్మ గారు చేసిన విమర్శన గ్రంథం పరమ ప్రామాణికమైనదని చెప్పవచ్చు.

బహుముఖ ప్రజ్ఞాశాలిగా, విద్వత్ కవి పండితునిగా అపారమైన సాహితీ సేవను ఎందరో శిష్యకోటిని తయారు చేసిన శర్మగారు, కవిగా అష్టావధానిగా, ఒక ఆచార్యుని గానే కాకుండా వీరిలో దాగి ఉన్న మరో కోణం చాలా తక్కువమందికి పరిచయం. అదేమిటంటే వీరు గొప్ప చిత్రకారులు. ఇది చాలా తక్కువమంది పాఠకప్రియులకు తెలిసిన విషయం. ఒక కవితా శిల్పమును కవి అయిన వాడు చెక్కడం అంత సులభమైన విషయం కాదు. అందులో భావుకత, రమణీయత, భాషా వైభవం, ప్రేరణ భరితమైన ఒక స్ఫూర్తి అందులో నుండి ధ్వనింపజేయాలి. ఇదంతా ఒకవైపు నుండి చూసినట్లయితే, కవిత నైనా పద్యాన్ని అయినా అంత ఆకర్షణీయంగా తెల్ల కాగితం పైన ఆవిష్కరించడం ఒక ఎత్తు. శర్మగారిలో ఉండే ప్రత్యేకత ఏమిటంటే, వారి లేఖని నుండి వచ్చిన ప్రతి అక్షరం చెక్కిన శిల్పం వలే అక్షరానికి ప్రాణం వచ్చేది. కవితలకు వివిధ ఖండికలను వారే అందంగా వ్రాసేవారు. వారి సొంత దస్తూరితో ఈ మధ్యకాలంలో **"నటేశ్వరా! శతకము, శ్రీషోడశి"** పునర్ముద్రణలను చేయడం జరిగింది. సాహిత్య చరిత్రలో ఇది ఒక గొప్ప పరిణామం.

తెలుగు నేల పైన ఎందరో కవులు సాహితీ సృజనకారులు జన్మించినారు. అందులో ఒక్కొక్కరిది ఒక్కో చమత్కారం. కొందరు చిత్రకారులైతే, మరికొందరు కేవలం కవులు గాని మిగిలిపోయారు. అలిశెట్టి ప్రభాకర్ వంటి సాహితీవేత్తలు వారి రచనలకు వేరే చిత్రాలను వేసుకొని, వారి భావుకతను పాఠక లోకానికి కళ్ళకు కట్టినట్లు చూపించే ప్రయత్నాన్ని చేసి సఫలమయ్యారు. నేడు అదే కోవలో డాక్టర్ అయాచితం వారు కూడా.

మొదట వీరు కౌముది ఆర్ట్స్ పేరిట చిత్రాలు, వివిధ కార్యక్రమాలకు సంబంధించి ఆహ్వాన విశేషములు, వీరే స్వయంగా వ్రాసి ఇచ్చేవారు. వివిధ శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రములను కూడా అయాచితం వారే స్వయంగా వ్రాసి ఇచ్చేవారు. వీరి చిత్రాల యందు ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, వీరి చిత్రం మరెవరికి అనుకరణకు, అనుసరణకు వీలు లేనట్లుగా ఉండేది. కారణం కవి రసానుభూతి చెందినప్పుడే పాఠకుడిని కూడా అదే స్థాయిలో ఆనందింప చేయగలరు. లేనట్లయితే అది రసహీనమవుతుంది. అందునా ఆ కవి చిత్రకారుడు అయినప్పుడు ఆ అనుభూతిని మాటలతో వర్ణించడం కష్టం. అది కేవలం అయాచితం వారి చిత్రం మాత్రమే అవుతుంది.

వీరు వేసిన చిత్రాలకు కవితాత్మక శైలిలో వాటికి పేర్లను పెట్టడం, అంతే భావ గర్భితంగా రాయడం అనేది కొంత సాహసం అని చెప్పాలి. అయాచితం వారి చిత్రాలలో ముఖ్యంగా వారు పెట్టిన శీర్షికలతో కూడిన వాటిని గమనిస్తే, **"పద్య సుమము, దుర్జన సజ్జనమైత్రి, భూమి స్వర్గం, కలల కుటీరం, హరిహరాద్వైతమూర్తి, పుస్తకముఖి, మస్తకమే పుస్తకం, అక్షర కమలం, జ్ఞాన వికాస చిహ్నం, విశ్వశ్రేయః కావ్యం, అక్షర స్తూపం, పుస్తక స్తంభం, జ్ఞాన సోపానం, తాత్విక కమలం, విజ్ఞాన కమలం, శుభోదయం, శుభరాత్రి"** వంటి అనేక తాత్విక, భావగర్భములైన చిత్రాలు ఎన్నో వారి కలం కుంచె నుండి జాలువారాయి. కలానికి తగిన కుంచె, కుంచెకు తగిన కలం రెండూ రెండు పార్శ్వాలుగా, రెండు పాయలుగా సాగినాయి. ముఖ్యంగా వీరి చిత్రాలను గమనించినట్లయితే, అందులో ఏదో ఒక తాత్విక దృష్టి కోణం మనకు గోచరమవుతుంది. అంతేకాకుండా అంతర్వాహినిలా, ఒక సందేశం మనకు తెలియకుండానే ఒక ఉద్బోధ చేస్తుంది. అందునా మరికొన్ని చిత్రాలు వివిధ రచనలకు గాని, పుస్తకాలకు గాని ముఖచిత్రాలుగా వేసుకునే అంతగా ప్రాధాన్యతను కలిగి ఉండేవి అంటే మనం ఆశ్చర్యపోవలసిన పనిలేదు.

### 1. చిత్రం : విశ్వశ్రేయః కావ్యం

చరాచర ప్రకృతి యందు మానవ జీవన వికాసానికి కావ్యాలు ప్రధాన కారణభూతాలైతే, ఆ కావ్యారంభాలు చేసే మొదటి విధానం



శ్రీకారం ఆధారంగా మొదలవడం అనేది అనాది నుండి వస్తున్న ఒక ఒరవడి. అయితే ఈ కనిపిస్తున్న చిత్రాన్ని గమనించినట్లయితే, శర్మగారు ఇందులో అంతుచిక్కని వేదాంత సారమును ఇనుమడింప జేశారు. అది ఏ విధంగా అంటే? కవి లేఖని నుండి వెలువడే ప్రతి అక్షరం ఈ భూమిని తాకినప్పుడు, అది అంకురించి, అకుంఠితంగా, అప్రమేయంగా, అవిరామంగా, ప్రకాశిస్తూ ఉండడం వలన నింగి నుండి తొంగి చూసే భానుని కోటి కిరణాల ప్రకాశం వలే దేదీప్య మానంగా, కావ్యం, కవిత్వం ప్రకాశిస్తాయని స్థూలంగా దీని తాత్పర్యం. అందుకే రచయిత ఈ చిత్రానికి "విశ్వశ్రేయః కావ్యం" అన్న శీర్షికను జోడించినాడు. సత్కావ్యాలు ఎప్పుడు జగత్తుకు వెలుగు నందిస్తూనే ఉంటాయి. విజ్ఞానం అనే వెలుగు రేఖలను పంచుతూనే ఉంటాయి.



**2. చిత్రం : అక్షర కమలం**

కమలం పుష్పమును కాంక్షించని కవులు ఎవరైనా ఉంటారా? అంటే అది నమ్మశక్యం కాదు. కానీ భావుకుడైనా, రసపిపాసి అయినా కమలాన్ని కవిత వస్తువుగా తీసుకున్నప్పుడు, దానిని కడు రమణీయంగా వర్ణిస్తాడు. అలాంటిది కమలాన్నే దృశ్య కావ్యంగా మలచినప్పుడు అది వర్ణించడం అంత తేలికైన విషయం కానే కాదు. ఇక్కడ రచయిత అయాచితం వారు చేసిన పని కూడా అదే. అజ్ఞానాంధకారంలో ఉన్నప్పుడు మనిషి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటాడు. అలాంటిది విజ్ఞానమనే కాడ ఎప్పుడైతే తనకు మూల ధాతువు అవుతుందో, అప్పుడే తనలో వర్ణమాల మొదలుకొని, అనేక జ్ఞాన సంకేతాలు ఏర్పడి హరిత హరితమైన భావాలు విచ్చుకొని, విజ్ఞాన వీచికలు జగత్ ప్రకాశంగా వెలుగుతూ, నిత్యం చైతన్య కిరణాలను ప్రసరింప చేస్తాయి. కేవలం ఒక పువ్వులో ఇంతటి భావుకథను మరి ఎవరైనా చూడగలరా! సాధ్యం కాదు.



**3. చిత్రం : జ్ఞానవికాస చిహ్నం**

డాక్టర్ అయాచితం వారు ఈ చిత్రాన్ని ఎంతో రమణీయంగా ప్రదర్శింపజేశారు. మస్తిష్కానికి విజ్ఞానాన్ని అందించేది మొదట పుస్తకమే. శ్రీకారంతో మొదలుపెట్టి, వర్ణమాలల మెట్లు ఎక్కి, విజ్ఞాన పథమును ఏలే విధంగా, ఈ జ్ఞాన వికాస చిహ్నం సూచిస్తుంది. ఆరు రేకులు గల కమలమును, ఆరు సంకేతాలుగా అనగా ఆరు లలిత కలలుగా **"సంగీతం, సాహిత్యం, నాట్యం, శిల్పం, శాస్త్రం, విద్య"** వంటివి తీసుకుని,పత్రములుగా సత్య శివ సుందరమై వెలుగొందినప్పుడే, అది ప్రణవమై పరిఢవిల్లుతుంది. అంతేగాక అజ్ఞానము తొలగడమే కాక విజ్ఞాన కాంతి సోయగాలు నిత్యం ప్రసరిస్తూనే ఉంటాయి. అనే ఒక గొప్ప సందేశాన్ని మనం ఈ చిత్రం ద్వారా పొందవచ్చు.


**4. చిత్రం : దుర్జన సజ్జనమైత్రి**

లోకంలో మనుజుల ద్వంద్వ వైఖరి భావానికి నిదర్శనం ఈ తత్వం. ఒకే ముఖంలో రెండు స్వభావాలను మనం గమనిస్తాం. ఒకటి దుర్జనత్వం, మరొకటి సజ్జనత్వం. దుర్జనుల చేష్టలు వికృతంగా ఉంటాయి. సజ్జనుల చేష్టలు సానుకూలంగా ఉంటాయి. దుర్జనుల కళ్ళు క్రోధాన్ని చెబితే, సజ్జనుల కళ్ళు కరుణామృతమును వర్షిస్తాయి. దుర్జనుల మాట తీరు కటువుగా ఉంటే, సజ్జనుల మాట కుసుమ కోమలంగా ఉంటుంది. ఇలా ఏకముఖంలో రెండు స్వభావాలను చిత్రించడం తలపండిన యోధులకు మాత్రమే సాధ్యం. ఇది మానవుల వ్యక్తిత్వ గుణగణాలకు దర్పణం పట్టే చిత్రం అని కూడా చెప్పవచ్చు.




**5. చిత్రం : పద్య సుమము**

**"తెలుగు పద్యమ్ము నిత్యము వెలుగులీను"** అన్న ఆర్యోక్తికి నిలువెత్తు నిదర్శనం ఈ పద్య సుమము. భాషావైదుష్యంతో నిత్యం ప్రకాశిస్తుంది. తెలుగు నేపథ్యం, దాని పునాదులు ఎంత బలంగా ఉంటాయో, ఆ పునాదుల పైన పద్య కమలం సుకవి చేతులలో అంతే గొప్పగా పురుడు పోసుకుంటుంది.




ఆ పద్యం పదికాలాలపాటు పసివాడకుండా నిరంతర శోభాయమానంగా వెలుగుతూనే ఉంటుంది.

అయితే ఒక విషయమును పాఠక లోకం పసిగట్టవలసిన అవసరం ఉన్నది. అదేమిటంటే.. అయాచితం వారు గీసిన అనేక చిత్రాలలో కమల పుష్పాన్ని ప్రధాన వస్తువుగా తీసుకొని, తన భావుకత వ్యక్తపరిచారు. ఎందువలనంటే కమలం పుష్పం చూడడానికి అందంగా, ఆహ్లాదాన్ని కలిగించే విధంగా, కుసుమకోమలంగా ఉంటుంది. కానీ దాని మూలం మాత్రం కల్మషపంకిలాలతో నిండి ఉంటుంది. అయినా ఆ పంకిలాలను ఛేదించుకొని తన లక్ష్యమును చేరడానికి, అహర్నిశలు శ్రమించి,ప్రకృతి ఒడిలో కలిసి, తన పరిమళాలను, సోయగాలను పంచుతుంది. ఇది దాని యొక్క గొప్పతనం.



ఇలా గురుదేవులు డాక్టర్ అయాచితం వారి లేఖిని నుంచి జాలువారిన ప్రతి అక్షరం ఒక చెక్కిన శిల్పం. ప్రతి చిత్రం ఒక కళాఖండం. దానిని వర్ణించడానికి మాటలు చాలవు. కానీ ఆ చిత్రాలలోని అంతరార్థాన్ని నిత్యం అన్వేషించి తీరవలసిందే. అందులోని సందేశామృతాన్ని గ్రోలవలసిందే.


భావితరాలలో వారి చిత్రాలు తెలుగు భాషా సోయగాలను, భాషా కళామతల్లి వైశిష్ట్యాన్ని, ఎల్లవేళలా ప్రకటిస్తూనే ఉంటాయి. వారి దస్తూరి నిజంగా చెక్కిన శిల్పం. వారు అక్షరశిల్పి. చాలా మటుకు వారు వెలువరించిన పుస్తకాలకు ప్రధాన శీర్షికలు వారే స్వతహాగా వ్రాసినటువంటివి తప్ప, ఆ పని మరే పరికరము (కంప్యూటర్) చేయలేదు.




మచ్చుకు : **"ఋతుగీతం, సమయ విలాసిని, భారతీయ ప్రశస్తి, ఆముక్తమాల్యద పరిశీలనము, శకుంతల, శ్రీషోడశి, నటేశ్వరా!"** వంటి సురుచిరమైన కావ్యాల యొక్క శీర్షికలు వారి చేవ్రాలే.

తెలుగు తెలంగాణ సాహిత్య చరిత్రకు ఒక విశిష్టతను గౌరవాన్ని ఆపాదించి పెట్టిన పుంభావ సరస్వతి, శిరోమణి డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారు. తెలుగు, సంస్కృత కవితా చంద్రికలను అజరామరంగా వెలిగేలా యశస్సును సమకూర్చిన శర్మగారు 10-9-2024 నా మహాభినిష్క్రమణం చెందడం తెలుగు సారస్వత లోకానికి తీరని లోటు. వారు భౌతిక కాయాన్ని వదిలిపెట్టినా, వారి యశఃకాయం మాత్రం మన హృదయపేటికలపై ఎప్పుడూ కదలాడు తూనే ఉంటుంది.



ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 (33) హైదరాబాద్ అక్టోబర్ : 2024

# అయాచితం వారి తెలుగు శతకాలు

**ఎం. వేణుగోపాల్ శర్మ**, తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్. ఫోన్ : 903 252 8684



తెలంగాణాలోనే కాకుండా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో సాహితీ శిఖరాలను అధిరోహించి అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని పొందిన శతాధిక గ్రంధకర్త, సాహితీ శిరోమణి డా. అయాచితం నటేశ్వర శర్మ గారు చేపట్ట నటువంటి ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదేమో. నేను వారి గురించి రాస్తున్న మాటలు కేవలం పరమాణువులో పదోవంతు కూడా కాదేమో అని నా అభిప్రాయం. అయినా ఈ సందర్భంలో వారి గురించి చెప్పడం అదృష్టంగా భావిస్తూ నటేశ్వర శర్మ గారు సుమారు 15 వరకు రాసిన శతకాలలో కొన్నింటిని ఈ వ్యాసంలో విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను.

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన శర్మ గారు సంస్కృత ఆంధ్రములో చేపట్టనటువంటి ప్రక్రియ లేదన్నది అక్షర సత్యం. శ్లోకాలు, పద్యరచనలు, వచన రచనలు, మినీ కవితలు మొదలైన ప్రక్రియలో సాహితీ సేద్యము చేసిన హాలికులు శర్మ గారు. వీరి శతక రచనలు వాణీ శతకము, నవ్యనీతి శతకము, శ్రీ గణేశ శతకము, శ్రీ రాజేశ్వర శతకము, భారతీయ శతకము, కవితాశతకము మరియు నటేశ్వరా అను మకుటముతో రాసిన నటేశ్వరా!అను శతకములు వీరి రచనలు.



నటేశ్వర శర్మ గారి శతక రచనలో మొట్టమొదటిది నవ్యనీతి శతకము. దీనిని వీరు 1998వ సంవత్సరములో రచించిరి. ఈ రచనను కామారెడ్డి లోని ప్రాచ్య విద్యా పరిషత్తు ఆనాటి విద్యార్థులు ప్రచురించిరి. “హితేన సహితం సాహిత్యం” అని పెద్దలు చెప్పిన మాట సద్ది మూటగా భావించిన శర్మ గారు ఈ శతకములో సమాజములో గల లోపాలను వేలెత్తి చూపించి, ఆ లోపాలను సరిదిద్దడానికి గల పరిష్కారమును కూడా తానే సూచించిరి. తద్వారా సంస్కారవంతమైన జాతిని రూపుదిద్ద డానికి ప్రయత్నించిరి.

ఈ శతకంలో శర్మ గారు అధ్యయనములందు ఆసక్తి జూపుచు / గురు యశస్సు నిలుపగోరునట్టి / శిష్య రత్నములకు జేసెద నీకృతి / అంకితముగా హితమునాత్మ దలచి / అని తన మొదటి శతక రచనను విద్యార్థులకు అంకితము చేయడము అభినందనీయమే కాకుండా విద్యార్థుల పట్ల వీరు చూపించిన వాత్సల్యము గమనించ దగినది. ఈ స్పూర్తితోనే వీరి శిష్యరికములో వేలాది మంది విద్యార్థులు అధ్యాపకులుగా వివిధ రంగములలో సారస్వత సేవ చేస్తున్నారు. “భవ్యమైన గీతి నవ్యనీతి” అను మకుటముతో రాసిన ఈ శతకములో నీతులు సర్వకాలాలలో ఆచరణీయమైనది, నిత్యనూతనమైనవిగా వీరు దృఢముగా నమ్మిరి. కనుకనే **“భవ్యమైన నీతి నవ్య నీతి”** అను మకుటమును ప్రయోగించిరి.




**పుడమిపైన బడిన పూజ్యదినము నుండి / నేటిదాక మదిని నిలిచినట్టి / గురు సమూహమునకు కోటి నమస్కృతుల్/భవ్యమైన....** అను పద్యములో తాను పుట్టినప్పటినుండి నిరంతరము తనను ప్రోత్సహించిన గురు సమూహమునకు కోటి నమస్కృతులు సమర్పించడం నన్నయ, తిక్కనల కాలంనాటి నుండి తదనంతర కవులు ఆచరించినదే. పూర్వ కవులను స్తుతించడం మనందరికీ తెలిసినదే. పెద్దలను స్మరించి వారి ఆశీస్సులు పొందడం అనే సంప్రదాయాన్ని వీరు కూడా అనుసరించిరి. అంతే కాకుండా మరొక చోట వీరు **నీతులను వచింప నీతివేత్తను గాను / కబ్బములను వ్రాయు కవిని గాను / పలు విధములజెప్పు పండితుడను గాను / భవ్య...** అను పద్యములో తాను ఎంత ఎత్తు ఎదిగినా కూడా ఒదిగి ఉండడమే మేలని భావించిరి. అన్ని చెబుతూ కూడా తానూ పండితుడను కానని, నీతివేత్తను కానని, కవిని కానని సామాన్యుడనని చెప్పడం వారి మహోన్నత వ్యక్తిత్వానికి ఉదాహరణ. ఈ పద్యము చదివితే కాళోజీ గారి “నేను ‘నా’ నుండి ‘మా’ దాక” ఎదగలేదు అన్నమాటలు గుర్తుకురాక తప్పదు.

ఈ జగతిలో చూడగా ఎన్నో మంచి మాటలు చెప్పు వారు ఎంతో మంది గలరు కాని ఆచరించే వారు ఏరీ అని అంటూ, నీతి వాక్యాలు కేవలం చెప్పడానికే అన్నట్టు నేటి సమాజం పోకడ అని భావిస్తున్నట్టు తలచారు. ఖచ్చితంగా ఇది నిజమే ఎందుకనగా నేడు ఎంతోమంది ఫోన్ స్టేటస్‌లు గమనించినట్టయితే చాలామంది నీతి వాక్యాలు, మహనీయుల సందేశాలు ఉండడం చూడవచ్చు. కాని ఈ నీతులు ఆచరణలో కనబడవు . కేవలం చెప్పడానికేనా అని ప్రశ్నించడం ద్వారా సమాజానికి ఆచరించడమనే బాధ్యతను నొక్కి వక్కాణించారు.

**రోగబాధతోడ రోగులు దుఃఖింప / వైద్యరాజు కదియే భాగ్యమయ్యె / మానవతను మించి మాన్యమయ్యె ధనము** అను పద్యమును గమనిస్తే నేడు సమాజములో వైద్య రంగములో పీడిస్తున్న లోపాలను వేలెత్తి సూచించిరి. బలహీనతను ఆసరాగా తీసుకుని బలవంతులు వారి నుండి దోచుకున్న తీరును ప్రశ్నించడం అభినందించ దగినది.

1998 లో వీరు రచించిన శ్రీగణేశ శతకమును రాయుటకు ప్రేరేపించినది సకల గణాలకు నాయకుడైన వినాయకుడు అని తెలిపిరి. దీనికి తన బాల్యములో తన తండ్రిగారైన అనంతరాజ శర్మ గారు నేర్పించిన పద్యము "అంకము జేరి శైలతనయాస్తన దుగ్ధములానువేళ" అను పద్య ప్రభావము అని వీరి అభిప్రాయము. దీనికి వీరి తండ్రి గారు తన కుమారునితో ఆ గణేశునికి ఏదో గత జల సేతు బంధమున్నదని భావించి శ్రీగణేశ శతకమును రాయ ప్రోత్సహించిరి. తండ్రి గారి సంకల్ప బలముతో శ్రీగణేశ శతకమును వ్రాసి స్వగ్రామము రథాల రామారెడ్డి లోని తన ఆరాధ్య దైవమైన గణేశునికి అంకితమిచ్చారు. గణేశుడు తనకు అన్ని అభీష్టములు నేరవేర్చినట్టు భావించి ఈ శతక రచనను అయనకే అంకితమిచ్చారు. ఈ రాజేశ్వరాలయమునకు వీరి పూర్వీకులు అనువంశీకులయిన అర్చకులు. కావున వీరికి బాల్యము నుండే ఆధ్యాత్మిక చింతనాసక్తి కలిగింది. తాను కవిత్వము చెప్పడము ప్రారంభించి 25 సంవత్సరాల పిదప **శ్రీరాజేశ్వర శతకము** రాయడము ఆలస్యమయినదని భావించి స్వామివారిని మన్నించమని వేడుకుంటూ ఈ శతకము రాసిరి. "రాజేశ్వరా" అను మకుటముతో రాసిన ఈ శతకము యొక్క ప్రణాళిక అద్భుతం. ఆలయంలో జరిగే ఉత్సవాలు, వేడుకలు, జాతరలు, సేవలు, పరిసరాలు, జ్యోతిర్లింగాలు, పంచభూత లింగాలు, అష్టమూర్తులు అన్నింటినీ రాజేశ్వరునితో అన్వయించి రచించడంలో రచనపై తనకు పట్టు సాధించినట్టు తెలుస్తుంది. ఈ రచనలో శర్మ గారు ప్రయోగించిన వర్ణ సంయోజన పద్ధతి, ఎన్నుకొన్న పదజాలం, ప్రాసలు అన్నిట్లో కూడా చక్కని లాలిత్యం కనబడుతుంది.

శర్మ గారు 1998 లో రచించిన **వాణీ శతకము** కూడా భక్తి రసాత్మకమైనదే. తాను పొందిన జ్ఞానము అంతయూ సకల విద్యా స్వరూపిణి అయిన సరస్వతి అనుగ్రహమని భావించి అమ్మవారికి ఈ శతకము ద్వారా కైమోడ్పులు సమర్పించారు. ఈ శతకములో సంస్కృత, ప్రాకృత, ఆంధ్ర మరియు అన్ని భారతీయ భాషా సాహిత్యాలను వాగ్దేవి విరహ భూములుగా పేర్కొన్నారు. "వాణీ" అన్న మకుటంతో కొనసాగిన ఈ రచనలో బాసర అమ్మవారిని వాగ్రూపిణిగా, సాహిత్యమూర్తిగా, వర్ణ రూపిణిగా ఆరాధించారు.

1998లో గణతంత్ర దినోత్సవ సందర్భంగా వెలువరించిన **భారతీయ శతకము**లో స్వతంత్ర భారతావని పౌరులు అచరించవలసిన ధర్మమును విశ్లేషించిరి. **"భవ్యసుగుణ గేయ భారతీయ"** అన్న మకుటముతో సాగిన ఈ శతకములో పౌరులు ధర్మాన్ని మనసా, వచసా, కర్మణా ఆచరించాలి. అప్పుడే మన పూర్వీకులు ఎంతో కృషిచేసి తపశ్శక్తితో మనకు అందించిన వారసత్వ సంపద, చరిత్ర, సంస్కృతి రేపటి తరాలకు అందించాలన్నా, ప్రపంచానికి మనం ఆదర్శంగా నిలవాలన్నా మన ధర్మాన్ని మనం అనుసరించాలి. ఈ భావనిష్ఠ పెరిగి, హృదయపు లోలోతుల్లోకి చేరి, చైతన్య రహితులను చైతన్య వంతులుగా తయారు చేయాలి. అలా మేలుకొలిపే ప్రయత్నం ఈ శతక రచన ద్వారా చేశారు. భారతీయ వాఙ్మయంలోని సత్యం, శివం, సుందరం ఈ దేశభక్తి శతకము ద్వారా ఆవిష్కరించి మన సాహిత్య అధ్యయనము పట్ల భారతీయులను సుముఖులను చేయ ప్రయత్నించడమే ఈ శతక లక్ష్యము.

భారతీయ సారస్వతము అపారమైనది. వాటిని తెలపడానికి ఎన్ని రచనలు వెలువడిననూ సరిపోదు అంటూ తన వంతుగా ప్రయత్నాన్ని కొనసాగించిరి శర్మ గారు. భారతీయ సాహిత్య సామ్రాజ్యాన్ని చేసినచో మనిషి తన జీవిత పరమావధి తప్పక సాధించగలరని ఈ శతకములో పేర్కొనిరి.

**బహుళ పుణ్యభూమి భరతధరణి**
**యట్టి నేలయందు పుట్టినావు**
**కాన భారతీయఘననామకుడవురా**
**భవ్యసుగుణగేయ ! భారతీయ !**

ఆర్షధర్మాన్ని చక్కగా అందచేసిన భారత దేశములో పుట్టడమే అదృష్టంగా భావించాలని అంటూ ప్రతీ భారతీయుడు గొప్పనైన కీర్తిని పొందాలని సామాజిక బాధ్యతను తెలిపారు. **తొల్లి మానవుడు కల్లలు కపటాల / నంటనీక బ్రతుకు నంతగడిపె / నేటి నరుడదేల చేటును జేయునో / భవ్యసుగుణ ....** మన పూర్వీకులు తమ స్వార్థము కోసము కాకుండా నిస్వార్థంగా సమాజం కోసం, దేశం కోసం జీవించారు. అది ఋషులు మనకు అందించిన గొప్ప సందేశం. అట్టి సందేశాన్ని నేటి మానవుడు అందరినీ ఆచరించమని చెబుతూ తాను మాత్రము ఆచరించడం చేయకపోతే, బాధ్యతలను విస్మరిస్తే రేపటి తరం ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఇక శర్మ గారి చివరి శతకము అనుకుంటా. 2023లో వెలువడిన **"నటేశ్వరా"** అను మకుటముతో రాసిన ఈ శతకము తమ కులదైవమైన రాజరాజేశ్వరుని సేవలో తమ పూర్వీకులు

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 (35) హైదరాబాద్ అక్టోబర్ : 2024

తరించారని, పునీతులయ్యారని, అలాంటి ఆ స్వామికి ఒక కవిగా తన అనుభూతిని, ఆర్తిని నివేదించారు ఈ శతకములో. ఆ స్వామి కృపాకటాక్షాల వలన, తమ పూర్వీకుల అమూల్యమైన సారస్వత సేవ వలన, ఆ విద్యా సంపదను తనకు ఆచరించి అందించారని, దాని వలననే తాను ఈ సాహిత్య సేవను చేయగలుగుతున్నానని అన్నారు. ఈ శతకము ప్రత్యేకత ఏమిటంటే శర్మగారు స్వయంగా నటేశ్వర శతకము ప్రథమ ముద్రణ చేతిరాతతో అచ్చు వేయించిన రచన ఇది. ఆ తరువాత ద్వితీయ ముద్రణ ఇటీవలే అచ్చు వేయించారు. చంపకమాల వృత్తములో ఈ రచన కొనసాగినది. ఈ శతకములోని పద్యాలలో చాలా వరకు నీతి ప్రబోధములుగా నిలిచాయి.

**హితమును పల్కువారలకభీష్టులు తక్కువ, మాయ మాటలన్**
**చతురతతోడ పల్కుచు ప్రశంసలుజేసెడి లౌక్యజీవులే**
**సతతము గానుపింతురు విచార్యము కొందరితీరుచూడగా**
**హితులెవరో కనుంగొనుటయే కడుకష్టమురా నటేశ్వరా !**

ఈ పద్యములోని మనుషుల తీరు, నేడు సమాజములో మనందరము చూస్తున్నదే. పైకి తీయని మాటలు చెబుతూ, ప్రశంసలు ఇస్తూ లోపల విషం కక్కే లక్షణము ఉండడం సరికాదు కదా ! ఇలా ఉండడం వలన మంచి వారెవరో, చెడు వారెవరో తెలుసుకోవడం కష్టమవుతుందని అంటారు. ఈ విధంగా ఈ శతకములో లోకము యొక్క పోకడలు తెలుపుతూ నీతిని ప్రభోదించారు.

1996 లో వెలువడిన **"కవితా శతకము"** కూడా వ్యావహారిక భాషలో వెలువడిన రచన. ఈ శతకమును చదివినచో శ్రీశ్రీ రాసిన **"సిరిసిరిమువ్వ"** శతకమును తలపిస్తుందని పండితుల విశ్లేషణ. ఇందులోని పద్యాలు అన్నీ పండిత పామరులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉండడం విశేషం.

**ఇక్కడ పుట్టుచు పెరుగుచు**
**ఇక్కడి సంపదలెల్ల ఇచ్చగతింటూ**
**దుక్కగ పెరిగిన వారికి**
**దిక్కయ్యె విదేశవాక్కు దివ్యసుకవితా !**

ఈ దేశములో పుట్టి, ఇక్కడే పెరిగి, ఇక్కడి సంపదలెల్ల హాయిగా అనుభవించి, బాధ్యతలను మరచి విదేశీ నడవడిని అనుసరించుచూ స్వదేశాన్ని ఈసడించడం తీవ్రంగా ఆక్షేపించాడు కవి. ఈ విధముగా శర్మ గారు తన రచనా వ్యాసంగములోని కొన్ని అంశాలను చెప్పడానికి ప్రయత్నించాను. వీరి రచనల గురించి ఎంత రాసినా తక్కువే. కొన్ని శతక రచనలను స్వీకరించి రాసాను.

# సౌందర్య లహరీ సౌందర్య దర్శనం

**డా. ఎన్. అనంత లక్ష్మి,** విశ్రాంత ఆచార్యులు, ఆధ్యాత్మిక వేత్త. ఫోన్ : 99491 98141

ప్రతిమనిషి జీవితానికి ఒక ప్రయోజనం, పరమార్థం ఉంటాయి. ఊహ తెలిసినప్పటి నుండి చేసేదంతా కూడా దాని కోసం చేసే అభ్యాసం అవుతుంది. జీవిత ప్రయోజనమైన మహత్కార్యం చేయటానికి అంతకు ముందు చేసిన దంతా సాధన. ఆ ప్రధానకార్యం అయిన తరువాత చేసే వాటిపైన దాని ప్రభావం ఉంటుంది. డా. అయాచితం నటేశ్వర శర్మగారి సాహిత్య ప్రస్థానం గమనిస్తే ఈ సత్యం నిరూపిత మవుతుంది.




శ్రీ అయాచితం నటేశ్వర శర్మ గారు నిరంతర పుస్తకపఠనం, పద్యరచన, లలిత సంగీతం, శతావధానాలు, అష్టావధానాలు తమ అభిరుచులని చెప్పారు. అవన్నీ పరస్పర పరిపోషకాలు. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలు ఉంటేనే అవధాని కాగలుగుతారు. వీటికి ధార, ధారణ తోడు కావాలి. స్తోత్ర వ్యాయం, ముఖ్యంగా శంకరుల స్తోత్ర వ్యాయం వంట బడితే ధార అవిచ్ఛిన్నంగా సాగుతుంది. అయాచితం వారి విషయంలో ఇది సత్యమే కదా!

మూడు దశాబ్దాల క్రితం స్వర్ణ పతకానికి అర్హమైన పరిశోధన వెలుగు చూడటానికి ఇంత కాలం పట్టటానికి కారణం సాహిత్యాభిమానులు, ఆధ్యాత్మికసాధకుల దురదృష్టమే. ఈ వెలుగులో తన ప్రాణమనే వెలుగుని మిళితం చేసి మనకి అందించిన డా. అయాచితం నటేశ్వర శర్మ గారికి, వెలుగులోకి తీసుకు రావటానికి కృషి చేసిన శ్రీ దర్శనం శర్మ గారికి కృతజ్ఞతలు.

పరిశోధనావ్యాసం కనుక విశ్వవిద్యాలయాల ప్రమాణాలు పాటిస్తూ తాత్త్విక చర్చయే చేశారు. ఇది కష్టమైన పనే! అందుకే ఈ గ్రంథం ఆణిముత్యం.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2024



ఇందులో ఉన్న 6 అధ్యాయాలకి తరంగములు అనే పేరు పెట్టటం సముచితం. వివేచిస్తున్నది సౌందర్యలహరిని. అంటే, సౌందర్య ప్రవాహం. ప్రవాహానికి పెట్టిన పేరు లహరి. అంటే కెరటాల సముదాయం. తరంగం అన్నా కెరటమే.

మొదటి తరంగంలో సనాతన ధర్మంలో స్తోత్రసాహిత్యానికి ఉన్న ప్రాధాన్యం, దాని వికాసం తెలియ చేస్తూ, శంకరాచార్య జీవన రేఖలు, కర్తృత్వ విచారము, కాలనిర్ణయము వారి సాహిత్యం గురించి ఉన్న భిన్న అభిప్రాయాలు కూడా పేర్కొన్నారు. అంటే దరిదాపుల్లో అప్పటి వరకు ఉన్న అన్ని మతాల వారి అభిప్రాయాలు ఒక్క చోట మనకి దర్శన మిస్తాయి. ఎంత గొప్ప సేవ!

సనాతన ధర్మంలో ఉన్న విశేష మేమంటే సాహిత్యం ముఖ్యంగా స్తోత్ర సాహిత్యం చాల వరకు మౌఖికం. ఆ కారణంగా కొన్ని



మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటూ ఉంటాయి. పాఠభేదాలు, అధిక శ్లోకాలు అన్ని స్తోత్రాలలో కనపడతాయి. వాటి ప్రామాణికతని నిర్ధారించటానికి ఎన్నో మతాల వారి వ్యాఖ్యానాలని, భాష్యాలని కూలంకషంగా అధ్యయనం చేయవలసి ఉంటుంది. డా. అయాచితం నటేశ్వర శర్మ గారు సౌన్దర్యలహరికి ఉన్న 36 భాష్యాలను అధ్యయనం చేసి నిశ్చయించారు. రెండవ తరంగంలో ఈ విషయాలు చర్చించారు. దీనికి పాండిత్యం ఉంటే సరిపోదు. శ్రద్ధ, దీక్ష, ఉపాసన ఉండాలి.

మూడవ తరంగం అసలైన సిద్ధాంత ప్రతిపాదన. సౌందర్యలహరిలో ప్రతిపాదించ బడిన తంత్రము, యోగముల సమన్వయం, శ్రీవిద్యా విశేషాలు, కౌల, సమయాచారాలు మొదలయిన అన్ని భేదాలని క్లుప్తంగా వివరించారు. శంకరులు సౌందర్యలహరిలో ప్రతిపాదించిన గారుడము, సారస్వతము మొదలయిన వివిధ ప్రయోగాలని (అంటే శ్లోకాలను వివిధ ప్రయోజనాలకు ఏ విధంగా ఉపయోగించ వచ్చు అన్నది), శ్రీచక్ర భేదాలని, కుండలినీ శక్తిని కూడా చర్చించారు. జద్గురువులు శ్రీ ఆదిశంకరులవారి హృదయాన్ని ఆవిష్కరించారు.

నాలుగవ తరంగంలో ఎక్కువగా సౌందర్యలహరిని సాహిత్య పరంగా వివేచించటం ఉంది. సౌందర్యలహరి అమ్మవారి భౌతిక, తాత్త్విక సౌందర్యాలని వర్ణించటంతో పాటు సాహిత్య పరమైన సౌందర్యాన్ని కూడా సంతరించుకుంది. ఛందస్సు ఒకటే ఉన్నా, వర్ణనలలో కనపడే రీతి, శైలి, అలంకారాలు, సాముద్రికాది శాస్త్రాల ప్రతిపాదన మొదలైన అంశాలలో దాని కదే సాటి. ధ్వని, ముఖ్యంగా రసధ్వని ప్రధానంగా దర్శన మిస్తుంది. వీటిని గురించి చర్చించి, "శాస్త్రకావ్యం" అని నిరూపించారు.

ఐదవ తరంగం సౌందర్య లహరి పై వచ్చిన వ్యాఖ్యానాల గురించి ఉంది.

ఆరవ తరంగం స్తోత్ర సాహిత్యం గురించిన చర్చ. స్తోత్రం అంటే స్తోత్రపాఠం, స్తుతించటం, స్తుతి చేస్తున్న భక్తుడు, స్తుతించ బడుతున్న దైవం అనే అంశాలు ఉన్నాయి. ఇందులో ఉన్న అద్వైత తత్త్వ ప్రతిఫలనం దర్శించటానికి శంకరుల అద్వైతం ఎంతగా వంట పట్టి ఉంటుందో అర్థం చేసుకోవలసి ఉంది. ఆ కారణంగానే కాబోలు శృంగేరి శంకరమఠం శ్రీ చరణుల నుండి, కంచిమఠం నుండి, పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి వారి నుండి ఆశీస్సులు గ్రంథానికి, గ్రంథకర్తకు లభించాయి. ఈ తరంగం లోనే సౌందర్యలహరిపై ఇతర స్తోత్రాల ప్రభావం, ఇతర స్తోత్రాలపై సౌందర్యలహరి ప్రభావం కూడా చర్చించటం జరిగింది.

సౌందర్యలహరీసర్వస్వం అన దగిన సిద్ధాంత వ్యాసం అందించిన కీర్తి శేషులు డా. అయాచితం నటేశ్వర శర్మ గారు మణిద్వీపంలో అమ్మవారి సన్నిధిలో ఉండి ఉంటారు.

# ఉభయ భాషా సాహితీ నటేశ్వరం శ్రీషోడశీ ... సంస్కృత స్తుతి

**సరస్వతీ రామశర్మ** . తెలుగు పండితురాలు, సిద్ధిపేట, ఫోన్ : 996 321 9641

సంస్కృతాంధ్ర విద్వత్కవివరేణ్యులు, అవధాన శిరోమణి ప్రతిష్ఠాత్మక దాశరథి పురస్కార గ్రహీత కీ.శే. డా.అయాచితం నటేశ్వర శర్మ గారు శ్రౌతస్మార్త కర్మాచరణీయులు. వీరు కామారెడ్డి ప్రాచ్య విద్యా పరిషత్ ప్రాచ్య కళాశాలలో సంస్కృత అధ్యాపకులుగా మరియు ప్రధానాచార్యులుగా 37 సంవత్సరాల ఉద్యోగ నిర్వహణలో కృతకృత్యులై విరమణ పొందారు. తర్వాత 2011 నుంచి 2013 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచ్య విభాగానికి పీఠాధిపతులుగా సేవలందించారు. సంస్కృత భాషలో, తెలుగు భాషలో 50కి పైగా గ్రంథాలు ప్రచురించారు. 120 కి పైగా అష్టావధానాలు చేసి ఎన్నో పత్రికలలో పద్యాలు, వచన కవితలు, గేయాలు, రేడియో ప్రసంగాలు 20కి పైగా అందించారు. విశిష్ట పురస్కారాలను అందుకుని ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత ప్రతిష్ఠాత్మక **దాశరథి పురస్కారాన్ని 2023** సంవత్సరంలో పొందారు. మరియు 'భక్తి సాధనం' ఆధ్యాత్మిక సంస్థ నుండి 2022 డిసెంబర్లో **గజారోహణ గౌరవాన్ని** పొందిన సాహితీమూర్తి **శిరోమణి డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారు** రచించిన శ్రీషోడశీ అనే రచనను పరిశీలించే అవకాశం దక్కినందుకు ధన్యురాలనైనాను.

ఈ లఘు స్తుతి వాసిలో చిన్నదైనా అమ్మవారి భక్తి వారాశిలో అనల్పమైన స్తుతిగా చెప్పవచ్చు..

ఆదిశంకరాచార్యుల సౌందర్యలహరిని, లలితా రహస్య నామ సహస్ర స్తుతిమయమైన రచనా వైదుష్యంతో అమోఘమైనభక్తికి అపురూపమైన పదలాలిత్య వర్ణనకు నిదర్శనం. శ్రీవిద్యా ఉపాసన చేస్తే తప్ప, ఆమె కృపాకటాక్షం ఉంటే తప్ప అంతగొప్పగా ఔన్నత్యమైన సంస్కృత సమాసోపమానాలంకారాలతో వ్రాయడం అసంభవం అనడం అతిశయోక్తికాదు.

### స్తోత్రనేపథ్యం

అయాచితం వారు ప్రతి సంవత్సరం శరన్నవరాత్రుల సందర్భంలో ఇంట్లో జరిగే త్రిరాత్రి ఉత్సవాలలో వైభవపేతంగా జరుగుతున్న మాతృ సేవార్చనను వారి పితృపాదులైన బ్రహ్మశ్రీ అనంతరాజ శర్మ గారు శ్రీమాతను వాఙ్మయ రూపంలో సేవించమని ఆదేశించగా **శ్రీషోడశీ** అనే పేరిట సంస్కృత స్తోత్రమును రచించదలచారని వారి **ఆత్మీయము** లో చెప్పారు. ప్రథమ ముద్రణ ప్రమోద నామ సంవత్సర విజయదశమి రోజున దేవీ శరన్నవరాత్రి ఉత్సవ సందర్భంలో తేది 29-9-1990లో **జాతీయ సాహిత్య పరిషత్** ఆధ్వర్యంలో నాటి అధ్యక్షులు డాక్టర్ వాచస్పతి గారి మరియు సభాధ్యక్షులు శ్రీ త్రిగుళ్ల వెంకటేశ్వర శర్మ గారి నేతృత్వంలో శ్రీ దోర్బల విశ్వనాథ శర్మ గారు, డాక్టర్ అమరేశంగారి రాజేశ్వర శర్మ గారి చేతులమీదుగా ఆవిష్కరించ బడింది. మామూలుగా అచ్చు రూపంలో వచ్చింది. కానీ తిరిగి 33 సంవత్సరాల తర్వాత ద్వితీయ ముద్రణ తేది 01-09-2023 రోజున 500 ప్రతులతో శ్రీమతి త్రిగుళ్ల అరుణ కుమారి గారి సౌజన్యంతో వెలువడడం జరిగింది..

దీని వైశిష్ట్యం ఏమిటంటే శ్లోకం, ప్రతిపదార్థం,తాత్పర్యంతో పాటుగా నాటి పుస్తకం లో వచ్చిన ముందుమాటలు, ఆశాసనములు కూడా పూర్తిగా వారికి సర్వకళారూపిణి ఇచ్చిన అమోఘమైన మరో వరం అందమైన దస్తూరీతో ఈ స్తుతి వెలువడడం.

### స్తుతి విశేషాలు

మొదటి శ్లోకంలో **శ్రీలాలితా వచో విరాజిత** అని ఆరంభించి **చాంద్రీం కలాంభావయే** అని ముగిస్తూ మంగళ ప్రదాయకమైన, శాశ్వతానందకరమైన, లాస్యమైన, షోడశాత్మక పూర్ణేందు పూర్ణచంద్రుని వంటి ముఖం కలిగిన పూర్ణ కళాముఖమును దయామయములైన చూపులతో కూడిన శృతి స్మృతులతో కరుణను పరిమళింప చేస్తూ పూజింపబడుతున్నావు. విశ్వకల్యాణ ఋషి ప్రోక్త స్తుతులతో షోడశాత్మక పూర్ణచంద్రుని వంటి పూర్ణబింబముఖంతో శృతిస్మృతులనే జ్ఞానపరిమళాల అమృతవాక్కులనెడి పుష్పాలతో పూజిపబడే శ్రీవిద్యను నా హృత్పద్మవాసిని గా సేవిస్తున్నాను అంటూ, కళ్యాణకారిణియైన, శ్రీవిద్య సువిరాజితవైన నీవు నిర్మల సుతత్వ రత్నవనుచు, మా పాపరాశిని ఖండించుమా అని స్తుతి చేస్తూ... శ్రీవిద్యా తత్వాన్ని కొనియాడారు. ఋషి ప్రోక్త స్మృతివై తపస్సులచే ప్రభవించిన శ్రీవిద్యవు కావున ఆ పాలకడలి నుండి జన్మించిన షోడశ కళాపూర్ణ విద్యగా పేరొందిన చంద్రకళవై వెలుగొందెదవు అని భక్తితో నమస్కరిస్తూ, లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ అజ్ఞానాంధ కారమును వీడనాడు మార్గము నీవైతే నీ స్తుతి చేస్తున్నందుకు నన్ను ధన్యుడను చేస్తున్నావు. దేవి సంబంధిత పలుకు, దృష్టి, స్మరణ, భావన మొదలైనదేదైనా అన్ని పురుషార్థాలను సాధింపజేసే సులభ మార్గమనీ, లలితా సహస్రనామములతో నిండిన నీవు మా మూఢత్వాన్ని తొలగించి జ్ఞాన దీపికవై వెలుగొందుతావని, నీ తత్వాన్ని మహత్యాన్ని తెలుపుటకు మాఘమాసము వసంత కవికోకిలనై, మామిడి చెట్టు కొమ్మన లలితా కారుణ్య ఫలములు ఆస్వాదిస్తూ మంగళకర రాగాలను ఆలపించే దేవీతత్వ కథలను వినిపించేవాడిగా ఎల్లప్పుడూ పాడెదనని భావించారు. 10 వ శ్లోకంలో **మాతా స్త్వంహి సమస్త లోకజననీ ..భూయాత్పదాలంకృతిః**... శ్లోకంలో....దేవి పాద స్పర్శ మహిమ త్రికాల దోషాలను ప్రక్షాళన చేసి యోగులను,

మునిపుంగవులను విలక్షణమైన ఉన్నత దృష్టితో స్థితిలో ఉంచిన శుభప్రదమైన నీ చరణములను నేను ఆశ్రయించి స్తోత్ర నిమగ్నుడై ఉన్నానని స్తుతి చేశారు. 11వ శ్లోకంలో **త్వత్సేవైక పరాయణా.. నిష్ఫలమ్.** సామాజిక దృక్పథంతో పూర్వజన్మ పాపాలను అవ్యాజ కరుణతో, అమృత వర్షంతో తొలగించమని కోరుతూ సామాజిక దృక్పథాన్ని చూపించారు.. కాళిదాసాది మహాకవులను నీ కరుణచే పునీతుల గావించిన నీ చరణ స్పర్శ మహిమ గొప్పదంటూ కొనియాడారు. నాకు వేదాలు తెలియవు, కవిని కాదు, ధార్మికుడను కాదు కానీ నీ కరుణావర్షంచే నిన్ను స్తుతి చేయగలుగుతున్నానని తన నిరాడంబరతను తెలుపుకున్నారు. ఉపాసన లేదు. నీ దయ వలననే ఇదంతా కటాక్షించిందని కొనియాడారు. వేదాద్యక్షర వాఙ్మయములను నీ పాదాలు సకలైశ్వర్యములను ప్రసాదించు నా మానస పీఠముపై సర్వదా నివసించమని హృదయపూర్వకంగా తల్లిని వేడుకున్నారు.. చివరి పద్యంలో.. ఇదంతా నీకేళీ వినోదము. అనేక కళలుగా అభివృద్ధివై ఈ 16 శ్లోకములలో రూపమై నిలిచిన నీకు వ్మాయ పూజ చేస్తున్నాను. దుష్టులను నిర్మూలించిన నీ వైభవ నాట్య హేలను తలపించే శార్దూల వనక్రీడివై వెలుగొందుచు పూజల అందుకొందువు గాక అని స్తుతి చేశారు. ఫలశ్రుతిలో నామముద్రను ప్రకటిస్తూ వినమ్రంగా సూర్య చంద్రకళలు వెలుగునంతకాలము ప్రశస్తిని పొంది ఈ ప్రపంచ శ్రేయస్సును కలిగించుటకై ఈ స్తోత్రము నిలుచుగాక! అని కోరుకుంటూ అనుష్టుప్ ఛందస్సులో రాశానని సుప్రతిష్టమైనటువంటి శ్రీషోడశీ స్తోత్రమును మంగళకరమైన వాక్యములతో ముగించారు.

16 సంఖ్య గల స్తోత్రమైనా లఘు ప్రమాణికంగా కనపడుతున్నప్పటికీ విస్తృతమైన భక్తిపారవశ్యంతో లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ అనేకమైన అద్భుత సమాసాలతో ఉపమానాలతో శబ్దాలంకారాలతో మృదువైన భావ సమన్వయాలతో మహాద్భుతమైన పదలాలిత్యముతో అమ్మవారిని హృదయపూర్వకంగా స్తుతించిన ఈ స్తోత్రం దేవి ఉపాసన చేసే ప్రతి వ్యక్తికి నిత్యస్తోత్రంగా చదువుకుని అమ్మవారి కృపకు పాత్రులయ్యేటటువంటి గొప్ప స్తుతి మాలిక అని చెప్పవచ్చు..

ఈ స్తోత్రంలో ఆశాసనము అనే పేరిట డాక్టర్ దోర్బల విశ్వనాథ శర్మ గారు **శ్రీమాతృభక్తి సంకల్ప సంసక్త హృత్కాసారము నుండి ప్రభవించిన ప్రసిద్ధ కవనము** ఇది అన్నారు. మధు ద్రాక్ష మధు మధురీనములు అని వీరి శైలిని, భక్తిని ప్రశంసించారు. ఆలోకనము అనే పేరిట డాక్టర్ అవధానం రంగనాథ వాచస్పతి గారు రచన శైలిని తాంత్రిక భావ గాంభీర్యములతో లాలిత్యముతో అర్థగౌరవము తరగని రచనగా అమ్మవారిని స్తుతి చేశారని తెలిపారు..

**అభిప్రాయ నివేదన**

దీనితోపాటు అనేక అష్టకాలు స్తోత్రాలు వ్రాసిన వీరు ధన్యజీవులు. సమసమాజ కవులకు ఆదర్శంగా, ఆసక్తి గల వారికి సాహిత్య సేవలో తమ పాండిత్యమును రుచి చూపించారు. ఇందుకు తార్కాణం వీరిశిష్యులు. వారిని సాహిత్యంలో జాతిరత్నాలుగా తీర్చిదిద్దారు. వారందరూ సమాజంలో ఆధ్యాత్మికభావాలను పెంపొందించడంతో పాటు సాహిత్య రంగంలో వీరి మార్గాన్ని అనుసరిస్తున్నారు, సేవచేస్తున్నారు. వీరికి ప్రత్యక్ష శిష్యులే కాక పరోక్షంగా కూడా వాట్సప్ మాధ్యమంగా శిష్యులు ఉన్నారు. అందులో నేను కూడా ఉండటం నా అదృష్టంగ భావిస్తున్నాను. **'సురసాహితీ సురభి'** అనే సాహిత్య సమూహంలో మహాకవి కాళిదాస విరచిత మేఘసందేశం, రఘువంశం వీరు చెప్పగా విని తరించాము..

తెలుగు మహాసభలు జరిగినప్పుడు **'వాగ్భూషణం'** పుస్తకంలో వారి పద్యాలు చూసాను ..ఆ రోజున వీరి పరిచయం కలిగే అదృష్టం నాకు దక్కింది.

2016 సంవత్సరంలో **'త్రిమాతృకాస్తుతి'** వారి దస్తూరితో చూసాను. ఆ రోజే దానిని ఆలపించి పంపాను. విని మహదానందంగా ఆశీస్సులు పంపారు. ఆ రోజు మొదలు వారి రచనలలో అమ్మవారి స్తుతులను పాడటం, ఎన్నో గొప్పగొప్ప కార్యక్రమాలలో ప్రార్థనా స్తుతి చేయడం జరిగింది. తరచూ వీరి స్తుతులను పాడిన నాకు కూడా అంతో ఇంతో సాహిత్య పరీమళం తాకి కృతకృత్యురాలను ఐనాను..

ఈ విధంగా అత్యద్భుతమైన దేవీ ప్రాశస్త్యాన్ని తెలిపే ఈ శ్రీషోడశీ స్తుతిని సమీక్ష చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.. అవకాశం కల్పించిన పెద్దలకు నా హృదయ పూర్వక ధన్యవాద సుమముల నర్పిస్తున్నాను.

అయాచితం వారు దేహం విడిచినా వాఙ్మయ రూపంలో అశేషకీర్తిని సంపాదించారు.. ముందు తరాల వారికి ఆదర్శంగా నిలిచారు.. ఆ అమ్మవారే దీవెనలిచ్చి వారిచే శ్రీషోడశీ స్తుతిని చేయించుకుందనడం అక్షర సత్యం...

కందము

**పదహారు కళల తల్లికి**
**మృదువుగ స్తుతిమాల వేసి మించిన భక్తిన్**
**సదయత తోడ నటేశ్వరు**
**లెదనిండుగ గొల్చె జగములేలెడు తల్లిన్**

కందము

**అగణితభక్తిని చాటగ**
**నిగమాగమ విధులు దెలిసి నిశ్చలముగ నీ**
**జగములనేలెడు మాతను**
**గగనపు విరితోడ బోల్చి కవనము నిచ్చెన్**


సర్వ మంగళప్రదమైన హృదయంతో అందించిన ఈ స్తుతి చదివితే సర్వం శుభప్రదమని భావిస్తూ ముగిస్తున్నాను.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 (39) హైదరాబాద్ అక్టోబర్ : 2024

# అక్షరునికి నిరతాక్షరార్చన చేసిన అద్వైతి

**డా. కాచాపురం దుర్గాదేవి,** ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. మెదక్. ఫోన్ : 78930 93495



సంపద, ఆరోగ్యం, ఇతర భౌతికసుఖాలు మనిషికి ఎంత అవసరమో ఆధ్యాత్మిక చింతన కూడా అంతే అవసరం. భక్తి భావం శాశ్వతమైన ఆనందాన్ని ఇస్తుంది. పలు సందర్భాలలో మనిషి ఎదురుదెబ్బలు తింటుంటాడు. తాను కోరుకున్న అంశాలను సాధించుకోలేనప్పుడు ఎంతో నిరుత్సాహపడతాడు. జీవితం మీద విరక్తి కలుగుతుంది. నిరాశ నిస్పృహలలో ఏం చేస్తున్నాడో తెలియని స్థితికి చేరుతాడు. తాను కోరుకున్నదే లోకమని అంతకుమించింది లేదనే భావంతో ఆ కోరికల బంధంలో కొట్టుమిట్టాడుతుంటాడు. ఆ బంధాలను తెంచుకోవడం అవసరం. తనకు లభించిన దానితో తృప్తిపడే గుణం అలవర్చుకోవాలి. కోరికలను అనవసరమైనటువంటి ఆశలను వదులుకొని మంచి ఏదో చెడు ఏదో మనిషికి కావలసింది ఏమిటో తెలుసుకుంటే కలిగే ఆనందం గొప్పది. అటువంటి చక్కని మార్గాన్ని ఆధ్యాత్మికత చూపిస్తుంది. ఆ మార్గం ఆదిశంకరుల నుండి మనకు అంది వచ్చిన పరంపర. ఆ కోవకు చెందినవారే శ్రీవిద్యోపాసకులు, ఆధ్యాత్మికవేత్త కూడా అయిన బ్ర.శ్రీ. అయాచితం నటేశ్వర శర్మ గారు. వారి సంస్కృతాంధ్ర సాహితీ వ్యాసాంగంలోని ప్రక్రియలన్నింటిలోనూ సామాజికతతో పాటు ఆధ్యాత్మికతకు అత్యంత ప్రాధాన్యాన్ని ఇచ్చారు.

ఈ జగత్తు సృష్టి స్థితి లయ కారణాలకు మూలమైన ఒక మహాశక్తి శ్రీలలితా పరమేశ్వరి అని అందరూ విశ్వసిస్తారు. ఆ జగన్మాతను అనేక నామాలతో రూపాలతో శ్రీ శంకరాచార్యుల వారు స్తుతిస్తూ అనేక స్తోత్రాలు చెప్పారు. అందులో సౌందర్యలహరి అత్యంత ప్రధానమైనది. ఆదిశంకరులు అద్వైత సిద్ధాంత యోగముతో శివకేశవ శాక్తేయ, గాణపత్య మతాలను సమన్వయపరిచి అన్ని దేవీ దేవతలపై స్తోత్రాలను గానం చేశారు. వారి అపూర్వ సృష్టిలోనిది సౌందర్యలహరి. ఈ సౌందర్యలహరి పై సంస్కృతంలో పిహెచ్.డి. కొరకు పరిశోధన గ్రంథాన్ని రచించి డాక్టరేట్ పట్టా తో పాటు బంగారు పతకాన్ని కూడా పొందినారు. ఈ సంస్కృత సిద్ధాంత గ్రంథాన్ని అయాచితంగారే "సౌందర్యలహరి సౌందర్యము" పేరుతో తెలుగులోకి అనువదించి నారు. ఈ గ్రంథాన్ని షట్చక్రముల సంకేత రూపంగా ఆరు ప్రకరణాలుగా విభజించి, వాటిని తరంగములుగా పేర్కొన్నారు. ప్రథమ తరంగంలో స్తోత్ర సాహిత్య వికాసము, శంకరాచార్యుల జీవిత చరిత్ర, కృతులు సమీక్ష మొదలైనవి ద్వితీయ తరంగంలో నామౌచిత్యము, వృత్యౌచిత్యములు, పాఠ్యభేదములు మొదలైనవి... తృతీయంలో తంత్రము, యోగము, శ్రీవిద్య, మంత్రము, షోడశీవిద్య మొదలైనవి.. చతుర్థ తరంగంలో రసము, అలంకారము, వర్ణనలు, ధ్వని, కవిసమయాలు, కవితాశైలి మొదలైనవి వివరింపబడగా పంచమ తరంగంలో సౌందర్య లహరి పై వచ్చిన వ్యాఖ్యానములను పరిశోధించినారు. షష్ఠతరంగంలో వైదికత, అద్వైతతత్వ ప్రతిఫలము, ఆచారములు, సంప్రదాయములు, సమాజంపై సౌందర్య లహరి ప్రభావము వివరింపబడినాయి. ఈ గ్రంథ పరిచయం కొరకు మాత్రమే నాలుగు వాక్యాలు చెప్పే సాహసం చేసినాను. ఈ పరిశోధనా గ్రంథం పైనే అనేక పరిశోధనలు జరిగే అవకాశం ఉన్నది. ఆధ్యాత్మిక యోగ మంత్ర తంత్ర వర్ణన వైదుష్యాలలో సంచలనాత్మకమైన పరిశోధనా గ్రంథం **"సౌందర్య లహరీ సౌందర్యము".**

వరాహ పురాణాంతర్గతమైన "శ్రీ వేంకటాచల మాహాత్మ్యాన్ని" అనుసరిస్తూ సప్తగిరీశుడికి సప్తశత (700) పద్య పుష్పాలతో చేసిన అర్చనా విశేషమే **"శ్రీ వేంకటేశ్వర విలాసం"** అనే కావ్యం. వరాహపురాణంలోని కథాంశాన్ని మాత్రమే స్వీకరించి అలంకారాది కావ్య విశేషాలను కూర్చిన స్వతంత్ర్య కావ్యం. ఈ కావ్యాన్ని ఏడు ఆశ్వాసాలుగా విభాగం చేసి ఆ ఖండాలకు సప్తగిరుల పేర్లను ఉంచారు. అవి శ్రీశైల ఖండము, శేషశైలఖండము, గరుడాచల ఖండము, వేంకటాద్రి ఖండము, నారాయణాద్రి ఖండము, వృషభాద్రి ఖండము, వృషాద్రి ఖండములు. శౌనకాది మునుల ప్రశ్నలకు సమాధానంగా సూతుడి బోధతో ప్రారంభమై శ్రీ పద్మావతీ వేంకటేశ్వర పరిణయ మహోత్సవ వర్ణనముతో ఈ కావ్యం ముగుస్తుంది. సందర్భోచితంగా మత సిద్ధాంతాలను మంత్ర యోగ శాస్త్రాంశాలను ప్రస్తావించారు. ఈ కావ్యంలో పద చమత్కృతి భావరమణీయత వర్ణనా నైపుణ్యం కలిగిన పద్యాలు అడుగడుగునా కనబడతాయి. ఆశ్వాస ప్రారంభంలో కృతిభర్తను సంబోధిస్తూ కందపద్యం చెప్పడం తెలుగు సంప్రదాయం. ఆశ్వాసాంతంలో వృత్త భేదాన్ని పాటించడం సంస్కృత

సంప్రదాయం. అయితే సంస్కృత కావ్యాలలో ఆశ్వాసమంతా ఒకే వృత్తంలో ఉండి చివరి శ్లోకం మాత్రం వేరే వృత్తంలో ఉంటుంది. తెలుగు కావ్యాల్లో ఆశ్వాసం అంతా అనేక వృత్తాలలో చెప్పి చివరలో కృతిపతిని సంబోధిస్తూ విశేష వృత్తాన్ని కూర్చడం సంప్రదాయంగా కనిపిస్తుంది. అనేక సంస్కృత రచనలు చేసినప్పటికీ శర్మ గారు ఈ కావ్యంలో తెలుగు కావ్య సంప్రదాయాన్ని పాటించారు. సౌందర్యలహరి లక్ష్మీధర వ్యాఖ్య చివరలో లోల్ల లక్ష్మీధరులు తమ వంశ పరంపరను పేర్కొనడమే కాకుండా "వాణీసహచరీకేణ" అని చెప్పుకున్నారు. అలాగే నటేశ్వరశర్మ గారు ఆశ్వాసాంత గద్యాలలో తమ వంశ పరంపరను పేర్కొనడమే కాకుండా అరుణా సహచరీకుడనని తన సహ ధర్మచారిణి పేరును కూడా ప్రస్తావించినారు. సౌందర్య లహరి పై విస్తృత పరిశోధన చేసిన శర్మగారిపై లక్ష్మీధరుల ముద్ర ఉండటం సహజం.

పద్మావతీదేవి తన చెలులతో కలిసి ఉద్యానవన సందర్శనానికి వెళ్లిన సందర్భంలో సుదీర్ఘ సమాసాలతో వనాన్ని అద్భుతంగా వర్ణించారు.

**అంత వసంతకాంత సుమహాస వికాస విలాస భావ సం**
**క్రాంత నవీనరాగ ప్రసరంజిత గుంజద మంద మత్త వి**
**భ్రాంతక చంచరీక వికరాట్కల కూజిత రాజితాచ్ఛ వి**
**శ్రాంత జనోపభోగ్య సుమరాజిత రమ్య వనమ్ము గన్పడన్**
(ఆ.6 - ప.192)

ఈ కావ్యంలో **మింటిరేడు** (ఆ.7-ప.33) **చదలు రేడు** (ఆ.7-ప. 74) వంటి అచ్చ తెలుగు బంధాలు ఆకట్టుకుంటాయి. వకుళా దేవి ఆకాశరాజు భార్యను **"ఆకసరేని యెడంద జాబిలీ"** (ఆ.7-ప.152) అని సంబోధించడం చక్కని తెలుగు సమాసపు కూర్పు.

**మానసహారి నిర్ఝరసమన్వితమై సత నిత్య ముక్త సే**
**వానుగమై విశాల వన వాసితమై బహుయోజనాలయం**
**దూనిన దౌచు శేషు గతినున్న యశేష విశేషియైన క్రీ**
**డా వనశైలమున్ గరుడుడప్పుడు నిల్పెను భూతలమ్మునన్**
(ఆ.1- ప.19)

పై పద్యంలో **"శేషు గతినున్న యశేష విశేషి"** అనే మాటలో అశేష విశేషి అనే పదముల యొక్క కల్పనలో "శేష" శబ్ద పునరావృత్తి విశిష్టాద్వైత సంప్రదాయంలోని "శేష శేషి" భావాన్ని ధ్వనింపజేస్తుంది. శేషుడు అనగా జీవుడు. శేషి అనగా భగవంతుడు. శేషుడు కలవాడు శేషి. అనగా జీవుని తన యందు గలవాడు. శేషునికి శేషికి మధ్యన గల సంబంధము శేష శేషి భావం. ఇది విశిష్టాద్వైతంలోని ఒక సంప్రదాయం.

ధర్మ ప్రబోధము, సద్విషయోపదేశాలు, వివిధ పుణ్య తీర్థాల పవిత్రతలు ఈ కావ్య లక్ష్యంగా ఆవిష్కరించబడ్డాయి. శర్మగారు సంస్కృతాంధ్ర సాహిత్యాలలో విశేష కృషి చేసినప్పటికీ ఈ కావ్యంలో ఎక్కడా తన పాండిత్యాన్ని ప్రకటించాలనే ప్రలోభం లేకుండా సరళమైన రీతిలో సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యే విధంగా నిర్మించడం వారి సంయమనాన్ని చాటుతుంది. ఇది కాళిదాసు వంటి కొద్దిమంది మహాకవులు అనుసరించిన మార్గము. ప్రతి ఘట్టము లోనూ రమణీయ భావుకతా విలాసాలతో కావ్య సౌందర్యం అడుగడుగునా ప్రస్ఫుటమయింది.

కాల ప్రభావాన్ని గురించి చెబుతూ పరమేశ్వరిని కాలస్వరూపిణి గా ప్రతిపాదిస్తూ **చతుష్షష్ట్యుపచారాఢ్యా** అయిన పరమేశ్వరి సేవా రూపంగా 64 పద్యాలలో **"సమయ విలాసిని"** కావ్యం రాయబడింది. పరమేశ్వరి 64 కోట్ల యోగినీగణంతో సేవింపబడటం కూడా కవి ఈ పద్య సంఖ్యను ఎన్నుకోవడానికి కారణంగా సూచిస్తారు. మూలాధార చక్రంలో పరమేశ్వరి సమయ అను పేరుతో ఉంటుందని పరమేశ్వరుడు నవరస మహాతాండవ నటుడై ఉంటాడని వీరిద్దరి సమన్వయమే సమయమని -

**శ్లో॥ తవాధారేమూలే సహసమయయా....** (సౌందర్య లహరి శ్లో:41) లో శంకర భగవత్పాదులు వర్ణించారు. లలితా సహస్ర నామాలలోని **సమయా సమయాంతస్థా** అనే నామాలలోని అంతరార్థం కాలం లేదా సమయం పరమేశ్వరి స్వరూపమని తెలుపు తున్నది. సమయం అనగా కాలము "సం" అనగా బాగుగా "అయ" అనగా లీనమగునది అని అర్థము. కాబట్టి సమయ శబ్దము కాల పర్యాయ వాచకం. ఈ అర్థాలను పురస్కరించుకొని పరమేశ్వరికి కాలానికి గల అభిన్నత్వాన్ని ప్రతిపాదిస్తూ పరమేశ్వరిని కాలస్వరూపిణిగా నిరూపిస్తూ కాల ప్రభావాన్ని గూర్చి వర్ణిస్తూ అయాచితం నటేశ్వర శర్మ గారు **"సమయ విలాసిని"** కావ్యాన్ని రచించారు.

**ఆద్యంతమ్ములు లేని కాలఝరిలోనావిష్కృత ప్రాణమౌ**
**వేద్యంబైన చరాచర ప్రకృతిలో వీక్షింపనౌ బ్రహ్మమున్...**
(పద్యం:17)

పై పాదాల్లో కాలము ఆదిఅంతాలు లేనిదని సుస్పష్టం చేస్తూ ఈ చరాచర ప్రకృతి అంతా కాలఝరిలో ఆవిష్కృతమైనదేనని అందులో బ్రహ్మస్వరూపాన్ని దర్శించుకోవాలని అంటారు. ఈ సందర్భంలో ప్రాణులకు ప్రకృతికీ బ్రహ్మకూ అభేదాన్ని చూపడం అద్వైత తత్వాన్ని ఆవిష్కరిస్తుంది.

**సమయాచారము నెవ్వడీజగతిలో స్వాంతమ్ము లోనుంచుచున్**
**విమలాత్మున్ చరియించువాడు శుభముల్ వీక్షించునెల్లప్పుడున్**
**కమలాప్తున్ శశిబింబమున్ గొలుచుచున్ కామ్యమ్ము లీడేర హృ**
**త్కమలమ్మర్పణ జేసికొన్న బ్రతుకే క్రమప్రభన్ వెల్గెడిన్**

పై పద్యంలో కవి ఉపాసనా సంప్రదాయానికి చెందిన సమయ మార్గాన్ని ఆదిత్యోపాసనను చంద్రబింబంలో పరమేశ్వరిని భావించి అర్చించడాన్ని సూచిస్తూ సమయాన్ని సరి అయిన విధంగా ఆచరిస్తే శుభాలు కలుగుతాయని బ్రతుకు ప్రభలతో వెలుగుతుందని

వర్ణించారు. ఆది అంతము లేనటువంటి కాలం యొక్క విలువ, కాల మహిమ, కాల ప్రభావం, సృష్టి అంతా సమయంపై ఎలా ఆధారపడి ఉందో కాలాన్ని ఎవరూ ఎలా అతిక్రమించలేరో, కాలం ప్రకృతి నెలా తన ఆధీనంలో బందీ చేసుకుంటుందో, ఆ అంశాలను పురాణేతిహాసాలలోని కథాంశాలను స్పృశిస్తూ వర్ణనాచాతుర్యంతో రచించిన కావ్యమిది.

కేవలం ధనకనకాదిరూపమైన సంపద మాత్రమే సంపద కాదని పంచభూతాలు, మానవునికి గల జ్ఞానేంద్రియ శక్తులు, కర్మేంద్రియ సామర్థ్యం, ఆత్మ, యథేచ్ఛా సంచారం చేసే మనసు అన్ని ధనమేనని ఈ సమస్తము లక్ష్మీ స్వరూపమేనని ప్రతిపాదిస్తూ అయాచితం వారు రచించిన కావ్యం **"లక్ష్మీ విలాసం".**

**కృష్ణబిల సవర్ణ భృంగరాడ్వర్ణ సంకాశ సద్రుచిరాలకా! నమోస్తు!**

ఈ పాదంలో అమ్మవారి ముంగురుల రంగుకు గండు తుమ్మెదల రంగు ఉపమానం. ఈ తుమ్మెదల రంగుకు కృష్ణబిలం (పరిశోధకులు విశ్వాంతరాళంలో గుర్తించిన శూన్య ప్రదేశం) ఉపమానం. ఈ విధంగా వర్ణ్య వస్తువుకు ఉపమానంగా చెప్పిన దానికి మరొక ఉప మానాన్ని చెప్పడం కవి యొక్క ఉక్తి వైచిత్రిని నిరూపిస్తుంది.

మానవ జీవనంలోని వివిధ కర్తవ్యాలు, మనసులో పుట్టే కోరికలు, సత్ప్రవర్తనకు సంబంధించిన సంకల్పాలు మొదలైన జీవిత స్వరూపం అంతా ఈ కావ్యంలో వర్ణించబడింది. లక్ష్మీదేవి వర్ణన, స్తుతి ప్రధానంగా సీసమాలికలు ఎత్తుగీతులలో ఈ కావ్యం రచింపబడింది. లక్ష్మీదేవి మాటలుగా కవి మానవ జీవితం ఉత్తమ మార్గంలో ఎలా నడవాలో పేర్కొంటారు. పరమేశ్వరి కవిని ఆశీర్వదించి అంతర్ధానం కావడంతో అతడు కళ్ళు తెరిచి చూసేవరకు లక్ష్మీదేవి విగ్రహం కనిపించిందని తెలుపడంతో ఈ కావ్యం ముగుస్తుంది.

అయాచితం వారి మరో ప్రత్యేక కావ్యం **"సిరినోము"** శ్రీవిల్లిపుత్తూరులో శ్రీకృష్ణుని భక్తుడైన విష్ణుచిత్తునికి తులసీ వృక్షం కింద గోదాదేవి లభించినది. గోదాదేవికే అండాళు అని మరొకపేరు. ఈమె పెరిగి పెద్దదై కాత్యాయనీ వ్రతం చేసి గోపికలు కృష్ణుని పొందినారని విని మధుర భక్తి భావనలతో శ్రీవిల్లిపుత్తూరునే రేపల్లె గాను, అక్కడి కన్యలని గోపికలుగాను, దేవాలయమునే నందగోకుల గృహముగాను భావించి శ్రీరంగనాథుని కృష్ణుడిగా ధ్యానించి శ్రీవ్రతమును ఆచరిస్తూ రోజునకొక పాశురము చొప్పున వ్రతము పూర్తి అగుసరికి 30 పాశురములు చెప్పినది. ఈ 30 పాశురములు కలిసి తిరుప్పావై ప్రబంధంగా ఏర్పడి ప్రసిద్ధి చెందింది. ఆ తరువాత గోదాదేవి శ్రీరంగనాథుని వివాహమాడి ఆ స్వామిలో లీనమైనది. ఈ 30 పాశురములు గల తిరుప్పావై ప్రబంధమును ఒక్కో పాశరమునకు ఒక్కో వృత్తమును రచించి "సిరినోము" గా శర్మగారు అనువదించారు. "సిరినోము" అలంకారిక ప్రయోగములతో తెలుగు పదబంధములను విరివిగా ఉపయోగిస్తూ మలచబడిన సహజ




సుందర కావ్యం. చాలాచోట్ల మూలం నిమిత్తమాత్రమే. స్వతంత్రించిన భావమే ఎక్కువగా కనిపిస్తున్నది. వామనావతార రామావతార ప్రసక్తి శకటాసుర వత్సాసురులను వెలగ చెట్టు రూపమునున్న రాక్షసునిపై విసిరి వేయుట, గోవర్ధన పర్వతమును గొడుగు వలె ఎత్తుట, అను లీలల ప్రస్తావన సంగ్రహంగా కూర్చబడింది.

శ్రీఆండాళ్ అనబడు గోదాదేవి వృత్తాంతమే ఆముక్త మాల్యద. శర్మ గారి మరొక గ్రంథం **"ఆముక్తమాల్యద పరిశీలనము".** తెలుగు పంచ కావ్యాలలో ఒకటిగా ప్రశస్తిగాంచినది రాయలవారి **"ఆముక్తమాల్యద".** సంస్కృత భాషలో శ్రీమాన్ అమరవాది వెంకట నరసింహాచార్యులవారు రచించిన చంపూకావ్యం **"ఆముక్త మాల్యదమ్".** ఈ రెండు ఆంధ్ర సంస్కృత కావ్యాలలోని ఇతివృత్తాలను శర్మగారు తులనాత్మకంగా విశ్లేషించినారు. **"ఆముక్తమాల్యద పరిశీలనము"** ఎం.ఫిల్. కొరకు చేసిన సమగ్ర పరిశోధన వ్యాసమైనప్పటికీ నాలుగు ప్రకరణాలు కలిగిన ఈ గ్రంథంలో రెండవ ప్రకరణంలో గోదాదేవి ఇతివృత్తమంతా చెప్పబడినందువల్ల, నాలుగవదగు తాత్విక ప్రకరణములో విశేషమైన తింగలై శాఖా సంప్రదాయము సంగ్రహంగాను, విశిష్టాద్వైత తత్వము, తత్వ వివేచనము, శ్రీవైష్ణవ సంప్రదాయమున గోదాదేవి స్థానము విస్తృతంగా చర్చించబడి వివరించబడి ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించు కున్నది.

సృష్టి సమస్తము సూర్యుడి పైనే ఆధారపడి ఉన్నది ప్రత్యక్ష దైవమైన సూర్యుడిని పూజించడం జీవన విధానంలో ఒకటి ప్రత్యక్ష దైవమైన సూర్యోపాసనలో భాగంగా శర్మగారు **"సూర్య స్తుతి"** (పద్యమాలిక) లోకబాంధవ పూజగా వెలువరించారు. దినకరుడి వైభవం లావణ్యం సౌందర్యం శక్తి ప్రభావాలను తెలిపే ఆరాధన భావాన్ని పెంచే ఆకర్షణీయమైన 65 శీర్షికలలో ముక్తకాలు ఖండికలు గీత మాలికలు గల ఈ స్తుతిని వెలువరించారు శర్మ గారు.

**శ్రీకరమై సమస్త గుణశీకరమై** .... వంటి ఏక సమాసంలో చెప్పిన ప్రౌఢమైన వృత్తాలు.

**ఎర్రమందారమా? అది ఎదుట నిలిచె**
**పచ్చ చేమంతియా? అది వాసినిలిచె**
**దేవకాంచనమా? అది దీప్తి వెలిగె**
**కాదు కాదది తూరుపు గన్నపువ్వు!**

వంటి సరళ మనోహరమైన పద్యాలు విభిన్నశైలులలో భావనలతో సూర్యకిరణాలలోని భిన్నత్వాన్ని ప్రతిబింబిస్తాయి.

త్రిమూర్త్యాత్మక భాస్కర ప్రశస్తి లో మూడు వృత్తాలలో
**నీ వేచర విశ్వసృష్టి నిడు వేధవు ప్రాచ్యదిశా కళానిధీ!**
**నీవేపర స్థితిన్ నిలుపు విష్ణువు మధ్యమ లోక బాంధవా!**
**కాలభాసుర స్వాశయ నిత్య రాజిత శివ ప్రతిరూప మనోజ్ఞ భానుయా!** అంటూ బ్రహ్మ విష్ణు పరమేశ్వర రూప స్వరూపంగా ప్రభాకరుడిని స్తుతిస్తారు.

ప్రతి పద్యము ఒక భానుబింబమై కిరణతేజము హృదయంలో విస్తరిస్తున్న భావనలో భక్తితో ఈ స్తుతికి ప్రణమిల్లుతాము.

మేడ్చల్ పట్టణానికి పొలిమేరలో ఉన్న గుట్టపై వెలసిన ప్రాచీన రామలింగేశ్వరుణ్ణి స్తుతిస్తూ **"శ్రీమన్మేడిచలేశ! భక్త వరదా! శ్రీరామలింగేశ్వరా!"** అనే మకుటంతో శార్దూల వృత్తంలో శర్మగారు రచించిన పద్య స్తుతి **"శ్రీరామలింగేశ్వర హృదయము".** ఇందులో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ చరిత్ర, మహిమలు, ఆలయ ప్రాంగణంలోని అర్చామూర్తుల రూపాలను వర్ణించారు. రామలింగేశ్వరునికి ఒక్కో పద్యంలో ఒక్కో ఉపచారము ద్వారా షోడశోపచారాలను అందించారు. ధ్యానం, ఆసనం, పాద్యం, అర్ఘ్యమ్, ఆచమనం, పంచామృతాలైన క్షీర దధి ఘృతం తేనె శర్కరలతో అభిషేకం, చందన, స్నానం, గంగాజల అభిషేకం, వస్త్రం, గంధం, ధూపం, అక్షతలు, పుష్పం, బిల్వదళం, దీపం, నైవేద్యం, ఆచమనం తాంబూలం, నృత్యం, దక్షిణ హారతి, ప్రదక్షిణ, మంత్రపుష్పములు రకరకాలుగా ఒక్క ఉపచారం ఒక్కో పద్యంలో 64 పద్యాలలో రచింపబడి చతుష్షష్టి ఉపచారాలకు ప్రతీకగా కనిపిస్తాయి. కింది పద్యంలో 16వ శతాబ్ద ప్రారంభ కాలంలో రాజలింగుడు అనే ఆయన ఈ దేవాలయాన్ని నిర్మించి శ్రీరామలింగేశ్వరుని స్థాపించినాడని తెలిపినారు.

**ధీమంతుండగు ధాత్రి కాన్వయజుడౌ దేవాలయ స్థాపకుం**
**డామాన్యుండగు రాజలింగుడల నీయర్చా కృతిన్ నిల్పెనా**
**రామమ్మున్ వెలయించి షోడశశక ప్రారంభ కాలమ్ములో**

మకుటం ఉండి ఒకే వృత్తంలో రాయబడి శతక లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ ఈ స్తుతిని శతకంగా భావించలేము. 64 పద్యాలను చతుష్షష్టి ఉపచారాలకు ప్రతీకగా శర్మగారు భావించినారనేది స్పష్టము.

అయాచితం వారి స్వగ్రామమైన రామారెడ్డిలో ప్రాచీనమైన శ్రీ పార్వతీరాజరాజేశ్వరుల దేవాలయం ఉంది. ఈ ఆలయానికి వీరి కుటుంబీకులే అనువంశిక అర్చకులుగా ఉన్నారు. ఈ ఆలయంలోని ప్రధాన దేవతామూర్తుల సన్నిధిలో కొలువై ఉన్న శ్రీ గణేశ్వర స్వామికి అంకితంగా **"గణేశా!"** అనే మకుటంతో కందపద్యాలలో **"గణేశ శతకం"** ను రచించినారు. ఈ శతకంలో తంత్ర ప్రసిద్ధమైన చింతామణి గణపతి మంత్రాన్ని, గణపతి మంత్రరూపాలలో మరొకటి అయిన క్షిప్రప్రసాద గణపతిని ప్రస్తావించినారు. వినాయక మూర్తుల లోని అనేక భేదాలను పేర్కొంటూ వర్ణనలతో పాటు మహిమాన్విత మైన కథాంశాలను కూడా పొందుపరిచినారు. ఈ రచన కవి గారికి దైవిక అంశాలపై గల అవగాహనను, పరిశీలనాత్మక, పరిశోధనాత్మక దృష్టిని విశద పరుస్తున్నాయి.

వీరి మరో ఆధ్యాత్మిక రచన **"శ్రీ భీమేశ్వర క్షేత్ర వైభవం"** ఈ గ్రంథంలో 3 భాగాలున్నాయి. 1.భీమేశ్వర క్షేత్ర పరిచయం 2. శ్రీ భీమేశ్వర శతకం 3. ఆలయవర్ణ చిత్రాలు. శ్రీ భీమేశ్వర శతకం ఈశ్వర మహిమలను శివపూజా ఫలాలను పంచాక్షరీ మంత్ర విశేషాలను మొదలైన వాటిని ప్రస్తావిస్తూ **"భక్త పాలక! భీమేశ పార్వతీశ !"** అనే మకుటంతో 108 తేటగీతి పద్యాలలో వ్రాయబడిన శతకమిది.

**నీవు నావాడవని పల్కి నిక్కు నొకడు**
**కాదు నా వాడనునొకడు వాదులాడి**
**నీవె నేనను వాడేడి? నిశ్చయముగ** (ప.4)
**నిన్ను వెతుకుచు దిరుగును నింగినొకడు**
**నిన్ను గోరుచుపోవును నేలకొకడు**
**కాని తనలోన నున్ననిన్ కనగలేడు** (ప.13)

పై పద్యాలలో త్వమేవాహం అనే అద్వైత భావాన్ని నీవే నేను నేనే నీవు అనే తేలిక పదాలలో వివరించినారు. సరళమైన శైలిలో శివతత్వాన్ని సమగ్రంగా చిత్రించిన ఈ శతకంలో శర్మ గారి భక్తి పారమ్యత తాదాత్మ్యకతలు ప్రతిఫలిస్తున్నాయి.

**"రాజేశ్వరా!"** అనే మకుటంతో శార్దూలవృత్తంలో రచించిన మరో భక్తి శతకం **"శ్రీరాజరాజేశ్వర శతకం".** కవి గారి స్వగ్రామంలో వీరి అనువంశిక అర్చకత్వంలో ఉన్న శ్రీరాజరాజేశ్వర స్వామికి అంకితంగా శతకం రాయబడింది. ఇందులో శివతత్వంతో పాటు ఆలయంలోని ఉత్సవాలు సేవలు వేదములు స్మృతులు శాస్త్రాలు పురాణాలు ద్వాదశ జ్యోతిర్లింగాలు పంచభూతలింగాలు అష్టమూర్తులు మొదలైన వాటిని రాజేశ్వరునికి అన్వయించినారు.

**నీ పార్శ్వమ్మున రామచంద్రుడయి త్వన్నిష్ఠాంశ వెల్గొందగా**
**నీ పారమ్య మెరుంగనేరక బుధుల్ నీమూర్తి భేదమ్ములో**
**చూపున్ నిల్పుచు శైవ వైష్ణవులనన్ చోద్యమ్ము! నీ మాయయే**
**వ్యాపించున్ వివిధవతారముల విశ్వమ్మందు రాజేశ్వరా!** (ప. 39)

పై పద్యంలో శైవ వైష్ణవ అభేదాన్ని చూపుతూ రాజేశ్వరుడే విశ్వంలో వివిధవతారములలో వ్యాపించి ఉన్నాడని వివరించారు.

**నాదేహమ్మున నున్న చేతనకు నీనాట్యమ్ములే హేతువుల్**
**నాదోపాసన జేయు వేళల భవన్నామోక్తులే శ్వాసముల్**
**వేదోచ్చారణ మందు కంఠమున త్వద్బీజాక్షరమ్ముల్ రుతుల్**
**నీదివ్య ప్రభ నా శరీరకళయై నిల్వంగ రాజేశ్వరా!** (ప.58)

అంటూ తనలో చైతన్యానికి ఆ పరమేశ్వరుడే హేతువుగా పేర్కొన్నారు. శివార్చనలలో అర్చకుడు సర్వాంగీణంగా తనలో పరమేశ్వరుని ఆవాహన చేసుకునే సంప్రదాయం ఈ పద్యంలో కనిపిస్తుంది. సర్వ క్షేత్రాలలోని లింగ స్వరూపాలు తమ స్వగ్రామంలోని రాజేశ్వరుడుగానే శర్మగారు భావిస్తారు. రాజేశ్వరుడిపై కవికి గల భక్తి ఆత్మీయతలు ప్రతిపద్యంలో తాదాత్మ్యకంగా ప్రతిఫలిస్తాయి.

సులభ వ్యావహారిక వచన శైలిలో అక్కడక్కడా పోతన గారి రమణీయ పద్యాల్ని అనుసంధానం చేస్తూ నటేశ్వరశర్మ గారు రచించిన 15 భాగవత ఉపాఖ్యానాల కథల సంపుటి **"భాగవత కథామృతం".** మానవ జీవన పరమార్థాన్ని తెలిపే ఈ కథలు 1995 లో ఆకాశవాణి నిజామాబాద్ కేంద్రంలో ప్రసంగ రూపంలో ప్రసారం అయ్యాయి. భగవత్పారమ్యాన్ని మహిమలను వర్ణించే పురంజనోపాఖ్యానం, ధ్రువోపాఖ్యానం, అంబరీషోపాఖ్యానం మొదలైన కథలన్నీ ఆబాల గోపాలాన్ని పండిత పామరులను అలరించేవిగా ఉన్నాయి.

వీరు రచించిన ముద్రిత పరిశోధన వ్యాసము **"పురుషార్థ వివేచనము"** ఇందులో ధర్మము అను మాటకు స్మృతులలోను పురాణాలలోనూ ఉన్నవి ఋషులు చెప్పినవి అయిన నిర్వచనాలు పొందుపరచబడినాయి. అలాగే ధర్మార్థ కామ మోక్షాలు, పురుషార్థ ప్రయోజనములు, యోగ త్రయము, జ్ఞానము, భక్తి భేదములు మొదలైన అంశాలు సప్రామాణికంగా తెలుపబడినాయి.

మరొక పరిశోధనా వ్యాసము **"లక్ష్మీధర వ్యాఖ్యాన వైభవము".** సౌందర్య లహరిపై వచ్చిన వ్యాఖ్యలలో లక్ష్మీధర వ్యాఖ్య ఉన్నతమైనది. సంస్కృతంలో అందులో ఉన్న కొన్ని అంశాలను తెలుగులో అందించిన వ్యాసమిది.

తెలుగులోనే కాక సంస్కృతంలోనూ వ్యాకరణ శిరోమణి అయాచితం నటేశ్వర శర్మ గారు ఆధ్యాత్మిక రచనలు అధికంగానే చేసినారు.

పరావాక్కు పశ్యంతీ మధ్యమా వైఖరి రూపముల నందును **"గుహాత్రీణి నిహితా నేంగయంతి తురీయం వాచో మనుష్యా వదంతి"** అని శ్రుతి. చతుర్విధ వాక్కులలో మొదటి మూడు అనగా పరా పశ్యంతీ మధ్యమా వాక్కులు గుహలోనుండును. వాక్కు యొక్క చతుర్థ రూపము (వైఖరి)ని మనుష్యులు పలికెదరు అని చెప్పుచున్నది. ఆ వైఖరి యొక్క ప్రథమావతారము వర్ణమాల. వర్ణమాలకు మాతృక




అని పేరు. అన్ని మంత్రములు అన్ని వాక్యములు వేదాది సమస్త వాఙ్మయము ఏర్పడినది వర్ణమాల నుండియే. వర్ణమాల స్వయంగా కూడా మంత్ర రూపమే అని పెద్దలు అంటారు. సమస్త జగము వర్ణముల నుండే జనించినదని తాంత్రికుల సిద్ధాంతం. మీమాంసకులు కూడా బ్రహ్మ వేద శబ్దముల నుండే జగమును నిర్మించినాడని చెప్తారు. వర్ణములను వరుస క్రమంలో ఒక్కో శ్లోకానికి ప్రారంభంలో ఒక్కొక్క వర్ణాన్ని ఉంచుతూ స్తోత్రాన్ని రాయడం శ్రీశంకరాచార్యులు ప్రారంభించారు. ఆ పద్ధతిలోనే అయాచితం నటేశ్వర శర్మ గారు **"శ్రీ మాతృకా వర్ణమాలికా"** అనే స్తోత్ర గ్రంథాన్ని **"శ్రీశారద అష్టోత్తర శతనామ స్తోత్రమ్"** ను రచించారు.

**"శ్రీ మాతృకావర్ణమాలికా"** లో శర్మగారు ఇలా చెప్పినారు. పంచదశీ విద్యాత్మకాక్షర సమామ్నాయమే ఈ "శ్రీ మాతృకావర్ణ మాలిక". ఇది నా కృతులలో పంచదశి (15వది). ఇది యాదృచ్ఛిక మనుట కంటే పంచదశీ మంత్రాత్మికయగు పరమేశ్వరి యొక్క సంకల్ప ఫలమనుటయే భావ్యము." పంచదశి అనునది శ్రీవిద్య ఉపాసనకు సంబంధించిన ఒక మహా మంత్రము. ఈ మంత్రోపాసన వల్లనే శ్రీమాతను స్తుతించే ఈ స్తోత్రం రచింపబడిందని కవి తెలిపినారు. ఈ విషయాన్ని కింది శ్లోకం బలపరుస్తుంది.

**శ్లో. పంచాశత్పీటేశీం**
**పంచదశీ దివ్య మంత్ర భావ్యాత్మామ్ ।**
**పంచప్రేతాసీనాం**
**పంచేషూదిత మనుం ప్రపద్యేత్వామ్॥** (ప.37)

కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వెలసిన శ్రీశారదా దేవిని స్తుతిస్తూ రచించిన స్తోత్రమే **"కామరాజపురం శారదా శతనామ స్తోత్రం"** ఈ స్తుతి 108 దివ్య నామాలు శ్లోక రూపంలోనూ నామావళి రూపంలోనూ మాతృకావర్ణ క్రమంలో కూర్చబడింది.

వీరు సంస్కృతంలో రచించిన భక్తి శతకాలు **"శ్రీలలితాంబికా శతకమ్" "ప్రభాకర శతకమ్".**

బహుధాన్యనామ సంవత్సర ఆశ్వయుజ మాసంలో శర్మ గారి స్వగృహంలో జరిగిన శ్రీ లలితా శరన్నవరాత్ర్యుత్సవములను పురస్కరించుకొని "శ్రీ లలితాంబికా శతకమ్" ను రచించినారు.

**శ్లో॥ అలక్ష్యార్థ జగద్రూపాం సులక్ష్య బ్రహ్మ రూపిణీమ్**
**సలక్షణ కృతి ప్రాప్యామ్ భావయే లలితామ్బికామ్॥**

లక్ష్యార్థం కాని జగత్తు యొక్క స్వరూపము, లక్ష్యార్థమగు పర బ్రహ్మ యొక్క స్వరూపము, లక్షణములతో అలరారు కృతులచే పొందదగినదియునగు లలితాంబికను భావింతును అని అంటారు.

భారతీయ సంస్కృతిలో భాగమైన సూర్యోపాసనను ప్రోత్సహించే విధంగా సూర్యుని ఉజ్వలరూపాన్ని వర్ణిస్తూ విశిష్టతను తెలియజేస్తూ "ప్రభాకర శతకమ్" రచింపబడింది.


క్షేత్ర వైభవ సహితంగా కూర్చబడిన **"శ్రీ కాలభైరవ సుప్రభాతం", "కాపర్తి వెంకటపతి సుప్రభాతం", "కొత్తకోట శ్రీ కోదండరామ సుప్రభాతం"** ఆయా దేవాలయాలలో ఉత్సవాల సందర్భాలలోనూ ప్రతినిత్యము అర్చకులచే భక్తులచే పాడబడి భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తుతున్నాయి. ప్రత్యేకంగా **"శ్రీ కోదండరామ సుప్రభాతం"** కృతిలో సుప్రభాతంతో పాటుగా స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం తాత్పర్య సహితంగా రచించినారు. వనపర్తి జిల్లా కొత్తకోటలోని దేవాలయ చరిత్ర కూడా చేర్చబడింది.

కామేశ్వరీ రూపంలో ఉన్న అమ్మవారి హస్తాలలోని ఆయుధాలైన పంచశరముల గూర్చి అమ్మవారి తత్వాన్ని బోధించిన కృతి **"పంచశరీయం".** 16 శ్లోకాలలో అమ్మవారిని స్తుతించిన కృతి **"శ్రీషోడశి".** ఈ వ్యాసంలో ప్రస్తావించిన గ్రంథాలే కాకుండా వీరివి అసంఖ్యాకమైన అముద్రిత రచనలు ఇంకా భక్తులకు పాఠకులకు చేరాల్సి ఉంది.

వీరు శ్రీవిద్యోపాసకులై శ్రీవేంకటేశ్వర స్వామిని కూడా హృదయంలో నిలుపుకొని ద్వైతాద్వైత విశిష్టాద్వైత సిద్ధాంత భేదాలను పట్టించుకొనని వారు. రచనలలో ఎక్కడా పిడివాదం చూపించని ఆత్మగత సంస్కారం ద్యోతకమై నిజమైన అద్వైతిగా గోచరిస్తారు. ద్విజోత్తములు త్రికాల సంధ్యలను ఆచరిస్తారంటారు. ప్రతిదినము త్రికాలాలలోనూ త్రికరణ శుద్ధిగా అక్షరుడికి అక్షరార్చన సలిపిన అద్వితీయ జీవనం వ్యాకరణ శిరోమణి మహోపాధ్యాయ అయాచితం నటేశ్వర శర్మ గారిది.

# నటేశ్వరునకు నమస్సుమం

## రాధశ్రీ




సిరినోమును తిలకించగ
సిరితల్లికి ప్రాణమైన చిన్మయముఖుడౌ
వరగుణుడు ప్రతిపదమ్మున
మురళీ రవమగుచు నిలచి మోదము గూర్చెన్.

ముప్పది రెండు సుమమ్ములు
గుప్పించు సువాసనలకు 'గోదా' యై మీ
ముప్పది ఏడవ గ్రంథము
ముప్పేటగ చదువరులకు ముదమొనరించెన్.

రావణు జంపిన రాముని
భావనమున నిలుపుకొనుచు పరవశమున నా
ఆవుల మందను గాచెడి
దేవుని స్తుతియించినట్టి తీరును గొలుతున్.

యమునా తటవాసుని నా
మములను కీర్తించి హృదయ మందారము నా
రమణీయుని శుంభత్పా
దములకు నర్పించిన తమ తత్వము తెలిసెన్.

గోదాంబ "తిరుప్పావు"ను
తాదాత్మ్యము చేయగలుగు తమదౌ శైలిన్
శ్రీదంబగు తెనుగున కను
వాదము నొనరించినారు వందన మిదియే.

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 (45) హైదరాబాద్ అక్టోబర్ : 2024

# సౌందర్య లహరీ సౌందర్య దర్శనం

**డా. వీపూరి వేంకటేశ్వర్లు,** తెలుగు ఉపాధ్యాయులు, కర్నూలు. ఫోన్ : 988 55 85 770




**"సౌందర్యలహరీ సౌందర్యము"** అనే పరిశోధనాగ్రంథం 1994లో ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత విభాగంలో, ఆనాటి సంస్కృత శాఖాచార్య ఆచార్య కప్పగంతుల కమలగారి పర్యవేక్షణలో సాగి పిహెచ్.డి. (డాక్టరేటు) పట్టాను స్వర్ణ పతకాన్ని పొందిన సిద్ధాంత గ్రంథం. దీన్ని క్రోధి ఆషాఢ శుద్ధ ఏకాదశి బుధవారం (17.6.2024) నాడు కౌముదీ ప్రచురణలు - హైదరాబాదు (స్వీయ ప్రచురణ) వారు ప్రచురించారు. దర్శనమ్ సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ గారు గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఇటీవలే నిర్వహించారు. డాక్టర్ అనంతలక్ష్మిగారు ఈ గ్రంథాన్ని సమీక్షించారు.

ఇక ఈ గ్రంథంలోని అధ్యాయాలకు తరంగము అనే పేరును పెట్టారు. లహరి అంటే ప్రవాహం కదా! అందుకే ఇలా అధ్యాయానికి తరంగము అని సూచించారేమో!. ఇందులో ఆరు తరంగాలున్నాయి. చివరలో పరిశిష్టము అనే ఒక అనుబంధం ఉంది.

ఈ గ్రంథాన్ని డా॥ అయాచితంగారు తన తల్లితండ్రులైన జయలక్ష్మీదేవి, అనంతరాజశర్మల దివ్య స్మృతికి అంకితమిచ్చారు. అంతేకాదు 16 సంస్కృత శ్లోకాలతో మాతా పితృస్తుతి కూడా చేసినారు.




**'ప్రథమతరంగం'**లో 1. ప్రాచీనకాలం నుండి స్తోత్రసాహిత్య వికాసాన్ని సమీక్షించారు. 2. స్తోత్ర సాహిత్యంలో సౌందర్యలహరికి గల స్థానాన్ని విచారించారు. 3. సౌందర్యలహరీ కర్తృత్వ విషయాన్ని వివిధ వాద ప్రతివాదపూర్వకంగా విచారించారు. 4. కర్తృత్వ విషయంలో ప్రామాణికమైన అంశాలు లభించకపోవడం వల్ల సంప్రదాయాన్ని లోకాన్ని అనుసరించి శంకరాచార్య కర్తృత్వమనే భావనతో శంకరాచార్య జీవిత చరిత్రను 5. శంకరాచార్యుల కృతుల సమీక్షను 6. వారి కాలనిర్ణయాన్ని చర్చించారు. శంకరుల జననం క్రీ.శ.4-5 శతాబ్దాల నడుమ జరిగి ఉంటుందని ఊహించారు.

**ద్వితీయ తరంగము**లో సౌందర్యలహరీ స్తోత్రం యొక్క నామం విషయంలోని, కవిచేత స్వీకరించబడిన శిఖరిణీ వృత్త విషయంలోని ఔచిత్యాన్ని విచారించారు.

2. కొన్ని ప్రతులలో సమానీతః పద్భ్యాం (101), సముద్భూత స్థూల (102), నిధే ! నిత్య 'స్మరే ! (103) అనే మూడు శ్లోకాలు అదనంగా కనిపించే శ్లోక సంఖ్యా విషయాన్ని విచారించి, ఈ మూడు శ్లోకాలు ప్రక్షిప్తాలని శంకించారు.

3. బహుజనసమ్మతిని బట్టి తొలి 41 శ్లోకాలు ఆనందలహరి అనే విభాగముగాను, తక్కిన 59 శ్లోకాలు సౌందర్యలహరి విభాగము గాను, సౌందర్యలహరిలో చేరిన అధిక శ్లోకాలు మూడింటిని ప్రక్షిప్తంగా భావించి, సౌందర్య విభాగం చేశారు.



4. విస్తృత ప్రచారంలో ఉన్న లేఖక పాఠక ప్రవాచకాదుల వల్ల, తత్తద్గురు సంప్రదాయ భేదాల వల్ల వచ్చిన పెక్కు పాఠభేదాలను చాలా విపులంగా చర్చించి, చివరికి లక్ష్మీధరులు పేర్కొన్న పాఠాలను ప్రధానంగా స్వీకరించారు.

**"తృతీయ తరంగము'**లో తంత్రం యొక్క సమగ్ర వివరణ, సమయాచారం -కౌలాచారం, సమయ కౌల సంప్రదాయ భేదాల్ని కూలంకషంగా చర్చించారు.

2. సౌందర్యలహరిలోని తంత్రాన్ని వివరించారు. పరమేశ్వరుడు ఈ లోకాన్ని మోహపరచడానికి 64 తంత్రాలను లోకానికి అందించారు. ఆ తర్వాత పరమేశ్వరి కోరికపై

65వ తంత్రమైన శ్రీ విద్యాతంత్రాన్ని లోకానికి ప్రసాదించాడని వాటి పేర్లను కూడా ఉటంకించారు. 3. మానవశరీరంలోని ధాతుసప్తకానికి షట్చక్ర సహస్రారాలతో సంబంధముందని యోగాన్ని చర్చించారు. 4. తంత్రయోగ సమన్వయం చేశారు. 5. సమయాచారం వేదమూలకత్వం అని నిరూపించారు. 6. శ్రీవిద్యా మూలబీజాన్ని 7. శ్రీ విద్యామంత్రాన్ని 8. కాది విద్యను (పంచదశీమంత్రం) 9. హాది విద్యను, 10. సాది విద్యను, 11. దౌర్వాససీ విద్యను 12. షోడశీ విద్యను, 13. శ్రీవిద్యామూర్తి వర్ణనను, 14. భగవతీ చరణ వైభవాన్ని, 15. భగవతీ చరణ మహిమను, 16. భగవతీ చరణ మయూఖాలను, 17. భగవతీ చరణ నిర్ణేజనజల మహిమను 18. భగవత్యపాంగమహిమను, 19. భగవతి, అనేక రూపాలను 20. భగవతీ సేవా ఫలాన్ని, 21. సారస్వత ప్రయోగాన్ని, మాదన ప్రయోగాన్ని, 22. గారుత ప్రయోగాన్ని, 23. శ్రీచక్రాన్ని , 24. శివచక్రాలను, శక్తి చక్రాలను 25. శ్రీచక్రలేఖన పద్ధతులను, 26. సమయాచారాన్ని, 27. శివశక్తి సామ్యాది భేదాలను, 28. పంచవిధ సామ్యాలను, 29. త్రివిధ తాదాత్మ్యాలను, 30. చతుర్విధైక్యాలను, 31. హిత్విరైక్యాలను (నాద, బిందు, కళల పరస్పరాను సంధాన్ని) 32. సాదాఖ్య కళను, 33. మహావేధ ప్రకారాన్ని, 34. సౌందర్యలహరి – షట్చక్రపూజా క్రమాన్ని, 35. తాంత్రికుల యోగాన్ని – కుండలినీ యోగాన్ని 36. కుండలినీ వివరణను ఇలా తంత్ర యోగాద్యంశాలను వివరించారు.


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**


**'చతుర్థ తరంగము'**లో 1. ఈ స్తోత్రం కావ్య ప్రక్రియలలో శతక మవుతుందని నిరూపించారు. 2. మంగళాచరణ విశిష్టతను పేర్కొన్నారు. 3. రస విషయంలో ప్రధానరసం శృంగారమనీ, అంగరసం శాంతమనీ ప్రతిపాదించారు. 4. శ్లోకాలలో కనిపించే అలంకార సౌందర్యాన్ని, 5. వర్ణనలను, 6. ధ్వనిని, 7. కవి సమయాలను, 8. కవితాశైలిని, 9. పూర్వ గాథాచర్వణాన్ని, 10. యతి నిర్ణయమాలు –వర్ణమైత్రిని, 11. శాస్త్రకామత్వాన్ని, 12. కవిశ్రేణిలో సౌందర్యలహరి కర్తృ స్థానాన్ని నిరూపించారు.

**పంచమ తరంగం**లో సంస్కృత భాషలోని 36 వ్యాఖ్యానాల సూచికను అందించారు. చివరలో లక్ష్మీధర వ్యాఖ్యానం యొక్క వైశిష్ట్యాన్ని సోదాహరణంగా పేర్కొన్నారు.

**షష్ఠ తరంగం**లో 1. సౌందర్యలహరి యొక్క వైదికతను పరిశీలించారు. 2. అద్వైత తత్త్వ ప్రతిఫలాన్ని ప్రతిబింబించినదో చూపించారు. 3. ఆచారాల్ని –సంప్రదాయాల్ని సౌందర్యలహరిపై శ్రీ శివమహిమ్నః స్తోత్ర –శ్రీలలితా సహస్రనామ– శ్రీ లలితా త్రిశతి – సుభగోదయాది ప్రాచీన స్తోత్రాల స్వభావాన్ని పరిశీలించారు. 5. అనంతర స్తోత్ర సాహిత్యంపై అంటే మూక పంచశతి – జగన్నాథ పండిత స్తోత్రలహరీ పంచకం వంటి వాటిపై సౌందర్యలహరి స్తోత్రలహరి ప్రభావాన్ని 6. సమాజంపై సౌందర్యలహరి ప్రభావాన్ని 7. చివరలో నీరాజనాన్ని సమర్పించారు.

**'పరిశిష్టము'**లో ప్రామాణికమైన లక్ష్మీధర పాఠానుసారంగా సౌందర్యలహరి శ్లోకాలు పేర్కొని ఉంటే బాగుండేది. అయితే ఇందులో 1. సంగీత సంప్రదాయాన్ని 2. శ్లోక ప్రయోగ సంప్రదాయాల్ని చేసి ఉపసంహారం చేశారు.

చివరలో ఉపయుక్త గ్రంథసూచికలో 98 సంస్కృత గ్రంథాలను, 2. హిందీ గ్రంథాలను, 5 తెలుగు గ్రంథాలను, 6. ఆంగ్ల గ్రంథాలను ఆధార గ్రంథాలుగా ఈ సిద్ధాంత గ్రంథానికి ఉపయోగపడినట్లు పేర్కొన్నారు.

ముఖ్యంగా ఈ సిద్ధాంత వ్యాసానికి కంచికామపీఠం వారు ప్రచురించిన లక్ష్మీధరాది దశ వ్యాఖ్యా సమన్వితమైన సౌందర్యలహరి ప్రామాణికంగా అనుసరించినట్లు, తెలుగు భాషలో వెలువడిన వివిధ సంస్కరణలు పరిశీలించినట్లు సర్ జాన్ వారూఫ్ గాలి పీఠికలు చూడబడినట్లు డా॥ అయాచితం గారే పేర్కొనడం గమనార్హం. ఇది వారి పరిశీలనాదృష్టికి తార్కాణం.

ఏది ఏమైనా శంకరాచార్యులు రచించిన అద్భుతమైన స్తోత్రాలలో తలమానికమైన సౌందర్యలహరిలోని అనేక మంత్ర శాస్త్ర రహస్యాలను విడమరచి విపులంగా చర్చించిన సిద్ధాంత గ్రంథం ఇది తప్ప మరొకటి ఉండదేమోనని నా అభిప్రాయం. ఇంత మంచి థీసిస్‌ను అందించిన డా. అయాచితం గారి దివ్య స్మృతికి నమస్సుమాంజలి అర్పిస్తున్నాను.

# పండితుడే కాదు – ప్రవక్త కూడా ...

**ఎర్రాప్రగడ రామకృష్ణ,** రాజమండ్రి. ఫోన్ : 939 790 7344

అన్వీక్షణమంటే పైపైన చదువుకొంటూ పోవడం కాదు, లోతుగా పరిశీలించటం. అంతర్ధ్వనులను ఆలకించడం. అంతరార్థాలను గ్రహించడం. డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మగారి అంతర్యామి వ్యాసాలను ఆ విధంగానే సమీక్షించమని సంపాదకుల నుంచి నాకు అందిన ఒక సందేశంగా భావిస్తున్నాను. అందుకోసమే వారి శీర్షికను ఈ విధంగా నిర్ణయించారనుకొంటున్నాను.

ఈనాడు దినపత్రికలో శర్మగారు రాసిన అంతర్యామి వ్యాసాల గురించి చర్చించే ముందు మనం ఒక విషయాన్ని బాగా గుర్తు పెట్టుకోవాలి. ఆయన సంస్కృతాంధ్ర పండితులు. ఆపై అవధాని. ఆయన అధ్యయన అధ్యాపనాల పరిధి చాలా విస్తృతమైనది. సంస్కృతంపై గట్టి పట్టు. అవధానంలో పాండిత్య ప్రదర్శన దిశగా ప్రేరేపిస్తుంది. ప్రౌఢికి పెద్ద పీట వేస్తుంది. **'అలసఘుస్వాదు రసావతార ధిషణాహంకార సంభారదోహల బ్రాహ్మీమయమూర్తిమత్త్వం'** ముందడుగు వేస్తుంది. 'దిగిరాను దిగిరాను దివి నుండి భువికి'.. అంటూ మారాం చేస్తుంది.

అయితే అంతర్యామి వ్యాసాల లక్ష్యం వేరు. దాని పాఠకులు వేరు. అలతి అలతి పదాలతో పాఠకులను అలరించడం వాటి ఉద్దేశ్యం. సునాయాసంగా పాఠకులను ఆ శీర్షిక దిశగా ఆకర్షించడం ఇక్కడ చాలా అవసరం. అలా అని పలచన చేస్తే రచన చులకన అయిపోతుంది. గంభీరమైన విషయాలను పాఠకులను సరళంగా బోధించడం ఇక్కడ ప్రధాన కర్తవ్యం. అంతర్యామి వ్యాసాలు పండితుల కోసం కాదు. సామాన్య పాఠకులకోసం. అంటే, చెబుతున్న విషయం నారికేళపాకమైనా, చెప్పేవిధానం కదళీపాకం కావాలి. అప్పుడే పాఠకులు ఆ శీర్షికను ఇష్టపడతారు. ఆ శీర్షిక లక్ష్యం నెరవేరుతుంది.


డాక్టర్ అయాచితం వారికి ఆ ఔచిత్యం బాగా తెలుసు. దేనికి రాస్తున్నామో, ఎవరికోసం రాస్తున్నామో స్పష్టంగా ఎరిగిన విజ్ఞుడాయన. అంతర్యామి పాఠకులను అన్నిటా పైకి ఎదగాలని శాసించలేదాయన. తానే పాండిత్య శిఖరాలనుంచి దిగి వచ్చారు. పాఠకులను దగ్గరకు తీసుకున్నారు. బుజ్జగించారు. అమ్మ బువ్వ తినిపిస్తు తీరులో అద్వైత వేదాంత సారాలను అలవోకగా పాఠకులకు వివరించారాయన. ఒకసారి 'అమ్మా' అద్వైతం అంటే ఏమిటో మాకు అర్థమయ్యేలా చెప్పు' అని జిల్లెళ్ళమూడి అమ్మను అడిగిందో ఇల్లాలు. **'ఏముంది నాన్నా! కూతురుని కోడల్ని ఒకేలా సమానంగా చూడటమే అద్వైతం'** అన్నారామె. శర్మగారి వ్యాసాలు చదివినప్పుడల్లా నాకు అమ్మ మాటలు గుర్తుకొస్తాయి. అవి నిజజీవితాల్లోని ఘట్టాలను గంభీరమైన వేదాంత విషయాలతో సమన్వయించగల ప్రతిభావంతులు శర్మగారు. అంతర్యామి రచయితల్లో అత్యంత ప్రాచుర్యాన్ని పొందినవారిలో ఆయన




మొదటి వరుసలో ఉండటానికి కారణమదే. అంతే కాదు. ఆకలితో పసికందు అమ్మ ఒడికి చేరుకోగానే అమ్మ ఎద పాలను స్రవించినంత సహజంగా, వేగంగా ఆయన వ్యాసాలు రాసిచ్చిన సందర్భాలు నాకు తెలుసు. ఆయా సందర్భాల్లో ఆయనకు అక్కరకు వచ్చింది ఆయనలోని అవధాని లక్షణం.

**"జ్ఞానం పొంగితే తనంతతానే జనంలోకి పరుగిడుతుంది**
**శిఖరం మీదె ఉండమంటె ఏసెలయేరు ఊరుకుంటుంది.?"**

అని అడిగారు సినారె ఒక ద్విపదలో. అది శర్మగారి విషయంలో నిజం అయింది. రచయితకు పాఠకుడికి చక్కగా పొత్తు కలిసింది. కొండమీది జలప్రవాహం దిగివచ్చి నేలమీద పంటలు పండించింది. ఆ కోణంలో ఆలోచిస్తే అంతర్యామి క్షేత్రంలో పైర్లను ఏపుగా సాగుచేసిన తెలంగాణా ముద్దుబిడ్డగా, విజయం సాధించిన సేద్యకారునిగా గెలిచారు. శర్మగారు చరిత్రలో నిలిచారు. ఆ విషయంలో అమోఘమైన వారి శాస్త్రపాండిత్యం ఆయనలోని భగవద్దత్తమైన భావుకతను అణచివేయకపోవడం గొప్ప విశేషంగా చెప్పుకోవాలి. అది అరుదైన లక్షణం.



ఒక్క ఉదాహరణ చెబుతాను. ఆయన చాలాకాలం క్రితం ఈనాడులో ఉపాసన అంటే ఏమిటి? అనే వ్యాసం రాశారు. ఉపాసన అంటే ఏమిటో చెప్పడానికి ఆయన శంకరభగవత్పాదుల భగవద్గీత భాష్యంలోని నిర్వచనాన్ని పేర్కొన్నారు. **'శాస్త్రోక్త విధానాలను అనుసరిస్తూ ఇష్టదైవానికి సమీపంలో ఉంటూ ఎడతెగని తైలధారలా ఎక్కువకాలం అనుసంధానం కలిగి ఉండటం ఉపాసనమని శంకరులు చెప్పారు'** అన్నారు. ఉపాసన గురించి చెప్పే సమయంలో శంకరుల వ్యాఖ్య స్ఫురించడం శర్మగారి పాండిత్యానికి నిదర్శనం. ప్రామాణికత విషయంలో అంతకు మించిన నిర్వచనం లేదనడం అతిశయోక్తి కాదు. దాన్ని ఉదాహరించడంతో ఆ వ్యాసానికి ఎంత బరువు. పరువు చేకూరాయో మనం గ్రహించాలి అప్పుడే అంతర్యామి వ్యాసాల్లో ఆయన సౌందర్యానికి కారణం తెలుస్తుంది.

అదే వ్యాసంలో సగుణ, నిర్గుణోపాసనల మధ్య తేడా గురించి విస్తారంగా చర్చిస్తూ – వేదమంత్రాలను, గీతా వచనాలను సైతం ఉ ట్టంకించారు. అవి నిజానికి చాలా జటిలమైనవి. సామాన్యుడికి కొరుకుడు పడనివి. కాబట్టి ఆయన చివరి పేరులో **'స్థూలంగా చెప్పాలంటే విగ్రహారాధన అంతా సగుణోపాసనమే'** అని తేల్చారు. అక్కడికి పాఠకుడికి సందిగ్ధత తొలగిపోయి బరువుదిగి పోతుంది. మరోసారి వ్యాసాన్ని చదివి దాన్ని 'తనది' చేసుకుంటాడు. అదీ శర్మగారి ముద్ర!. అదీ శర్మగారి చాతుర్యం.

**'పండితుల మాటల్లో క్లిష్టత ఉంటుంది. ప్రవక్తల పలుకుల్లో స్పష్టత ఉంటుంది"** అనే నానుడి శర్మగారి విషయంలో అక్షరాలా నిజమైంది. కారణం ఏమంటే ఆయన పండితుడిలా ఆలోచించారు. ప్రవక్తలా ప్రవచించారు. పండితుడి గుండె పొరకు అంతర్యామి పాఠకుడి ఎదలోని వెండితెరకు మధ్య సేతువు నిర్మించడంలో శర్మగారు ప్రదర్శించిన ప్రతిభ ఆయనను విజేతగా నిలబెట్టింది. పాఠకుడి హృదయాల్లో ఆయనకో గుడి కట్టింది. అలా పండితుడు ప్రవక్తగా మారడంలోని సంక్లిష్టతను సునాయాసంగా ఛేదించిన ఆ ప్రతిభాశీలికి నేను సప్రశ్రయంగా నమస్కరిస్తున్నాను. స్వస్తి!

## సూర్య స్తుతి (మొగులురేని సొరు)

**కీ.శే. డా. అయాచితం నటేశ్వర శర్మ**

ఒక్క గీరైనను ఉరుకునా యరదమ్ము
దెసల వెంబడి సాగి కొసలదాకు
తొడలు లేకున్నను తోలెడి నౌకరు
పగ్గములుగ కదల పాములన్ని
ఏడు గుర్రములకు తోడుగ చదలందు
మబ్బుదారుల జీల్చి మసలు పరుగు
ఆగడొక్క నిముసమైనను నింగిలో
నిరుల తరిమికొట్టు చురకురేడు
మింటి గడిని దోచు నింటింట సిరిగాచు
నొంటి మేలు జూచు మంట సాచు
కంటికింపు గొల్పి మంటి సొరుల నిల్పు
కాకవాకదాల్పు కాచుగాక!

సప్తతురంగ రంగ పరిచాలన ఖేలన లాలనోద్ధతిన్
సుప్త చరాచరమ్ములను శోభిల మేల్కొనజేసి, కర్మలన్
దీప్త ముఖోద్యమమ్ములకు తీర్చుచు నుండెడి జాగృతి ప్రభా
వ్యాప్త యశోవిశాలను దివాకర మూర్తి సంస్తుతించెదన్!



వేడుకొందు నేడు వేడిమి గలవాని
వేడుకొన్న గాచు వాడి దొరను
నాడు నేడు రేపు నోడని జోదును
వీడకుండ నుతుల పాడుకొందు!

నిప్పుల కుప్పయై రగిలి నింగిని సాగిన చండభానుడే
ఇప్పుడు పశ్చిమాబ్ధి గమియించెను చీకటి రాజ్యమేలగా
కుప్పలు కుప్పలై యిరులు గూలుచునుండెను నల్లనల్లనై
చప్పుడు లేక గప్పుకొనె శార్వరి నేలను కౌగిలించుచున్!

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 (49) హైదరాబాద్ అక్టోబర్ : 2024

# నటేశ్వరుని పద్యకవిత్వ తాండవం – ఋతుగీత


**తిరుగుళ్ళ శ్రీనివాసమూర్తి,** విశ్రాంత డివిజనల్ మేనేజర్, ఎల్.ఐ.సి., ఫోన్ : 799 576 4613

మా బావగారు నటేశ్వరశర్మగారు మా అక్క పెండ్లి అయిన నాటినుండీ మా కుటుంబంలో అత్యంత ప్రధానమైన వ్యక్తిగా మెలిగారు. పిల్లలలో పిల్లవాడుగా, పెద్దలతో పండితునిగా, అందరి మంచికోసం శ్రమించే బాధ్యతగలవ్యక్తి బావగా మాకెంతో ఆత్మీయులు. మేము పరిశీలించినంతవరకూ ఆయన ప్రధానంగా ప్రకృతి ప్రేమికుడు. ప్రకృతిలో సహజంగా కలిగే మార్పులను మా బావ ఎంతో హృద్యమైన, భావుకత నిండిన కవిత్వంలో వర్ణించేవారు. కృత్రిమత్వం అనేది ఆయనకు ఏ విషయంలోనూ నచ్చేది కాదు. అందుకే ప్రకృతి పట్ల ఆరాధన అనేక సందర్భాలలో తనలో కనిపించేది.

పద్యం, గేయం, వచనం ఈ మూడు ప్రక్రియలలో శర్మగారు ప్రతిభావంతమైన, ప్రభావవంతమైన రచనలు చేశారు. భావుకతతో బాటు సమాజశ్రేయస్సు కూడా అంతర్లీనంగా సాగే ఈ కవి రచనలలో మనోహర ఖండకావ్యం 'ఋతుగీత'. దీనిలో ఆరు ఋతువులలోని అమోఘదృశ్యాలు కట్టెదుట నిలుపుతూ వర్ణిస్తాడు కవి. వసంతహాసిని, గ్రీష్మతాపిని, వర్షహర్షిణి, శరత్కౌముది, హేమంతసీమంతిని, శిశిర పత్రిక అనే శీర్షికలను నిర్దేశించడంలో ఔచిత్యాన్నీ వైవిధ్యాన్నీ కనబరిచారు. అంటే వసంతంలో కుసుమ హాసాలూ, గ్రీష్మంలో ఉష్ణతాపాలూ, వర్షంలో పులకింతల హర్షాలూ, శరత్తులో విరిసే వెన్నెలలూ, హేమంతంలో బంతీ చేమంతుల లావణ్యాలూ, శిశిరంలో రాలిపడే పత్రాలూ మానవజీవితాలపై ప్రభావాన్ని చూపుతాయనే సత్యం రమణీయంగా ఆవిష్కృత మైంది ఈ కావ్యంలో. ఒక ఋతువు నుండి ప్రకృతి మరొక ఋతువులోనికి మారుతున్న సంధిని సూచించే అనుసంధానాత్మక పద్యాలు ప్రతీఋతువర్ణనలోని ఆద్యంతాలలో నిబంధింపబడడం కవి ప్రతిభకు తార్కాణం. 'వసంతహాసిని' ప్రారంభంలో గతశిశిరంలో ప్రచండమైన గాలులకు రాలిపడిన ఆకులు చిగుళ్లకు జీవం పోస్తున్నవనే ఈ పద్యం ఎంతో హృద్యం –

**"గత శిశిర వాయు వీచీ ఘాతమునకు**
**పలిత పత్రాల రాల్చిన పాదపములు**
**మరల చివురులనొత్తు ఆమనులవేళ**
**ఆవహించెను చూత వనాంతరమున"**

వసంతం హసిస్తే లోకం పులకరిస్తుంది. పులకించిన లోకమే సర్వాంగీణంగా వికసిస్తుంది. వికాసం వసంతానికి మూలం. అదే ప్రకృతి మాయాజాలం. అందుకే ఈ కవి వసంతహాసాన్ని ఇలా హృదయగతం చేసుకున్నాడు.



**నీవు హసింతువప్రతిమ నిర్మల శారదచంద్ర చంద్రికల్**
**ఆవల పారపోవునటులా దరహాస సుధారసాంచిత**
**శ్రీవిగ నిల్చి మానస విశీర్ణ వివర్ణ రసాలసాలమున్**
**పూవుల తావులన్ విరియ బూయగ జేతువుగాదె నెచ్చెలీ!**

మధుమాసానుభూతిలో పరవశించే భావుకులకు రెండునెలల కాలం రెండు నిమిషాలలో కరిగిపోయినట్లు అనిపిస్తుంది. అందుకే ఈ కవి –

**"ఏల యింతనె ముగిసెనే పూలకారు?**
**ఇంతనే అరుదెంచెనా ఎండకారు?**
**ఇంక మన రాగ జీవితమెంతదాక**
**విరహతాపమ్ములో బడి వేగ వలెనొ?"**

అంటూ వాపోతాడు. ఆ బాధ మరుల బాధ వంటిదే కదా!

వియోగ దుఃఖం ఎదలో సెగలను, పొగలను రగిలిస్తుంది. వసంతకాలం త్వరగా గడిచిపోయినందుకు ఆ వియోగబాధను ఆత్మీయ బాధగా మలచిన ఈ పద్యం రమణీయం –

**"ఇటు వసంత వియోగ మదెట్లు గడచు**
**ననుచు మనసున నెంతయో కనలుచుండ**
**పొగలు సెగలను మేనిలో పొంగజేసి**
**గ్రీష్మ మరుదెంచగా భువి నూష్మమెగసె"**

వసంతానికీ గ్రీష్మానికీ అనుసంధానంగా గ్రీష్మతాపాన్నీ చండ భాస్కరుని ఎండనూ చూపిన సరణిలో

**ఫాలనేత్ర భవానల జ్వాల కరణి**
**నిప్పులు మిసెను తాపము నింగినుండి**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12

హైదరాబాద్ అక్టోబర్ : 2024




**యెండలను జూడ జీవుల గుండెలదర**
**భగ్గుమని వెల్గెరా చండ భాస్కరుడు.**

జీవితం జటిలమైన ఎండలలో తాపాన్ని ఓర్చుకోవడం కష్టమౌతుంది. ఈ జటిలసమాస పద్యంలో సూర్య తాప తీవ్రతను వర్ణించడం అద్భుతం–

**ఆ తపమా? తపోఘ్న కుసుమాయుధ దాహక ఫాలనేత్రవ**
**హ్న్యతపమా? శివాంకిత శివాచరితోత్తమ తాపసాగ్ని జు**
**న్యా(త)పమా? నగాబ్ధి హృదయాంతర దీప్త లయాగ్ని కీల మా**
**లాతపమా? ప్రపంచ సకలార్త జునాంతర కోపతాపమా?**

ఇన్ని విధాలుగా గీష్మతాపాన్ని వర్ణించడం, చివర బాధాతప్తుల కోపమే రూపాంతరమై గ్రీష్మమైనదని ఉత్ప్రేక్షగా చెప్పడం ప్రశంసనీయం.

వియోగబాధలో ప్రభవించే వేడితోనే నింగితో మబ్బులు ఏర్పడుతాయి. హృదయశోకానికి ప్రత్యక్షరూపం కన్నీరు అయినట్లే గ్రీష్మతాపానికి పర్యవసానం వర్షపాతమే –

**“నీ వియోగ యోగమ్మున నిలచి నేను**
**శూన్యమైనట్టు నింగిని చూచుచుండ**
**వేల మబ్బులతో విను వీధి విరిసి**
**పుడమి యెదదను వెల్లువల్ పొంగజేసె”**

అని గ్రీష్మాన్నీ, వర్షర్తువునూ అనుసంధానించడం ఆశ్చర్యం కలిగించే భావన.

ఇలా వర్షర్తువు రానే వచ్చింది. వానాకాలంలో పిల్లల ఆటలు రమణీయాలు. ఇంద్రధనుస్సును చేసి వారు వేసే కేరింతలు, కాగితం పడవలతో ఆటలు, వాన నీటిలో పరుగులు తీసే దృశ్యాలు హృద్యాలు –

**“ఇంద్రధనుస్సులో సొబగు లీనుచు రంగుల రంగవల్లులన్**
**చంద్రుని ఇంటి వాకిటను చక్కగ నిల్పుచు శైశవంపు ని**
**స్తంద్ర విలోకనమ్ముల ముదమ్మున జూచెడి బాలకాళిపై**
**సాంద్ర జలాక్షతల్ గురిసి సాగెద నీవు సుదూరతీరముల్”**

ఇలా ఈ కావ్యంలో ప్రతి పద్యమూ ఆణిముత్యమే. సమాజ శ్రేయస్సుకు నిరంతరం కోరే కవి పేదలను, కూడూ గూడూ లేని నిర్భాగ్యులను కనికరించవలసిందిగా వర్షామేఘాన్ని కోరుతున్నారు.

**“కూడును గూడులేని బ్రతుకుల్ గడుపంగ ననేక కష్టముల్**
**గూడగ రేబవళ్లు కునుకున్ గొనలేని వినష్టభాగ్యులన్**
**చూడుము వారికెల్లెడల చొక్కపుమేలును గల్గజేయుచున్**
**పీడిత జీవబాంధవిగ పేరును నిల్పుకొనంగనొ సఖీ!”**

జలం ద్రవమే కదా! ద్రవీభవించడం కారుణ్యానికి సంకేతం. కారుణ్యం భగవంతుని లక్షణం. అందుకే ‘రసోవైసః’ అనే వేదమంత్రం భగవంతుని రసస్వరూపుడని పేర్కొన్నది. అందుకే వర్షం దేవతా స్వరూపమేనని అంటాడు కవి.

**“నీవు దయారసమ్మునకు నిక్కము పెన్నిధివౌను, లేనిచో**
**పూవులతోటలీ పుడమి బుట్టునె? నీ రసదోహదక్రియన్?**
**ఈవు పరాత్మరూపమగునెట్లన నా రసమాత్మయే యనం**
**గా వచియించు వేదములు కల్మషహారక వాహినీ వతీ!”**

భూగోళం శివలింగంతో సమానం. మేఘం అభిషేక పాత్రవంటిది. మెరుపుతీగలు గంధపు పూతలను తలపింపజేస్తాయి. ఇలా కవి తన భావనలో చేసిన శివపూజ ఎంతగానో ఆకట్టుకుంటుంది –

**“పుడమియె శైవలింగమని పూజలు చేసిదవీవు భక్తిలో**
**వడివడి వానలందడిపి వార్షిక వార్షుక వేళలందు, నీ**
**యొడలభిషేక పాత్రగ నియుక్తముగాగ తటిల్లతారుచుల్**
**మృదునికి తైజసాత్మక సమీప్సిత గంధపు పూతలయ్యెడిన్”**

వర్షం కురిసి మేఘం అలసిపోయి నిద్రలోకి జారుకుంటాడు. ఆ రాత్రి వేళ శరచ్చంద్రుడు ఉదయించి –

**“నింగి యను పాల్కడలిని జనించె విధుడు, శారద జ్యోత్స్న ప్రసరింప సొరునింప”** ఇలా శరదృతువు రాగానే ప్రకృతిలో అనూహ్యమైన మార్పు వచ్చింది. స్వచ్ఛతకు శరత్తు ప్రథమ తాంబూలం సమర్పించుకుంటుంది.

**“నింగిజలతారు తెరలలో తొంగిచూడ**
**బుడుత జాబిల్లి యంత దోబూచులాడు**
**చుక్కలన్నియు హంసలై రెక్కలార్చి**
**గగనగంగా తటమ్మున కలయబారు”**

నిరర్థకమైన దానిని ‘అడవిగాచిన వెన్నెల’ తో పోల్చడం పరిపాటి. కాని అది నిరర్థకంకాదనీ, సార్థకమే కాక ఆరోగ్య ప్రదమనీ ఎంతో ఔచిత్యంగా వర్ణన చేశాడు కవి.

**“అడవిని గాచు వెన్నెల నిరర్థకమన్న నిరర్థకమ్మగున్**
**పుడమిని దుర్గమాటవిని బొల్చిన యోషధులే రుజాబ్ధులన్**

**గడచుటకైన నౌకలనగా గల హేతువు కాననాలలో**
**పడిన సుధాంశు చంద్రికల పాతమె అన్యముగాదు చూడగన్"**

ఇలా అనేక పద్యాలలో శరదృతు వర్ణన ఆహ్లాదవంతంగా, మనోహరంగా సాగింది. భావుకతనూ, పదబంధాలనూ నేర్చుకోవాలనుకునే అభ్యాసకవులకు ఈ కావ్యం అవశ్యపఠనీయం.

**'వెన్నెల తానమాడి నిలచియున్నంత మదిలోన చలులు పొలిచె'** ప్రకృతిలో హేమంతం ప్రవేశించగానే పగళ్లు తగ్గుతూ, రాత్రుళ్లు పెరుగుతున్నాయట. సురుచిరమైన పద్యాలలో హేమంత ఋతువర్ణన అద్భుతంగా సాగింది. **"చలిపులి లోకమెల్లెడల సాగుచున్నది తీర్పగలేని యాకలిగొని"** అడవులు, జనపదాలు అనే తేడా లేకుండా బాధపెట్టే వణుకును కలుగజేస్తున్నది. హేమంతంలో శరీరం మొగ్గలా మారుతుందనే కమనీయమైన ఊహను పదిలపరిచిన పద్యం –

**మును వికసించె, నేడదియె మొగ్గగనయ్యెను మేనిపూవు, జీ**
**వనవనమందు చిత్రముగ వన్య నిసర్గతకెల్ల భిన్నమై**
**మనుజుల సృష్టిజేసిన యమానుషశక్తి విలాసమిద్ది, కా**
**దనగ తరంబె కట్టెదుట తావణికింపగ శీతవేళలన్**

నేలను పాన్పుగా, నింగిని కప్పుగా చేసుకొని జీవితాలను సాగించే బీదసాదలకు సాంత్వన కలిగేలా ప్రవర్తించుమని హేమంతాన్ని కోరడం కవిలోని సమాజశ్రేయఃకాంక్షకు, కారుణ్యానికి ప్రతీకలు –

**"నేలను పాన్పుగా నిలిపి, నింగికప్పుజేసి నిద్రలన్**
**సోలెడి దీనమానవుల సుంతకనుంగొని, నీ ప్రభావమున్**
**లీలగ తగ్గజేసి, యవలీలగ వెచ్చదనమ్ము నిచ్చుచున్**
**మేలును జేయనీకగును మేదినినెల్ల జయాభినందనల్!"**

చలికి వణికిన ప్రకృతిలోని తరువులు ఆకులు రాల్చడం ప్రారంభం కాగానే శిశిరం రాబోతున్నదనే సూచన రానే వచ్చింది. అందుకే –

**తల్లికడుపున జన్మించి తనిసితనిసి,**
**పుడమి పొత్తిళ్లలో చేరి మురిసి మురిసి**
**పెరిగిపోవుచు తరువుల పెద్దవైతి**
**వెండుటాకుల రాల్చెదవీదినాన**

ఆమని రాక కోసం తన తనువునే సమర్పణ చేసే శిశిర స్వభావం పరోపకార పరాయణమైంది. ఆ త్యాగం సకల లోకానికి ఆనంద హేతువు వసంత వికాసానికి హేతువు. **"నీ మహిత్వమెన్నడును నిల్చును గావుత విశ్వశాంతికై"** అని కవి ఆకాంక్షిస్తాడు.

ఋతువుల తత్త్వాన్ని తెలిసికొని ధర్మబద్ధంగా జీవనాన్ని కొనసాగిస్తే ఈ లోకం అమృతమయం అవుతుంది.

**ఋతువుల తత్త్వమున్ గనుచునెప్పుడు చక్కని బాటసాగు, జీ**
**వతతికి లోకమందెపుడు బాధలు గల్గవు, ధర్మయుక్తమౌ**
**గతిని సదా మతిన్ నిలిపి గమ్యము చేరిననాడె, శాశ్వతాౕ**
**మృత మయ లోకమందు సకలేప్సితముల్ ఫలియించి నిల్చెడిన్**



విశ్వంలోని మానవులందరూ తమ జీవనయాత్రలో ఋతువుల అందాలను దర్శిస్తూ, ఆనందాన్ని పొందితే అన్నీ సిద్ధిస్తాయి. కవి ఆకాంక్ష ఇలా అవతరించింది –

**కావున విశ్వమెల్లెడల కానన పట్టణ ఘోషలన్ ప్రయా**
**ణావసరమ్ములో ప్రకృతి యందములన్ దిలకించుచున్ సదా**
**భావుకదృష్టి నిల్పి, మృదు భావనలో నమృతమ్ము గ్రోలగా**
**పావనమౌను జీవనముపాసన సిద్ధిని పొందినట్లుగున్**

ఇలా ఋతువర్ణనలతో, సందేశాత్మక విషయాలతో నిండిన "ఋతుగీత" భగవద్గీతలా సమాజ శ్రేయస్సుకైన ప్రాకృతిక విలాసాన్ని సహృదయులకు అందించింది. నిరంతరం కృషితో, భావుక జీవనంతో కాలాన్ని అత్యుత్తమంగా వినియోగించుకున్న మా భావుకులు నటేశ్వరశర్మ గారు సాహితీ లోకానికి చేసిన సేవను మరువలేము.


## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# నటేశ్వర కీర్తి


సేనాపతి భాష్యకాచార్యులు

శ్రీకరమైనట్టి శ్రీయయాచిత ఘన
వంశాబ్ధి సంజాతవర శశాంక
శ్రీ నటేశ్వరాఖ్యక! శ్రీకర కవివర్య!
సంస్కృతాంధ్రాబ్ధి భాషా కవీశ!
పంచవింశతి గ్రంథ పరిమళ గంధమున్
వాణి కర్పించిన వర కవీంద్ర!
తెలుగు, సంస్కృత, భాష తెల్లమున్ బంచిన
రమ్య సుకవిరాజ రాజ్య రాజ!
నవ్యరీతిన నవ రసాల్ నాణ్యముగను
కావ్యముల యందు చిప్పిల్ల కవితలల్లి
అమల రీతిన పఠితల కందజేసి
ఖ్యాతి నెంతయో యందితి ఘనతరముగ

ఆంధ్ర దేశాన మీర లచ్చటచట
శస్త యవధానముల నెన్నొ సల్పినారు
బిరుదు బీరమ్ములందుచు వరల వలయు
అనఘ! యే నటేశ్వరార్య వర్య!!


కామారెడ్డి పురంబున
నేమంబున భాష కెంతొ నింపగు సేవన్
యేమారక నిర్వహింపగ
సేమంబున పరిఢవిల్లె శ్రీ కావ్యంబుల్.

అమర భాషామృతా గణిత భావాల
రమ్య సంస్కృత పదాల లాస్య మొదవి
మధుర భావాల కమ్మని నుడి కారాల
ఛందః ప్రవాళ సంచయము నొప్పి
మనసు హత్తుకొనెడు మధుర సమాసాలు
కావ్యచయములందు గానుపింప
బహుళ కావ్యచయము భాసిల్లగా జేసి
తెలుగు భాషలోన వెలుగు నింపి



సాహితీ రజతోత్సవ సభల యందు
బహుళ సన్మానముల నంద ప్రబలె కీర్తి
అనఘ ఏ నటేశ్వరరార్య! సుకవి!
అభినుతింతును పలుమారు నాదరమున !


సౌందర్యలహరిపై పరిశోధనము జేసి
డాక్టరై యలరితి డాబు మీర
ఆముక్త మాల్యదంబను కావ్య శోధనన్
యంఫిల్లు పట్టమ్ము నందినావు
గేయరూపకాలు తీయని కవితల
శతకాలు వ్రాసితి శస్తముగను
వ్యాసాలు రేడియో ప్రవచనంబుల తోడ
సాహిత్య సేవలు సంఘటిల్ల
చేసి చేయించుచున్నారు చెన్నుమీర
మీదు సాహిత్య సేవలు మేదురముగ
తనరుచుండుత ఆచంద్ర తారకముగ
వృద్ధిరస్తును యిష్టార్థ సిద్ధిరస్తు!!



ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12  హైదరాబాద్ అక్టోబర్ : 2024

# అయాచితం నటేశ్వరా! శతక వైభవం!!

**సుప్పని సత్యనారాయణ,** తెలుగు అధ్యాపకులు. ఫోన్ : 9492626910



ఉమ్మడి హిందువు జిల్లా సాహిత్య చరిత్రకు భీష్మాచార్యుల వంటి వారు, సంస్కృతాంధ్ర పండితులు, అష్టావధాని, దాశరథి పురస్కృతులు, డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారు. వీరి కలం నుండి జాలువారని కవితా ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కానేరదు. చారిత్రక పరిశోధనలో, ఉభయ భాషల్లో కలిపి ఎన్నో మేలిమి కృతులను వెలువరించారు. వారి లేఖిని నుండి జాలువారిన నూతన రచనయే ఈ నటేశ్వరా! శతకము. ఇది వారి ముద్రిత రచనల యందు 51 వ పుస్తకం.

పద్యం అంటే పరమ ప్రామాణికంగా భావించే నటేశ్వర శర్మ గారి కలం,ఎన్నో శతకములకు, కావ్యములకు, సిద్ధాంత గ్రంథాలకు ఆయువుపట్టు అయినప్పటికీ, వారి సొంత దస్తూరితో వెలువరించిన తొలి గ్రంథం ఈ నటేశ్వరా! శతకము. ఇది దీని యొక్క ప్రత్యేకత. అందమైన చేవ్రాలు గల నటేశ్వర శర్మ గారు, ఏ పద్యమునైనా, కవిత్వాన్ని అయినా దానికి ఒక జీవం నింపే విధంగా వారి దస్తూరి మనకు కనిపిస్తుంది. అటువంటి అందమైన చేవ్రాలుకు పర్యాయపదమైన నటేశ్వర శర్మ గారి దస్తూరి,వర్తమాన సారస్వత లోకంలో ఎందరికో ఆదర్శంగా నిలిచింది. మునుముందు నిలుస్తుంది అనడంలో ఎంత మాత్రమూ సందేహం లేదు.

ఆత్మ ప్రబోధాత్మకమైన ఈ కావ్యమునందు రచయిత, తనలోని భావనలను, అనుభూతులను, ఆలోచనలను సమన్వయపరిచి, ప్రతి పద్యము నందు లోక రీతులను,నీతులను అత్యంత సుందరంగా, మనోహరంగా చెక్కిన తీరు, మనకు ప్రతి పద్యంనందు గోచరిస్తుంది. శివుడి పట్ల అపార భక్తి ప్రభత్తులు కలిగినటువంటి నటేశ్వర శర్మ గారు తనలోని 'ఆర్తి' ని, సంవేదనను శివోహం (తనలోకి పరమేశ్వరుని ఆవహింప చేసుకోవడం) గా మార్చుకున్నారు. జీవుల పట్ల, సకల ప్రాణుల పట్ల అపార కరుణా పారావార సముద్రుడైన ఆ నటరాజుకు, తన భక్తి ప్రభక్తులతో ఆ స్వామికి నివేదించడమే ఈ కావ్యము నందలి ప్రతి పద్యం యొక్క ఆంతర్యం. అట్లే ఆ స్వామి కృపాకటాక్షములే ఈ కావ్య రచనకు కారణభూతాలని, కావ్యారంభమున రచయిత తన నివేదనలో విన్నవించుకున్నారు.


తనకు తానే విన్నవించుకోవడం (ఆత్మ ప్రబోధాత్మకం) అనేది ఒకరకంగా ఆత్మ పరిశీలనయే. అంతరాత్మ సాక్షిగా అని కూడా భావించవచ్చు. నటేశ్వరా! అన్న మకుటంతో సాగిన ఈ శతకము నందలి చంపకోత్పలములు, అయాచితం నటేశ్వర శర్మ గారి మనోభావాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచినాయి. తన మదీయ దైవమై నటువంటి ఆ పరమేశ్వరుడిని 'నటరాజు' గా కీర్తింపబడడం, తన పేరు నటేశ్వరునిగా పిలువబడడం ఒకరకంగా చెప్పాలంటే,పరోక్షంగా తనలో దాగిన శివునికి విన్నవించడమే. ఇది అందరి వలన అయ్యే పని కాదు.తన రచనలను, తన అమలిన హృదయమును ఆ పరమేశ్వరుని దివ్య చరణారవిందములయందు అర్పించడం మరో విధంగా చెప్పాలంటే, తనకు తాను దైవదత్తమవ్వడం. ఈ భావన దైవం పట్ల ప్రగాఢమైన భక్తి విశ్వాసాలకు తార్కాణం.

నడిచే పద్యంగా కీర్తింపబడిన అయాచితం వారికి, పద్యం అంటే ఎంత ప్రాణమో, ఎంత అభిమానమో ఈ క్రింది పద్యమును చదివితే గాని తెలియదు.

**ప్రొద్దున లేచినంత విరబూయును నామది తోటవాకిటన్**
**పద్దెపు పువ్వు దాని వరభవ్యపరీమళమెల్ల వీచెడిన్**
**హద్దులు లేక విశ్వమును హాయిగా పొద్దున దాటి రమ్యమై**
**ముద్దులు గొల్పిపాఠకుల ముగ్దుల జేయునురా! నటేశ్వరా!!**

సుప్రభాత వీచికలతోనే తనలో పద్య సుమ దళాల పరిమళం తన మది తోటవాకిట వచ్చి, గుబాళింప చేస్తుందంటారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ పద్యము విన్న వెంటనే అయాచితం వారి కుసుమ కోమల సమన్వితమైన హృదయం ఎటువంటిదో అవగతం అవుతుంది. తనను నిద్దుర లేపే పద్యమే తదనంతరం పాఠకుల హృదయాలకు చేరి వారిని ముగ్ధులను చేస్తుందని సగర్వంగా ప్రకటిస్తారు. ఇది కూడా ఒక కవికి, రచయితకు ఉండవలసిన ఆత్మవిశ్వాసం. తెలుగు భాష ఔన్నత్యమును, వైశిష్ట్యమును గుర్తెరిగిన అయాచితం వారు, మాతృభాష గొప్పతనమును కళ్ళకు కట్టినట్టు చూయించే ఈ పద్యమును ఒకసారి చూడాలి.

**వెలుగుల జిల్గులన్ విరియు వెల్లడిజేయును సర్వ భావముల్**
**లలితములైన మాటల విలాసములన్ దనరంగజేయు,స**
**మ్మిళితములైన రాగముల మేలనగీతమువోలె శ్రావ్యమౌ**
**తెలుగును విస్మరించకు సుధీవిభుతన్ గనరా నటేశ్వరా!!** (11)



'మాతృభాషను విస్మరించడం అనేది మానవాళికి శ్రేయస్కరం కాదు' అనే సత్యాన్ని ఈ పద్యము నందు స్పష్టం చేసి,తల్లి భాష పట్ల తనకున్న గౌరవ అభిమానాలను చాటుతారు. అట్లాగే భాష యొక్క పుట్టు పూర్వోత్తరాలను తెలియజేస్తూ, భాషా స్వరూప స్వభావాలను కళ్ళకు కట్టినట్లు తెలియజేసే ఈ పద్యమును ఒకసారి గ్రహించవలసిందే.

**భాష సరస్వతీ మయము,భాషయె బ్రహ్మము, నిత్యసత్యమున్**
**భాషయె, భావనల్ నిలుపు భాగ్యము,భాషయె జీవమయ్యెడిన్**
**భాషను గౌరవింపవలె,భాషను నేర్వగ బూనుకోవలెన్**
**భాషలుదాల్చి మానవులు భామయులౌదురురా! నటేశ్వరా!!** (13వ పద్యం) అంటూ..భాషను అవహేళన చేసి,భాషను చిన్నచూపు చూస్తున్న కొందరు మనుషులకు కనువిప్పు కలిగించే విధంగా ఈ శతకమునందలి 14వ పద్యమును కూడా చూడవచ్చు. శ్రీకరమైన మాట గుణశేఖరమై వెలుగొందుచుండునని విశ్వసించే రచయిత, శుభమైన, జనసమ్మతమైన మాటలు. (9వ పద్యం)

సంధ్య వేళ, కమనీయ కాంతిమయములై ప్రభాతవేల దినకరుని వెలుగులవలె అనునిత్యం భాసిల్లుచూ, ఆనంద ఆహ్లాదములను మనసుకు కలిగించడమే కాకుండా, హృదయానికి హత్తుకుంటాయని అయాచితం వారు చెబుతారు. అలాగే మానవుడు ఎలా జీవించినా అది పల్లె అయినా పట్టణమైన ఎల్లప్పుడూ చల్లదనమును సమకూర్చేవి, మానవాళికి వేరుచేసి జీవితముకు సుగమం చేసేవి చెట్లే కదా! అటువంటి చెట్లను చల్లగా చూడడమే కాదు, వనములను అడవులను సమూలంగా నాశనం చేయడమే వలన మానవాళి మనుగడ అసాధ్యమననే విషయాన్ని కూడా పరోక్షంగా శతకం నందలి ఏడవ పద్యం సూచిస్తుంది.

**పల్లెలు,పట్టణంబులును,భవ్యమహా నగరంబులన్నియున్**
**చల్లగనుండునట్లు గను సర్వహితైషిణి వృక్షమేకదా!!** అంటూ..'చెట్లు లేకుంటే ప్రగతి శూన్యం, జీవితం మృగ్యం' అన్న వాస్తవికతను ప్రకటిస్తారు. కవుల సృజనకు మరో రూపం అయిన కావ్యములను గుర్తు చేస్తూ,వాటి ప్రస్తావనను విశ్లేషిస్తూ, రసపిపాస హృదయయులైన కవులకు కావ్యము అత్యంత ప్రీతికరము.సంభాషణ చాతుర్యముగలవారికి మంచి ముచ్చట.గాన కళా ప్రపూర్ణులైన కళారవులకు కమ్మని గానమాధుర్యమే ప్రీతికరమని, కళలచే మనుజుడు నిత్యం ఆనందోత్సాహాలతో గడుపుతాడని,శతకమునందలి ఎనిమిదవ పద్యంలో తెలియపరుస్తూ,మంచి కావ్యముల యొక్క పఠనం ఎంత గొప్పదో ఈ క్రింది పద్యం నందు తెలియపరుస్తారు రచయిత.

**కావ్యములన్ పఠింపక వికాసమువచ్చునె మాతృభాషలో?**
**కావ్యములేకదా సృజన కాంతులనిచ్చు కవీంద్రకోటికిన్?**
**దీవ్యదనంతభావనల దీపములై విలసిల్లు కావ్యముల్**
**శ్రావ్యత వానిమూలమయి రంజిలజేయునురా! నటేశ్వరా!!** (24)

సత్కావ్యపఠనం మాతృభాషలో ఒక చైతన్య వాతావరణము ఏర్పాటు చేస్తుందని అనడమే కాకుండా, కావ్యములు కవిలోని సృజన కాంతులను తెలియపరుస్తాయి. మనిషిలోని అనంత భావనలకు ప్రతీకలై ప్రతిరూపాలై వెలుగు దివ్వెల వలె పాప తిమిరములను నాశనం చేస్తాయి. శ్రావ్యమైన భావజాలంను సత్ప్రవర్తనను కలుగజేసి మనిషిని నిరంతరం పురోగమనములో పయనించే విధంగా దోహదపడతాయని అయాచితం వారు ప్రకటిస్తారు.

మనిషి సంఘజీవి. ఉదయము నిదుర లేచినది మొదలు, రాత్రి నిద్రపోయే వరకు తన చుట్టూ ఉన్న సమాజంలో ఏదో ఒక విషయంలో సంప్రదించవలసిన అవసరం ఉంటుంది. అంటే పలకరించడం అన్నమాట.అలా పలకరించే విధానంలో ఆ పలుకులు ఏ విధంగా ఉంటాయంటే! ఒక సందర్భంలో పలుకులు పలు రకాల పువ్వుల వలె మనలోకి చేరి, ఎన్నో భావ పరిమళాలను వెదజల్లుతాయి. ఒక సందర్భంలో పలుకులు పద్మములై మానస సరోవరంలో, ఎన్నో ఆనందసోయగాలను చిలుకుతాయి. ఒక సందర్భంలో పలుకులు చిలుకలు అయిన వేల మోడు వారిన హృదయవనం నశించిపోయి, హరితవంతమైన సోయగాలవలె, నవీనతను చిగురింపజేస్తాయి. ఒక సందర్భంలో పలుకులు ముత్యాలై రసహృదయుల మనోవేదికపై బంగారు వెలుగులను అందజేస్తూ, కవి హృదయమును పురిగొల్పుతాయి. మరో సందర్భంలో పలుకులు రత్నాలై కొత్త ఊహలకు దారులను ఏర్పరుస్తూ, కొత్త తేజస్సును సహజ సిద్ధమైన కళలను అందించే రవ్వల వలె సవ్వడులను చేస్తాయి. ఇంకా కొన్ని సందర్భాలలో పలుకులు వజ్రాలు అవుతాయి. హాసములై హృదయ కుహరంలో బాధలు అలము కున్నప్పుడు వెచ్చని సౌఖ్యాన్ని, మనసుకు హాయిని ఇవ్వడమే కాకుండా,కలతలను మనోవికారము లను దూరం చేస్తాయని పలుకులలోని మర్మమును నటేశ్వరులవారు భిన్న రుజువులుగా తెలియపరుస్తారు.

మంచి కవిత్వము ఎలా వికసించబడుతుందో ఈ క్రింది పద్యం తప్పక చదవాలి మరి,

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12 (55) హైదరాబాద్ అక్టోబర్ : 2024

**మనసుకు నచ్చువేదికయు మంజుల వాక్కులు పల్కుమిత్రులున్**
**వినదగు రాగమాలికలు ప్రేమ నొసంగెడి యాప్తవర్గమున్**
**వినయ సమన్వితాత్మ గుణవేదులు నైన రసజ్ఞులున్ననే**
**కననగు సత్కవిత్వము వికాసము నిచ్చునురా! నటేశ్వరా!!**
(38వ పద్యం)

తన మనసుకు నచ్చిన చక్కటి వేదిక, అమృతతుల్యములైన పలుకు లను పలికే స్నేహితులు, వినేందుకు ప్రేమతో ముందుకు వచ్చే ఆత్మీయులు, సన్నిహితులు,వినయ వివేకములకు ప్రతిరూపాలైన రసహృదయులు ఇంతమంది తన చుట్టూ ఉన్న తర్వాత,మంచి కవిత్వం వికసించ కుండా ఎలా ఉంటుంది? అంటారు నటటేశ్వరులవారు. ఈ పద్యం వినగానే అల్లసాని పెద్దన గారి 'నిరూపహతి స్థలంబు రమణీ ప్రియ దూతిక తెచ్చియిచ్చు'.... అనే పద్యం మనకు స్ఫురించక మానదు.


చిన్నప్పటినుండి అపారమైన గురుభక్తి తత్పరతను కలిగినటు వంటి నటీశ్వరులవారు,ఆ గురువు యొక్క గొప్పతనమును వివరిస్తూ చెప్పిన ఈ పద్యాన్ని ఒకసారి చూడండి.

**బాలునిబుద్ధి పాదరసభాతి చలించెడుదాని వట్టగా**
**కీలకశక్తి గూర్చుకొని కేళులసల్పును దేశికుండు,తా**
**బాలకిశోరుడై సరళపాఠములన్ రుచియైన తీరులో**
**లాలనతోడ బోధనిడి లక్ష్యముజేర్చునురా! నటేశ్వరా!!** (42)

బాల్యమునందు చిన్న పిల్లల బుద్ధి పాదరసం వలె సున్నితమైన మనస్తత్వముగా కలిగి ఉంటుంది. అది పట్టుకుందామన్నా చేతికి అందకుండా పోతుంది. అదే యుక్త వయస్సుకు వచ్చిన పిదప గురువు శిష్యుని సామర్థ్యమును గుర్తెరిగి సరళ సుందరంగా చెప్పిన ప్రతీపాఠం విద్యార్థి హృదయముకు హత్తుకుని భవిష్యత్తులో తాను అనుకున్నటువంటి లక్ష్యమును శిష్యులకు చేర్చేందుకు,గురువే బాధ్యత వహిస్తాడని చెబుతారు. అంతేగాక, ఈ క్రింది పద్యాన్ని చూడండి.

**అమ్మను నాన్ననున్ వదిలి, యర్ధశరీరనువీడి, సంతతిన్**
**సొమ్మును, భూములన్ వదిలి, శూరత దేశపు సీమలందునన్**
**గ్రమ్మరి శత్రువున్ దునుమగా తనప్రాణము ధారవోసి, దే**
**శమ్మును రక్షసేయు వరసైనికుడే గదరా! నటేశ్వరా!!** (40)

ఈ పద్యము నందు దేశ రక్షణకు వెన్నెముకగా నిలిచినటువంటి వీర సైనికుని గొప్పతనమును తెలియపరుస్తూ, అమ్మానాన్నలను, భార్యను, తన కుమారులను, ధనాన్ని, తన ఆస్తిపాస్తులను అన్నింటినీ వదిలి దేశ రక్షణకై శత్రుమూకల నుండి మాతృదేశమును రక్షించుకునాలనే తపనతో, తన ప్రాణాలను పణంగా పెట్టి దేశ రక్షణ చేసే 'వీర సైనికుడే గొప్ప దేశభక్తుడు' అనే సత్యాన్ని కళ్ళ ముందు ఉంచుతారు నటేశ్వరులవారు. మరో సందర్భంలో నీటి యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ,




**పుడమినమూల్యసంపదల మూలము సారము నీరమేసుమా!**
**పదమి జలాలుత్రావుటకు పోవలె జీవనదీనదాలకై**
**కడలిని చుక్కనైన కొనగా తగదెన్నియుగాలకైన,నీ**
**కడుపునునింపు నీళ్ళనిక కావగనౌనిపుడే నటేశ్వరా!!** (55)

లోకంలో సకల ప్రాణికోటికి నీరే జీవనాధారం. అన్నం లేకుండా గడియైనా ఉండవచ్చు. కానీ నీరు లేకుండా అరక్షణం కూడా ఉండలేదు ఏ ప్రాణి. అటువంటి నీటిని వెతుక్కుంటూ ఎక్కడ నదులు ఉంటాయో అక్కడికి ఎంత దూరమైనా ప్రయాణమవుతాం కానీ, ఎక్కడైనా సముద్రం కనిపిస్తే దాహార్తిని తీర్చుకోము. కారణం అందులో మొత్తం ఉప్పునీరే ఉంటుంది. త్రాగుటకు ఒక యోగం కాదు. అందువలన నీటిని వృథా చేయడం మానవ ధర్మం అంతకన్నా కాదు. ఈ క్షణం నుండే ప్రతి నీటి బొట్టు ను కాపాడుకోవాల్సి ఉందని నరుని బాధ్యతను గుర్తు చేస్తారు రచయిత అయాచితం వారు.

మనం నడయాడుతున్న ఈ సమాజంలో అనాది నుండి నేటి వరకు ఆధిపత్యం పీఠాల క్రింద ఎన్నో వర్గాలు బానిసలుగా వెట్టిచాకిరీ విధానంలో నలిగిపోతున్న పరిణామాలను చూసిన రచయిత హృదయం చలించి ఒకచోట ఇలా అంటారు,

**దాస్యముపోయెనంచు ఘనతన్ ప్రకటింపగరాదు, నేటికిన్**
**దాస్యపు భావజాలములు దారుణబాధల ముంచుచుండెనే**
**హాస్యముగల్గజేయు జనతాధిపతుల్ ప్రకటించు వాగరుల్**
**జోస్యము జెప్పువారెవరు? చూడగనేడిలలో నటేశ్వరా!!** (64)

ఎక్కడ చూసినా అణగారిన వర్గాలు లేవు, బీదలే లేరని విషయం కచ్చితంగా చెప్పలేము కదా! ఇంకా వెట్టిచాకిరి విధానం అక్కడక్కడ ఉంది. అది చూసినప్పుడల్లా హృదయం ద్రవించిపోతుంది. కానీ జననేతలైన నాయకులు ఇటువంటి వారిని ఎందుకు ఆదరించరు? ఈ సమస్యను పరిష్కరించే మార్గదర్శి ఎవరు? అని రచయిత తన ఆవేదనను వ్యక్తపరుస్తారు. నేటితరం సాహిత్య లోకం తన సృజనలను ఏ విధంగా ప్రకటిస్తుందో ఈ క్రింది పద్యాన్ని ఒకసారి ఆస్వాదించ వలసిందే.

**పెన్నును పేపరున్ విడిచి విశ్వమునేడు కరస్థ సెల్లునే**
**పెన్నుగజేసి వార్తలను ప్రీతిగకైతల బంపుచుండె,సం**
**పన్నత వర్ధిలన్ నవనవమ్మగు యాంత్రిక మాధ్యమంబులన్**
**సన్నిహితంబొనర్చుకొని సాగుచునుండెనురా! నటేశ్వరా!!** (82)

చేతిలో తెల్ల కాగితం, పెన్నుతో అవసరం లేకుండా సెల్లు ఫోను మాయాజాలంలో పడి, కవితలైనా ,పాటలైనా తన ఆలోచనకు వేదిక చేసుకుని కవిత్వాన్ని రాస్తున్నారు. మనిషి దినం దినం ప్రత్యక్ష కార్యాచరణలో కాకుండా,యాంత్రిక జీవన విధానానికి దగ్గరై, దాని వ్యామోహంలో పడిపోయి, ఇదే జీవితమనే భ్రమలో మునిగి తేలుతున్నాడు స్వామీ! అని ఆ నటేశ్వరునికి విన్నవించుకుంటున్నారు అయాచితం వారు.

సమాజం అంతా చెడిపోయింది, అస్తవ్యస్తంగా మారిపోయింది, అని నిరంతరం తపిస్తుంటారు కొందరు. అటువంటి దుర్భావన గల వారికి సమాధానంగా చెప్పే ఈ పద్యాన్ని ఒకసారి చూడండి,

**కాలముమారినన్ తనవికాసము మారనివాడు,రమ్యవా**
**గ్జాలముతో జనావళిని చక్కని దారుల నిల్పువాడు,స**
**ఛ్ఛీలముతో సమస్తమును చిన్మయమోదతనింపువాడు,ది**
**వ్యాలయరీతి సేవ్యుడయి హర్షముతో వెలుగున్ నటేశ్వరా!!** (87)

కాలం మారినా తన అభివృద్ధిని కుంటుపడనివ్వకుండా చూసుకునేవాడు, మధురమైన తన సంభాషణతో నిత్యం అందరితో సహృదయంతో పలకరించేవాడు, ఎప్పుడు ఇతరుల సంతోషమే తన సంతోషమని భావించేవాడు, ఒక్కడుంటాడు. అటువంటివాడు ఈ భూమండలంపై ఎక్కడికి వెళ్ళినా గౌరవింపపడడమే కాకుండా, ఆనందంగా ఉండగలడని గుర్తు చేస్తున్నారు రచయిత.

మానవుడు నిజజీవితంలో ఎంతో ఉన్నతమైన భావనతో వెలసిల్లినప్పుడే మానవ మనుగడ ప్రగతి సాధ్యమవుతాయని రుజువు చేసే ఈ పద్యమును ఒకసారి చూద్దాం!

**కల్లలుపల్కరాదు,కనుగానని తీరుగనుండరాదు, పెన్**
**ముల్లెలుగోరి యక్రమపు మోహపుదారినివట్టరాదు,రా**
**జిల్లని నిష్ప్రయోజనపు జీవితమున్ గడుపంగరాదు,తా**
**నెల్లరి సౌఖ్యశాంతుల సమీక్షకనుంగొననౌ నటేశ్వరా!!** (93)

మనిషి ఎప్పుడు అబద్ధం ఆడరాదు.అందరినీ సమదృష్టితో చూడాలి.ధన వ్యామోహంతో అడ్డదారులు తొక్కారాదు. పనికిరాని ప్రయోజనములను పొందుటకు ఎప్పుడు ఆశపడకూడదు. **'అందరి సంతోషమే తన సంతోషమని ఎవరైతే భావిస్తారో ఓ నటేశ్వరా! అటువంటి వారే ఉత్తములు'** అనే సందేశమును చెప్పకనే ఈ పద్యము నందు వెల్లడిస్తారు అయాచితం వారు. అలాగే లోకంలో ఎందరో కుహనా మేధావులు మేం పండితులమని గొప్ప రచయితలమని విర్రవీగే వారికి సమాధానంగా, కృతి అంటే ఏది కృతీయో,మంచి కృతి ఎట్లా నిర్ధారింప పడుతుందో ఈ పద్యం చూడండి.

**సత్కృతియన్న మంచికృతి, సత్కృతియన్న కవీశ్వరుండహెూ!**
**సత్కృతియన్న మంచిపని, సత్కృతియన్న వరేణ్య ధర్మమే**
**సత్కృతియన్న నీశ్వరుడు, సత్కృతియన్న వరిష్టదానమే**
**మత్కృతులెల్ల సత్కృతులు మంగళభావనలే నటేశ్వరా!!** (84)

కృతి అనే పదమునకు వ్యవహర్తలు ఎన్నో నిర్వచనాలు ఇచ్చినప్పటికీ, నటేశ్వరునిసాక్షిగా అయాచితం వారు సరికొత్త నిర్వచనంను తెలియజేసి, పండిత లోకం కళ్ళు తెరిపించారు.ఒక మంచి కృతిగా చెప్పడం అంటే ఒక మంచి కావ్యం. సత్కృతి అంటే కవీశ్వరుడు.సత్కృతి అంటే ఒక మంచి పని. సత్కృతి అంటే గుణసంపన్నుల జీవన సరళి. సత్కృతి అంటే ఈశ్వరుడు. సత్కృతి అంటే ప్రేమపూర్వకమైన దానం. ఇవన్నీ ఒకరకమైనవే అయినప్పటికీ,'తన రచనలన్నీ సత్కృతులే' అని చెబుతూ, వారి రచనా విధానం పైన ఉన్న సాధికారికతను ప్రకటిస్తారు అయాచితం వారు.

ఇక్కడ ఒక కార్య దక్షునికి, ఒక కవికి, రచయితకు ఉండవలసిన దిషణ ఎటువంటిదో ప్రకటిస్తారు. అసలు ఈ చరాచర సృష్టికనిపించే మానవ మనుగడ మొత్తం సర్వకాల సర్వావస్థల యందు సజావుగా, నిరాటంకంగా సాగిపోవుటకు కేవలం శబ్దం ఒక్కటే ప్రధాన హేతువని, వాక్కుకు ఉన్నటువంటి గొప్పతనం ఎటువంటిదో తెలియజేసే ఈ పద్యాన్ని వినాలి మరి.

**గిరులు తరుల్ సముద్రములు గీతలు రాతలు నిల్చుదాక, నీ**
**వరకవితా విలాసములు వాఙ్మయదీప్తుల వెల్గిపోవుచున్**
**నరులకుదారిచూపు నభినవ్యపురోగతి సాగిపోయెడిన్**
**ధరణిని నిల్పు శబ్దమయ ధామమదొక్కటియే నటేశ్వరా!!** (107)

ఈ భూమండలం పైన పర్వతాలు, చెట్లు, నదీ నదములు, ఇతిహాసములు, వేద పురాణములు నిలిచే వరకు కవిత్వం సజీవ స్రవంతి వలె పారుతూనే ఉంటుంది. నిత్యం కొత్త కాంతులను ప్రసరింప చేస్తూనే ఉంటుంది. అంతేకాకుండా మానవాళి పురోగామి పథం వైపు అడుగులు వేసే విధంగా ప్రేరణ అందిస్తుంది. చివరకు ఈ భూమిపై సత్య వాక్కు ఒక్కటే నిలిచిపోతుంది. మనం లేకపోయినా మన గొప్పతనాన్ని ప్రకటింప చేస్తుందని తెలియజేసే పద్యం ఇది.

ఈ విధంగా మొత్తం 108 మధ్య రత్నములతో అలరారుతు, నటరాజైన ఆ పరమేశ్వరుణ్ణి కొనియాడబడుతూ, ఆత్మ ప్రబోధాత్మకమైన సద్భావనలతో రసహృదయుల మనసును రంజింప చేయడమే కాకుండా, ఎల్లరకు వర్తింపజేసేటువంటి భావనారాశి ఈ శతకము నందు కొదవలేదనేది పరమ సత్యం. ఈ నటేశ్వరా! శతకం, శతక సాహిత్య చరిత్రకు ఒక మకుటాయమానంగా వెలుగొందుతుంది అనడంలో రవ్వంత కూడా సందేహం లేదు. వర్తమాన సాహిత్య లోకానికి ఎంతో ఉపయోగకరమైన ఈ శతక రాజమును ప్రతి ఒక్కరూ చదవవలసిన అవసరం ఎంతైనా ఉంది.

❖ ❖ ❖ ❖ ❖

# తం సూర్యం ప్రణమామ్యహమ్

**సాగి కమలాకర శర్మ,** అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704227744


**సప్తాశ్వ రథమారూఢం ప్రచండం కశ్యపాత్మజమ్ ।**
**శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణామామ్యహమ్ ॥**

సూర్యుడు జగత్తుకు ఆత్మవంటివాడు. అందరికీ సంతోషాన్ని కలిగించేవాడు. సూర్యశక్తే మనకు, మనం నివసించే భూమికి కూడా ఆధారం. భూమికి వెలుగును, వేడిమిని అందించి అన్ని విధాలుగా ఆరోగ్యాన్ని కలిగించే వాడు. సూర్యునిలోని అద్భుతమైన శక్తి భూమికే కాకుండా, నవగ్రహాలకు కూడా ఆధారం. సూర్యశక్తి ఓజోన్ పొర (హిరణ్యప్రాకారం) ద్వారా భూమికి చేరడం వల్ల సూర్యునికి సంబంధించిన వేరు వేరు రంగులు మనకు కనిపిస్తుంటాయి. ఈ హిరణ్యప్రాకారంలోని సూర్యుని వెలుగునే వేదంలోని శ్రీసూక్తం వర్ణించింది. హిరణ్యప్రాకారం లోపల ఉన్న సూర్యశక్తి 'ఆర్ద్ర'గా, బయటి సూర్యశక్తి 'జ్వలంతి'గా దర్శనమిస్తుంది. శంకరుల వారు స్థాపించిన షణ్మతాలలో 'సౌరం' కూడా ఒకటి. వారు సూచించిన పంచాయతన పూజా విధానాలలో సూర్యుని పూజ ప్రత్యేకమైంది. వైదిక కాలం నుండి నేటివరకు సూర్యుని దైవంగా భావించిన సంప్రదాయం భారతీయులది. సూర్యశక్తిని వేరు వేరు రూపాల్లో ఉపాసిస్తున్నదీ హైందవ జాతి. సూర్యుడు తాను కదలకుండా ఉండి, లోకాలను కదిలించేంత శక్తి కలిగి ఉంటాడు. ఒక మౌని, ఒక యోగి, ఒక ధ్యానిలా సూర్యుడు మనకు కనిపిస్తాడు. మనస్సును ఊర్ధ్వముఖం చేసి సూర్యుని శక్తితో, సూర్యునితో సంగమింపజేస్తూ రోజూ కూర్చుంటే దానిని సూర్యోపాసన అంటాం. అది అధికసమయం చేయడం ద్వారా సూర్యశక్తి మన శక్తిగా మారుతుంది. కాలక్రమంలో జ్ఞానం, శక్తి, తేజస్సు, ఆరోగ్యం, ప్రకాశం, ఆనందం మనకు క్రమంగా పెరుగుతూ ఉంటాయి.

మనం తినే ఆహారం కూడా సూర్యకిరణ ప్రసాదమే. భూమిపైన, లోపల ఏర్పడే ఎన్నో మార్పులకు సూర్యకిరణాలే కారణం అవుతాయి. అందుకే ఐశ్వర్య స్వరూపుడు ఆ ప్రభాకరుడు. సప్తాశ్వాల రూపంలో ఏడు రకాల కాంతులను భూమిపై ప్రత్యేకంగా ప్రసరింపజేస్తూ అన్ని జీవుల జీవితాలలో వెలుగులు నింపుతున్నవాడు సూర్యుడు మాత్రమే. అందుకే ఉపనిషత్తులు సూర్యుని జగత్తుకు ఆత్మగా వర్ణించాయి. ఆ కిరణాలే మనకు కాంతిని, శాంతిని ఇస్తాయి కాబట్టి ఆ కాంతికారకుడైన ప్రభాకరునికి చేసే నమస్కారం మనలోని సకల దోషాలను తీసివేసి ఆనందాన్నిస్తాయి.

మన శరీరం కూడా పూర్తి సౌర మండలమే. మన హృదయం, ప్రసరణ వ్యవస్థలు రవికి ప్రతీకలు. మనస్సు, ఇంద్రియాలు, జీర్ణ వ్యవస్థలన్నీ చంద్రునికి ప్రతీకలు. అదేవిధంగా నర్వస్ సిస్టమ్ కు బుధుడు; హార్మోన్‌ల వ్యవస్థకు శుక్రుడు; ఎముకలు, కండర కణజాల వ్యవస్థలకు కుజుడు; విసర్జక వ్యవస్థ, శ్వాస వ్యవస్థలకు శని; దురాశకు రాహువు; నిరాశకు కేతువులు సంకేతాలుగా, కారణాలవుతున్నాయి. భూమి చుట్టూ ఉన్న గ్రహాలు భూమికి వేరు వేరు దిశల్లో ఉన్నప్పుడు భూవాతావరణంలో మార్పు వచ్చినట్లుగానే, మన జాతకాలలో ఉన్న గ్రహాలు లగ్నానికి వేరు వేరు దూరాల్లో ఉన్నప్పుడు ప్రభావాలు వేరుగా ఉంటుంటాయి. ఎప్పటికీ ప్రభావం అనుకూలంగానే ఉండాలంటే ఆ యా గ్రహాలకు అధినాధుడైన సూర్య భగవానుని ప్రార్థించడం మంచిది.

సూర్యుని శక్తి సూర్యోదయ కాలంలో 'బాల' గా, డి.విటమిన్ అందిచే కిరణం 'గాయత్రి'గా, కిరణజన్య సంయోగ క్రియ ద్వారా ఆహారాన్ని అందించే కిరణం 'అన్నపూర్ణ'గా, భూమిపై




పడుతున్న తెల్లని వెలుగువల్ల కలిగే జ్ఞానం 'సరస్వతి'గా, భూమిపైన ఎన్నో సంపదలకు మూలం కావడం వల్ల 'లక్ష్మీదేవి'గా, ఓజోన్ పొరలోని పాంచభౌతిక శక్తిపై పడే ప్రసారం 'శ్రీమాత' (లలిత)గా, వ్యతిరేకతలను ఎదుర్కొనే రోగనిరోధక శక్తిని ఇచ్చే కిరణం 'దుర్గ'గా, సమాజంలోని అంటువ్యాధుల వంటివానిని తొలగించే సూర్య కిరణ శక్తిని 'మహిషాసుర మర్దని'గా, తన ఉపాసన ద్వారా తల ఎత్తి చూడగలిగే ఉన్నత విధానాన్ని ఇచ్చే కిరణ శక్తి 'రాజరాజేశ్వరి'గా దర్శనమిస్తుంది. ఈ మూర్తులకు మనం ప్రతి నవరాత్రుల్లోనూ ప్రత్యేక పూజలు చేస్తూ సూర్యశక్తికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం.

సూర్యుని ఉపాసన కవులు ఎందరో వేరు వేరు రూపాల్లో చేశారు. ఆ వెలుగుకు స్పందించి, పొంగిపోయి ఎన్నో శ్లోకాలు, శతకాలు, కవితలు రాసినారు, రాస్తూనే ఉన్నారు. అటువంటి విశిష్టమైన పద్యమాలిక డా.

అయాచితం నటేశ్వర శర్మగారి 'సూర్య స్తుతి'. రోజూ ఉదయకాలంలో సూర్యుని చూస్తూ, ఆరాధన చేస్తూ, మనసులో ఉపాసిస్తూ అద్భుతమైన పద్యాలను అందించినారు. స్వయంగా కవి, అవధాని కావడం వల్ల ఈ పద్యాలలో విశేషాలు ఎన్నో తొంగి చూస్తున్నాయి.

**"సూర్య కిరణము లేకున్న సొగసు లేదు / దివికి భువికిని సంధాన దీప్తి రాదు"** అంటూ సూర్యుని ప్రత్యేకతను తెలియజేస్తూ ప్రారంభమైన ఈ పద్యమాలికలో ఎన్నో ప్రత్యేకతలను సూర్యునికి ఆపాదింప జేశారు శర్మగారు. సూర్య కిరణాన్ని వర్ణించిన విధానం ఒకసారి గమనిస్తే ..

**"శర పరంపరవోలిక సాగివచ్చు**
**కిరణ శరములు నేలపై కీడు తొగ**
**కల్మషములను ద్రోయుచు కాంతులొసగి**
**నిర్మలాంబర ప్రతిబింబ నిష్ఠ వెలిగె!"**

**"కిరణ చరణము సంసార తరణమనుచు**
**కిరణ చరణము ప్రగతికి వరణమనుచు**
**కిరణ చరణము పుణ్యాల కరణమనుచు**
**కిరణ చరణము స్పృశియింతు వరము వోలె!"**

సూర్య కిరణాల ప్రభావాన్ని నిత్యమూ అధ్యయనం చేసి, అనుభవ సత్యాలను తెలియజేసిన విధానమే కాకుండా, 'కిరణ చరణ' ప్రయోగం ఈ కవితలో అత్యంత రమణీయంగా, నూతనంగా కనిపిస్తుంది.

ఈ పద్యమాలికలోని కొన్ని ప్రత్యేక ప్రయోగాలు గమనిస్తే ఈ కవికి సూర్యునిపై గల శాస్త్ర, సామాజిక విజ్ఞానం మనకు అవగతమవుతుంది.

**"సూర్యుని వంటి మిత్రుడిల చూడగనెవ్వడు కానరాడు .."**

**"ఏండ్లు గడచును పృథ్విపై యెదిగి యెదిగి**
**కాలమే డోలికై యూగు తేలిపోయి"**

**"తాపమే యంబుదమ్ముల దీపమగును"**

**"ఒక్క మాటైన పల్కక సుర్వికెపుడు**
**క్షేమమందించు వాడవు శిఖర భాస"**

**"తూరుపు యెర్రబారినది తోయరుహానన మోము కైవడిన్..."**

**"నీ శ్రీకర పూర్ణమాలికల జేకొని సాగును పంచభూతముల్..."**

**"నిన్ను స్మరియించకున్నచో నిద్రరాదు**
**నిన్ను స్తుతియించకున్నచో నిద్రపోదు.."**

**"తరణి కిరణాల చరణాలు తాకనట్టి**
**యొక్క అణువైన నున్నదే ఉర్వీమీద.."**

**"ఇనుడు లేకున్న యే ప్రాణి మనగ లేదు**
**ఇనుడు రాకున్న యే ప్రాణి యెదగబోదు"**

**"రాత్రి యలిగిన ప్రియురాలి బ్రస్తుతించి**
**ముద్దు మాటల తోడగ ముచ్చటించి**
**ఫాల తలమును ముద్దాడి వగలు దీర్చి**
**వరలు ప్రియువోలె వెల్గె ప్రభాకరుండు!"**

**"లోకయాత్రయే వ్రతముగ సాగువానికి ప్రభాత నమస్కృతి జేతు నిత్యమున్"**

**"ఎవరు ప్రశంస చేసినను ఏమనుకున్నను సూర్యుడాగునే?"**

**"కవి తరణిన్ హృదబ్జమున గాంచెడివాడు గదా మనోజ్ఞుడౌ!"**

**"తాపము పెంచువాడె పరితాపము బాపుననంగ సత్యమౌ ..."**

వంటి వాక్యాలు కోకొల్లలు. ప్రతి పద్యంలోనూ అపూర్వమైన నూతనత్వాన్ని, వైజ్ఞానిక విధానాన్ని తెలియజేశారీ కవివరేణ్యులు. సూర్యుడే సకల జ్ఞానాలకు మనకు మూలం. సకల కవితలకూ మూలం. అతని ప్రేరణ లేకుంటే ఏదీ ముందుకు జరగదు. పద్యరూపంలో సూర్యుని ఉపాసన ఈ కావ్యం నిండా మనకు కనిపిస్తుంది. ఇంతేకాదు ఈ పద్యాలను పారాయణం చేసుకున్నా పుణ్యం వస్తుంది.

ఒకానొక చోట అత్యంత దీర్ఘమైన సంస్కృత సమాసాలు కనిపిస్తూ, గ్రీష్మంలోని సూర్యుని తాపాన్ని ఈ కవితలు గుర్తు చేస్తున్నాయి. మరి కొన్ని ప్రయోగాలు చలికాలంలో సూర్యుని సాంగత్యాన్ని కోరుకునే జనాల హృదయాలలాగా చిన్న తెలుగు వాక్యాలు కనిపిస్తూ ఎంతో భావదీప్తంగా కనిపిస్తున్నాయి. ఇంకా సూర్యావధాని, నవరత్నాలపై ప్రభావం, సూర్య రాగహేల, గ్రహాలపై అనురాగం, అచ్చతెలుగు వర్ణనలు, నభోంగణ సూర్య సార్వభౌముడు, పద్మినీ ప్రియుడు, ఖగోళ ప్రియ నాయకుడు, సూర్య ప్రసూనాష్టకము వంటి ఎన్నో పద్యాలు మనను అలరింపజేస్తున్నాయి. రాసిన ప్రతి పద్యంలోనూ సూర్యుని ప్రత్యేకతలను వినూత్నంగా తెలియజేసినారీ నటేశ్వరులు. ఈ లోకంలోని అపూర్వమైన నటనలకు సాక్షియైన సూర్యుని తత్త్వాన్ని, నటేశ్వరులు కాక ఇంకెవరు దర్శించగలరు.

సూర్యుని ఆరాధన, స్తుతి, నమస్కారం ఏ రూపంలో చేసినా, తలచినా తప్పక వారికి మేలు కలుగుతుంది. శారీరకమైన ఆనందమే కాకుండా, అపురూపమైన జ్ఞానం కలుగుతుంది. ఈ సూర్యస్తుతి పద్యమాలికను ఆసాంతం చదివినా, విన్నా అటువంటి పుణ్యం మనకందరికీ కలుగుతుంది. ఇక అనుభవించి అక్షర రూపం ఇచ్చిన వారిని, చదివిన వారిని ఆ సూర్యుడు తప్పక ఆయురారోగ్యాలతో ఆశీర్వదించక ఉంటాడా! అస్తు!

**(అయాచితంవారి సూర్యస్తుతి పద్యమాలికకు ముందుమాట)**

❖ ❖ ❖ ❖ ❖

# మా నాన్న

**కౌముది, జాహ్నవి, యామిని,** అయాచితం వారి పుత్రికా రత్న త్రయం.

మా నాన్న ఒక వటవృక్షం. ఆయన నీడలో మేము పిల్ల మొక్కలం. గడ్డి పరకలం. ఆయన పేరే మా పరిచయం. ఆయన కవితలే మా ధనం.

రథాల రామారెడ్డి నుండి వెంకటేశ్వరుని సన్నిధి తిరుమల వరకు నాన్న విద్యాభ్యాస ప్రయాణం ప్రతి విద్యార్థికి అనుసరణీయం... ఆదర్శప్రాయం.

నాన్నగారి విద్యాభ్యాసం తిరుమల తిరుపతి వేద పాఠశాలలో మహర్షుల వంటి వేద పండితులు, వ్యాకరణ శాస్త్ర ఉద్దండుల మధ్య, స్వచ్ఛమైన ప్రేమ తనకు తన మిత్రుల వద్దనుండి దొరికిందని చెప్తూ కళ్ళనీళ్లు పెట్టుకునేవారు నాన్న.

వేంకటేశ్వరుని సన్నిధిలో సుప్రభాతం పాడడం, అభిషేకానికి జలం తీసుకురావడం, జాబాలి తీర్థంలో సేవకి వెళ్లడం వంటి ఎన్నో అపూర్వమైన సందర్భాలగురించి చెప్పేవారు. మేము కళ్ళు, చెవులు వెయ్యి చేసుకొని అనుభవించేవాళ్ళం. ఈ తిరుమల విశేషాలన్నీ మేము ఊహాలోకాల్లో ఏడుకొండలూ సందర్శించేవాళ్ళం.

ఎస్వీ యూనివర్సిటీలో నాన్న చేతివ్రాతను అభిమానించి, ఎంతోమంది అనుకరించేవారట. ఎక్కడ చూసినా గోడలనిండా నాన్న చేతిరాతలే ఉండేవట.

నాన్న, మేము ముగ్గురం ఆడపిల్లలమైనా ఎన్నడూ మమ్మల్ని ఆచారవ్యవహారాలలో నియంత్రించలేదు. తప్పు చేయకపోతే దేనికీ భయపడొద్దని, బాగా చదువుకోవాలని, చదువే అసలైన ధనమని, వయసుతో చదువుకు అడ్డంకి లేదని, ముఖ్యం గా ఆడపిల్లలు బాగా చదువుకొని ఆర్థిక స్వాతంత్రం తో ఉండాలని చెప్పేవారు.

మేము సాహిత్యం కాకుండా వేరే చదువులు చదివినా ఎంతో ప్రోత్సహించేవారు.

నాన్న స్వేచ్ఛావాది. మనసుకు కష్టపెట్టుకుంటూ బ్రతకొద్దనేవారు. సవ్యమైనది, ఏదైనా చెయ్యమనేవారు. కానీ ఒత్తిడులకు తలొగ్గి ఆత్మవంచన చేసుకోవద్దనేవారు.

ఆచార వ్యవహారాల్లోనే ఆధ్యాత్మికత ఉండదనేవారు. నాన్న మానసిక ఆరాధన, మానస పూజలని ఎక్కువగా చెప్పేవారు, ఆచరించేవారు.

మాకు చిన్నతనం లోనే మా తాతగారు, అంతరాజ శర్మ గారు యజుర్వేద సంధ్యావందనము, గణపతి అథర్వశీర్షము, ఆదిత్య హృదయం నేర్పించారు. ఆయన ఆడపిల్లలమైనా ఇవన్నీ మాకు నేర్పించేవారు. మమ్మల్మి ముగ్గురమ్మలుగా ప్రేమతో పిలిచేవారు.



నాన్నకి ఉన్న ఈ ఆలోచనా స్వేచ్ఛ తాత నుండి వొచ్చిందేమో అనిపిస్తుంది.

మా చిన్నతనం అంతా సంగీతం, సాహిత్యాల మధ్య నడిచింది. ఇంటా బయటా హిత సాహితీ, జాతీయ సాహిత్య పరిషత్ సమావేశాల్లో ఎంతో విశిష్టమైన పండితులు, సాహితీ వేత్తల గోష్టులకు ప్రార్థనా గేయాలు పాడడం, వచ్చిన వారికి టీ, నీళ్లు అందించడం తోనే మాకు కొంత సాహితీ సౌరభం కొంతైనా అంటింది.

నాన్నకి అనారోగ్యం అని తెలిసినప్పుడు కూడా ఆయన డీలా పడడం చూడలేదు. కానీ తనలో నిరంతరంగా పొంగుతున్న భావఝరి ని అక్షర రూపంలో పెట్టలేకపోవడం ఆయనను చాలా బాధించింది. ఎప్పుడైతే రాయడం ఆగిపోయిందో ఆయన మొహం లో నవ్వు మాయమైంది.

నాన్నలో చాలా సార్లు రెండు పార్శ్వాలు చూసేవాళ్ళం.

తన మనసుకు నచ్చింది మాత్రమే చెయ్యడం, ఆచారాలను పాటించడంలో స్వేచ్ఛ ఉండాలనుకోవడం, తన కవితాధారాలతో నిరంతరంగా సభలు, సమావేశాలు, రచనలు, పుస్తకప్రచురణలు, తనకు కాలానుగుణంగా పెరుగుతున్న ఆదరణ, కీర్తి.... ఇవన్నీ ఆస్వాదించడం.

శంకరుల అద్వైత భావనతో తను రాస్తున్న స్తోత్రాలు మనందరిలోని శివునికే అనీ, ఆ శివుడి కటాక్షం ప్రతి ఒక్కరి మీద ఉంటుందని నమ్మేవారు. ఒక్కోసారి ఆయన కవితలు రాస్తూ కూర్చున్నప్పుడు ధ్యానంలో ఉన్న మాదిరిగా కనిపించేవారు.

నాన్న ఎన్నడూ ఏ పనులనూ వాయిదా వేసేవారు కారు. పని ఉందంటే అయిపోవాల్సిందే. ఈ కార్యదీక్ష వల్లనే తీవ్ర అనారోగ్యం

తో కూడా **"సౌందర్య లహరీ సౌందర్యం"** పుస్తకం రాయగలిగారు.

నాన్న ఏ విషయాన్నైనా అప్పటివరకే ఆలోచించేవారు. ఏదైనా బాధాకరమైన సంఘటన ఉన్నా దాని గురించి ఆలోచించేవారుకాదు. కాన్సర్ విషయం లోను అంతే, మన చేతుల్లో లేని దాని గురించి బాధపడడం ఇష్టం ఉండేది కాదు. ఒక్కనాడు కూడా తన అనారోగ్యాన్ని గురించి ఆసక్తి చూపేవారుకాదు.

అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆ సూర్య భగవానునికి ప్రతి రోజూ ఒక పూజ పుష్పంగా కవితా పుష్పాన్ని రచించారు.

ఎన్ని జన్మల ఫలమో, నాన్నకి ఆ ఏడుకొండలవాడి దయ సంపూర్తిగా లభించింది. ఆ స్వామి కార్యం చేయడానికి తాతకి, (అనంతరాజ శర్మ గారు) నాన్నను తిరుమలకు పంపించాలనే సంకల్పం కలగడం, ఈరోజు మనం చూస్తున్న మా నాన్న సాహితీ వనానికి బీజామృతం.

నాని ఆశీస్సులు, ఆమె ప్రేమ, వాత్సల్యం, నాన్నను ఎటువంటి అడ్డంకులు లేకుండా విద్యాభ్యాసం పూర్తి కావడానికి కావలసిన ఔషధిగా మారినాయి.

ఈరోజు ఈ వనం పెరిగి ఇంతగా సాహిత్యపు పరిమళాలతో నిండడానికి నాన్న గురువులు, (చేబ్రోలు వారు తదితరులు) తోటమాలి లాగా సహకరించినారు.

దీనికి నాన్న కామారెడ్డి కి వచ్చినతర్వాత ఓరియంటల్ కళాశాల సహ అధ్యాపకులు వాచస్పతి సర్, అనంతకుమార శర్మ సర్, రామస్వామి సర్ ల అద్భుత సాంగత్యం మరిన్ని పరిమళాలను జోడించింది.

తిగుళ్ల వెంకటేశ్వర శర్మ తాత గారి పాండిత్యం, ఆయన కళాదృష్టి వల్ల మరింత వన్నె తెచ్చింది.

గుమ్మన్నగారి లక్ష్మి నరసింహ శర్మ పెద నాన్న గారి ఆశుకవిత్వం, అవధానాలు, సాహితీ కార్యక్రమాలతో జిల్లా మొత్తం గుబాళించింది.

ఇటువంటి జ్ఞానం సౌరభాల మధ్య మేము పెరగడం నిజంగా మా అదృష్టం.

చివరగా అయినా అమ్మ, నాన్న వెనక ఉండి అందించిన సహకారం, ప్రోత్సాహం, తోడుపాటు ఎట్లా నాన్నకు సహకరించి నాయంటే అందమైన సంపెంగ పువ్వుకు కమ్మని పరిమళాన్ని అద్దినట్టు అయ్యింది.

స్వతహాగా నాన్నకు ఉన్న కళ, నిబద్ధత, నిరంతర అభ్యాసం, కవిత్వం పట్ల ఉన్న అభిలాష నాన్నను ఈరోజు ఈ స్థాయిలో నెలబెట్టాయి.

నాన్న వారసత్వం మేము కొనసాగించలేక పోయినా, నాన్నతో ఉన్నందుకు, ఈ సాహితీ వనం లో మాకు కూడా ఆ పూల పరిమళం అంటితే అదే పదివేలు...

నాన్న లేకపోయినా, నాన్న కవితా నాదాలు నిరంతరం వినిపిస్తూనే ఉంటాయి...

సాహితీ ప్రియులను తరింపజేస్తూనే ఉంటాయి.

క్రమ శిక్షణ, నిరంతర కృషి, నిబద్ధత, కార్యశీలత, సమయ పాలన కి నిర్వచనం మా నాన్న జీవితం. ఏదైనా సాధించాలనుకుంటే ప్రతి క్షణాన్ని పూర్తిగా ఎలా సద్వినియోగం చేయగలమో మా నాన్న జీవితాన్ని పరిశీలిస్తే మనకు అర్థం అవుతుంది. సమయం లేదు అని అయన ఏ రోజు కూడా అనేవారు కాదు. విజయానికి కానీ అపజయానికి కానీ బాధ్యులం మనమే అని పూర్తిగా నమ్మేవారు. భగవద్గిత లో శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన 'కర్మణ్యేవాధికారస్తే' అనే శ్లోకం యొక్క భావం మా నాన్న చేసే ప్రతి పనిలో ప్రతిబింబించేది. నిరంతరం కార్య శీలత తో తాను అనుకున్న పని చిన్నదైనా పెద్దదైనా ఒకే నిబద్ధత తో చేసేవారు.

మా నాన్న నిత్య విద్యార్థి . పుస్తకాలు చదవమని మాకు ఎప్పుడు చెప్తూ ఉండేవారు. తెలుగు సంస్కృత సాహిత్యానికి సంబంధించినవే కాకుండా సైన్స్, ఆస్ట్రోనమి పుస్తకాలు బాగా చదివేవారు. వేసవి కాలం సెలవులలో ఇంటి పైన రాత్రి ఆకాశాన్ని చూస్తూ మాకు అంతరిక్షం లో ఉన్న అద్భుతాల గురించి చెప్తూ ఉంటే ప్లానిటోరియం లో ఉన్నట్టుగా మేము అనుభూతి చెందేవారం.

మా ఇల్లు నిరంతరం సంగీత కచేరిలు, సాహిత్య గోష్ఠులతో మునిగి ఉండేది. రస హృదయం లేని వారు శాప గ్రస్తులని నాన్న అంటూ ఉండేవారు. తబలా వాయిస్తూ మా నాన్న పాటలు పాడుతుంటే మేము మంత్రముగ్ధులై వినేవాళ్ళం. సామాజిక విషయాలపై చర్చ జరుగుతున్నప్పుడు చిన్నపిల్లలం అయినా మా అభిప్రాయాలకు సమానమైన విలువనిచ్చేవారు.

మా నాన్నకి భేషజాలు లేవు. ఇంటికి బంధువులు వచ్చినపుడు అందరం కూర్చొని మాట్లాడుతూ ఉంటే టీ చేసి అందించేవారు. మా చిన్నతనంలో అమ్మ స్కూల్‌కి హడావిడిగా తయారవుతూ ఉంటే మాకు తల దువ్వడం, బొట్టు పెట్టడం వంటివి చేయడం నాకు బాగా గుర్తు. భర్త భార్య ఇద్దరు సమానం అని, అన్ని పనులు అందరు చేయొచ్చు అని ఆ కాలం లోనే నాన్న నమ్మేవారు. ఆరోగ్యం బాగా లేక నేను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రోజుల వయసు ఉన్న మా అమ్మాయి లాస్యని ఇంట్లో ఉంచాల్సిన అవసరం వచ్చినప్పుడు ఒక తల్లి తన పిల్లని ఎలా చూసుకుంటుందో అలాగే చూసుకున్నారు.

మా నాన్నకి మా పై ప్రేమ ఆకాశమంత. దానికి అవధులు లేవు. మాకు ఏ అవసరం వచ్చినా తన శాయశక్తులా మాకు తోడు గా ఉండేవారు. మాకే కాదు, తన విద్యార్థులందరికీ మా నాన్న పెద్ద అండ. తన చివరి దశలో కూడా తాను నొప్పి అంటే మేము ఎక్కడ బాధ పెడతామో అని ఏమి చెప్పేవారు కాదు. తాను ఎక్కువ కాలం బ్రతకానని డాక్టర్లు చెప్పినప్పుడు, ప్రతి జీవికి మరణం తప్పదు,

దాని గురించి బాధ పడడం వలన ఏ మాత్రం లాభం లేదని మాకు నచ్చచెప్పేవారు. వారి ధైర్యం మాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించేది.

తనకి ఎక్కువ సమయం లేదు అని తెలియగానే మేము హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ ఉంటే తాను మాత్రం డాక్టర్స్ తో సంబంధం లేనట్టుగా తన పరిశోధనా గ్రంథం సౌందర్య లహరీ సౌందర్యం ప్రచురణకు అనుక్షణం శ్రమించడం మాకు వింతగా అనిపించేది.

నాన్న ఇంత తొందరగా మమ్మల్ని వదిలి వెళ్లడం మాకు తీరని లోటు. ఆయన ఇంకా కొద్దీ రోజులు ఉండగలిగితే ఇంకా ఎన్నో గ్రంథాలని రచించేవారు, ఇంకా ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిని ఇచ్చేవారు. ఆయన నిర్దేశించిన మార్గంలో నడుస్తూ, ఆయన నేర్పించిన విలువలను మా తరువాత తరానికి అందజేయడమే ఇప్పుడు మా కర్తవ్యం.

మా నాన్న అయాచితం నటేశ్వర శర్మ గారు అందరికీ ఒక గొప్ప కవి గా సుపరిచితులు. ఇంట్లో మాత్రం మాతో చాలా చనువు గా ఉండేవారు. ఏనాడూ మేము ఆయన ముందు భయంతో మెలగాలని ఆశించలేదు. మా పిల్లలతో కూడా చిన్నపిల్లవాడి లాగ ఆడుకునేవారు. మా చిన్నతనం లో మాతో ఆడుతూ పాడుతూ ఎన్నో పాటలూ, పద్యాలూ నేర్పించేవారు. మమ్మల్ని కూచోబెట్టి “నువ్వు కథ చెప్పమ్మా, నేను రాస్తాను” అని మేము చెప్పే అర్థం-పర్థం లేని కథలని కూడా శ్రద్ధగా మేము చెప్తూ ఉంటే రాసేవారు. మళ్లీ ఆ కథలన్నీ చదువుకుంటూ బాగా నవ్వుకునేవాళ్లం.

సంక్రాంతికీ, ఉగాదికీ జరిపే కవి సమ్మేళనాలల్లో మమ్మలని ఏదో ఒక కవిత రాయమని ప్రోత్సహించేవారు. మా పెద్ద అత్త సంసార బాధ్యతలలో మునిగి ఉన్నప్పుడు కూడా కవితలు రాయమని బాగా ప్రోత్సహించేవారు. మా అమ్మ కి కూడా చాలా ప్రతిభ ఉంది అనీ, తప్పకుండా రాయమనీ చెప్పేవారు. ఎప్పుడూ ఎవరి కవితలని కించపరిచేవారు కాదు, సవరించేవారు కాదు. ఎవరి శైలిలో వారు రాసే స్వేచ్ఛని ఇచ్చేవారు. ఎప్పుడైనా మేము ఆత్మస్థైర్యం కోల్పోయినప్పుడు “నీకు హనుమంతుడి లాగా నీ సామర్థ్యం నీకు తెలియదు. నువ్వు తప్పకుండా సాధిస్తావు” అనేవారు.

మా నాన్న సంఘర్షణలకి దూరంగా ఉండేవారు. టీ.వీ. లో కూడా హాస్యపూరిత కార్యక్రమాలు ఎక్కువగా చూసేవారు. ఆయనది ఎంత జాలి గుండె అంటే, పిల్లలని వాళ్లకి తెలియని ప్రశ్న ఎవరైనావేస్తే తానే సమాధానం చెప్పేవారు. “వాళ్లకి తెలియని విషయం అందరిలో అడిగితే నొచ్చుకుంటారు” అనేవారు.

ఇలా ఆయన సున్నిత మనస్తత్వాన్ని, ప్రేమ తత్వాన్ని చూసిన మేము ఆయన అనారోగ్యం విషయంలో అంత దృఢంగా, నిశ్చలంగా, ధైర్యంగా ఉంటారని ఊహించలేదు. ఆయన ఒక నడిచే నీతి పుస్తకం వంటివారు. ఇప్పుడు మా మధ్య లేకపోయినా ఆయన ఆదర్శ జీవితం మమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. ఆయన ఆశీస్సులు మమ్మల్ని కాపాడుతాయి. ఆయన రాసిన కవితలు మమ్మల్ని మా కర్తవ్యం వైపు నడిచేలా ప్రోత్సహిస్తాయి.


## చిరునామా

### మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా

సంపాదకుడు, మూసీ మాసపత్రిక,

ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,

బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,

హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.

అకౌంట్ నెం. 52019740642

IFS Code : SBIN0020083

editormusi@gmail.com



## మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి

వెంటనే శాశ్వత చందాదారులు కండి.

సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక

పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక

యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన

తెలుగు పరిశోధనా పత్రిక

శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

సంప్రదించండి.

మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177




ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 12

హైదరాబాద్ అక్టోబర్ : 2024

# డా. అయాచితం నటేశ్వర శర్మ గారికి అశ్రు పుష్పాంజలి

**డా. గణపతి అశోక శర్మ,** నిజామాబాద్. ఫోన్ : 9440004243



**శ్రీవాగ్వైభవవేంకటేశ్వరులకు సాక్షీభూతమౌ వాసమం**
**దీ వావిద్యలలో శిరోమణిగ వాగీశప్రసూనమ్ముగా**
**దైవీదత్త వరప్రదానతఁ గవిత్వ వ్యాకృతీశాస్త్ర పుం**
**భావాకార సరస్వతీవనఁగ నొప్పంజెల్లు నీవీయెడన్**

సంస్కృత సాహిత్య సారస్యమునుఁజూప। మల్లినాథుల వాక్యమాన మనఁగ
పాతంజలపుమహాభాష్య విజ్ఞత నా న। వాహ్నిక రూపమ్మ యనఁగ
ఆముక్తమాల్యదా ప్రాముఖ్యముఁజూప। విష్ణుచిత్తీయమై వెలిఁగె ననఁగ
ప్రాచ్యవిద్యా పరిషదీయభావ సంస్కృతీ ప్రచార ప్రసంగవాగ్దీప్తి యనఁగ
మీ యశో నంతజయలక్ష్మి మేల్తనువుగ। నౌ యయాచితాన్వయ నటేశార్యుఁడీవ
ప్రామాణిక కవితాబద్ధ గ్రంథములెంచి। రాష్ట్రీయ జాతి మర్యాదఁజూపె
ధారయందు కవిత్వ ధారణానైపుణి। నవధానరంగమీ యవధిఁజూపె
పాండితీప్రతిభా విభవమెంచి దిగ్దంతి। తలవంచి తలకెత్తి వలపుఁజూపె
దివ్య దాశరథి ప్రతిభకు కేతనమునౌ। సత్పురస్కారమ్ము శక్తిఁజూపె
దిక్కరులురంగనాథులీ దీప్తిఁ దెల్ప। నమరనాథులాసౌందర్యమరయనెంచి
మిమ్ముఁ గనఁబిల్చిరా? వేఁగ మమ్ము వీడి। తటె? నటేశ్వర శర్మావధానివర్య !
ఆ పతంజలి పశ్పశాహ్నికమ్మును మీ ము। ఖమ్మున విననెంచి రమ్మనియినొ?
గౌడపాదులు శిష్యకావ్యసౌందర్యంపు। రసతంత్రము లెరుంగ రమ్మనియెనొ?
కాళిదాసుఁడును మాఘభారవులు మీ। రచనలం దముఁజూడ రమ్మనాయెనొ ?
తిరుపతి వేంకటేశ్వర నామికావధాన। రంగనాథులుఁ జూడరమ్మనియెనొ?
అమరనాథునెదుట కమనీయకావ్యాల। పై మహాత్ములంతఁ బ్రస్తుతింప
తత్సుధారసమును తానుఁగ్రోలఁగనెంచి। మిమ్ము నింద్రుఁడటు రమ్మనియెనొ?
మూన్నాళ్ళ క్రింద గణపతి। నాన్నయు నమ్మలు తమకృతినాణ్యతఁ దెలుపన్
చాన్నాళ్లకు శివుడట్టి ర। సాన్నానందింపమీకు స్వాగతమనెనో ?
మీ లేఖనామాధురీలహరిని గాంచి। గీర్వాణి మిముఁజూడఁ గీరెనేమొ ?
మీ కుంచియ కదలింపా కవిబ్రహ్మ తా। నది నేర్వ నిన్బిల్వ నంపెనేమొ ?
మీ చిత్ర లేఖనావైచిత్ర్యమును గాంచి। చిత్రగుప్తుని గన్నుచిదిరె నేమొ?
సమయపాలనమందు శ్రద్ధఁజూపెడుమిమ్ము। దర్శింప ధర్ముండు తలచెనేమొ?
నిర్జరాదులు నెల్ల బూర్జపత్రములంది। మీ కవితల రాయ రాకఁ గోర
దివికి ఁ జేరితేమొ ధీనటేశ్వర శర్మ ! ప్రాంజలింతుమేము వాక్యతతుల
అశ్రు నయనముల పదార్థశయ్యసడల। గణయతినియతులవి గతులుతప్ప
వణకుచేతులెత్తిపలుకు శ్రద్ధాంజలిఁ। జేకొనుమ నటేశ చిత్స్వరూప !

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



**ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....**

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

State Bank of India, Nallakunta Branch,

A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083

**రండి... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.**

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma

Scanned with OKEN Scanner